
www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 24-4-2025 | పేజీలు: 12 + 8 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 23 సంచిక (Issue) : 22 | శ్రీవిశ్వావసునామసంవత్సరం, ఉత్తరాయణం, వసంతరుతువు, చైత్రమాసం, బహుళ పక్షం, తిథి: ఏకాదశి మ.2:33 తదుపరి ద్వాదశి, నక్షత్రం: శతభిషం ఉ.10:49 తదుపరి పూర్వాభాద్ర, వర్జ్యం:సా.4:42-6:10, దుర్ముహూర్తం: ఉ.10:07-10:58, మ.3:09-3:59, అమృతఘడియలు: రా.1:31-2:59, రాహుకాలం: మ.1:30-మ.3:00, సూర్యోదయం: 5:56, సూర్యాస్తమయం: 6:29 | తాడేపల్లిగూడెం సిటీ

Tadepalligudem | Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


TIRUMALA
A/C Hostel Day Scholar
E. M. SCHOOL
Jr. COLLEGE
IIT & MEDICAL ACADEMY
రాజమహేంద్రవరం
కాతేరు, రాజమహేంద్రవరం, తూర్పు గోదావరి జిల్లా.
Cell : 79970 71672, 83090 76048
విశాఖపట్నం
Cell : 98489 86450, 98489 86451
భీమవరం
ప్రకృతి ఆశ్రమం, భీమవరం, పశ్చిమ గోదావరి జిల్లా.
Cell : 99513 94087, 91826 23317
తణుకు
కొమరవరం, ఇరగవరం రోడ్డు, తణుకు, పశ్చిమ గోదావరి జిల్లా.
Cell : 73866 20777, 73966 15777
పాయకరావుపేట
Cell : 80084 78777, 85209 26777
OUR BEST MARK in SSC-2025
10వ తరగతి ఫలితాలలో తిరుమల విజయ దరహాసం
597 600
Y. LAASYA SRI SAI
4గురు విద్యార్థులకు 596 600
U. JASWANTH PAVAN
Ch. S. BHARDWAJ
K. DURGA KASHYAP
K. SRIVALLI
7గురు విద్యార్థులకు 595 600
CH LASYA HARSHITA
S. NANDINI
D. Ch. SAHASRA
A. LAKSHMI DIVYA
B. KEERTHI SREE
G. VARUN VARSHITH
B. KALYAN RAM
594 600 M. VAMSHITHA
594 600 E. DIVYA SRI
594 600 K. VASANTH
594 600 B. SAATVIKA
594 600 I. HANSUJA
594 600 B. SHARA ZENITHA
594 600 Y. ARPITHA VIJAYA
594 600 A KHYATHI MODHIKA
594 600 N. AMRUTHA VARSHINI
594 600 K. TANVEER
594 600 D. HARSHITHA
593 600 Y. NITYA SRI
593 600 K. SRI VARSHINI
593 600 T. SURYA SUHAAS
593 600 MD SAIF QURESHI
593 600 K. SRAVANI
593 600 P. NIKHIL RAJ
593 600 K. HARSHA VARDHAN
593 600 S. ROSHINI
593 600 T. KUSUMANJALI
593 600 CH. KEERTHI
593 600 SK. MUBEEN
592 600 M. M. HASITHA
592 600 P. VENKATA DURGA
592 600 K. BHAVISHYA
592 600 R.T.S. DURGA
592 600 N. SANDHYA
592 600 B. AMRUTHA
592 600 K. JAHNAVI
592 600 P. SUDEEPTHI
592 600 CH. DHRITI SRI
592 600 K. KARTHIKA
592 600 V. PADMASAHITI
592 600 P. KARTHIKA
592 600 G. VENKATA SAI
592 600 B. KEERTHI PRIYA
592 600 B. POOJITHA
592 600 U. LAASYA MADHURI
592 600 M. POOJITHA
592 600 L. AKSHAYA KUMAR
592 600 B. AMOGH
592 600 P. CHAITANYA
591 600 P. LALITHA PRIYA
591 600 R. CHAHNA
591 600 T. ESWARI
591 600 V.L. SOWJANYA
591 600 V. GANESH GUPTHA
591 600 D. NAVYA TARAKA
591 600 R. L. KARTHEEK
591 600 N.N.V.P. KUMAR
591 600 G. NAKSHATRA
591 600 P.G. PARDHAVI
591 600 G. TEJA KUMAR
591 600 K. AVINASH
591 600 M. AKSHAYA
591 600 D. TEJA
591 600 R. VARSHINI
591 600 S.T.P. PRANAMYA
591 600 K. SAI CHARAN
591 600 S. AKASH
591 600 G. AKSHAYA
591 600 Y. SAI DEEP
591 600 CH. NISHANTH
591 600 E. DIVYA
591 600 R. G. SUDHEEP
590 600 A. VARSHITHA DEVI
590 600 D. SUDHA MADHURI
590 600 V. LASYA SRI
590 600 M. AKSHAY ANGELIN
590 600 M. VINOOTHANA
590 600 Y. CHARAN
590 600 K. SAI SATHYA VALLI
590 600 T.R.S.S. MANASWINI
590 600 K. ROHITH
590 600 P. KUMIDHVINI
590 600 K. ANGELINA VINCY
590 600 N. POOJITHA
590 600 Y. TEJA SAI VAMSI
590 600 P. SAHITHI
590 600 I. PRAVEEN KUMAR
590 600 P. JAHNAVI
590 600 K. AVINASH
590 600 T. SASHREETH
590 600 G. SURYA VARSHINI
590 600 B. RESHMA SRI
590 600 G. MOHIT CHANDRA
590 600 P.K. SANDEEP
ఉత్తీర్ణత శాతం : 100%
మార్కుల విశ్లేషణ
పరీక్షకు హాజరైన వారు : 2732
590 & above ... 99
580 & above ... 582
570 & above ... 1114
560 & above ... 1517
550 & above ... 1798
500 & above ... 2478
2025 - ఇంటర్ ఫలితాలలో తిరుమల ప్రభంజనం
Sr. INTER
8 మంది విద్యార్థులకు 991 1000
M. PRIYA HASINI
M. LEKHANA
CH. HARI SURYA
P. PAVITRA
K. MANASA
S. SAI LIKHITHA
P. D. KAVYA SRI
SK. FATHIMUNNISA BEGUM
26 మంది విద్యార్థులకు 990 1000
CH HASINI
V S RAMA RAJU
V L DURGA
V RESHMA SRI
K PRAGNYA
B Y LOVA SWAMI
RYD PRAVEEN
M RAJ KUMARI
I SAI SINDHURA
K VANDANA
M DURGA PRAV
G SATYA SRI
G SHRI HARS
K SRUJANA
M HARSHITHA
J SAI BRUNDA
MD ASHRAF
Y SNEHITHA
K SRUTHILAYA
K TULASI
P N VYSHNAV
CH RENUKA
VAISHNAV
B HARSHITHA
N MANI
G RITIKA
980 మార్కుల పైన 1161
950 మార్కుల పైన 3669
900 మార్కుల పైన 5130
హాజరైన వారు : 6920
ఉత్తీర్ణత శాతం : 99.3
Jr. Inter MPC
5గురు విద్యార్థులకు 467 470
U. VIRONIKA
M. HARSHITHA
S. TEJA
G. NAVEEN TEJA
A. VENKATA SAI LIKHI
46 మంది విద్యార్థులకు 466 470
V MANIKANTA
K SUSHMITHA
R YASWANTH
A AVYUKTHA
L DIVIJA
P HEMANTH
G B BALAJI
P KEERTHI SRI
B VEDA SAI SRI
V MANIKANTA
M JAYASRI
B SRIKAR
B JWALITHA
V S SIDDARTHA
K V LAKSHMI
R MANOJ
B UDAY KIRAN
S MADHU SRI
G PUNDAREESH
P MANOHAR
K NIRMALA
N SURASMI
R MADHURI
K TAPASWI
D NAVYA
M SARANYA
P SRIRAM
V ABHINAYA
D SRIVALLI
B SAI KUSAMA
S LAVANYA
J LALITHA DEVI
CH PRAJHNA
D GEETHIKA
P SAI SOWMYA
K GAYATHRI
M CHAITANYA
R HEMA CHARAN
A PRAJWALITHA
K LALITADITHYA
B SIDDHARTDHA
M BHAGAVATHI
J SRILAXMI
Y THANUSRI
K DEEPIKA
K SPANDANA
460 మార్కుల పైన 1732
450 మార్కుల పైన 3464
400 మార్కుల పైన 5774
హాజరైన వారు : 8101 ఉత్తీర్ణత శాతం : 98.5
Jr. Inter BiPC
12 మంది విద్యార్థులకు 436 440
K SUPRIYA
A TEJASWANI
CH NEHA GRACE
G M RUPA
J BHAVITHA
K GAYATHRI
T SARAYU
B YASASWINI
SK SHAMINA
R VIVEK
P GANESH
CH MEGHANA
25 మంది విద్యార్థులకు 435 440
MD NAZMA ARFA
D LEECY
K NAVYAMRUTHA
L SRAVANTHI
K NAVYA
M L HARSHINI
K KEERTHI
S THANUSRI
U AKSHAYA
R BHARGAV
S CHAITANYA
G VARSHITHA
K VARSHINI
P L PRIYA
BV SANDEEP
P MOUNIKA
D YOGESWARI
V RISHITHA
V RADHA LAKSHMI
D NATASHA
K RESHMA SRI
N S PRIYA
Y MERCY VEENA
K HASINI
P M D PRASAD
430 మార్కుల పైన 192
420 మార్కుల పైన 408
370 మార్కుల పైన 681
హాజరైన వారు 884
ఉత్తీర్ణత శాతం 99.2

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

గురువారం | 24-4-2025

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

తాడేపల్లిగూడెం సిటీ

మెడికల్ కళాశాల హాస్టల్‌కు స్థల పరిశీలన



ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు మెడికల్ కళాశాలకు సీనియర్ హాస్టల్ బ్లాక్స్ నిర్మాణానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం స్థలం పరిశీలించారు. కలెక్టరేట్ సమీపంలోని సుమారు 1.55 సెంట్లు ఏటిగట్టు స్థలాన్ని ఆమె పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ శేషగిరి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షల్లో 77.24% ఉత్తీర్ణత

రాష్ట్రంలో 21 స్థానంలో నిలిచిన ఏలూరు జిల్లా

పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జిల్లాకు 77.24శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 21వ స్థానం దక్కింది. గత ఏడాది ఉత్తీర్ణతతో పోల్చితే ఈ ఏడాది 3 శాతం తగ్గినప్పటికీ, రాష్ట్రస్థాయిలో 25వ స్థానంలో నిలవగా ప్రస్తుతం 21 స్థానంలో ఉండడం ఊరట కలిగించే విషయం. జిల్లాలో పది పరీక్షలకు మొత్తం 22,365 మంది విద్యార్థులు హాజరుకాగా, 17,274మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 11,197 మందికి 9,128మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 11,168మందికి 8,146 మంది విజయం సాధించారు.



ఫలితాలపై సంతృప్తి

పది పరీక్ష ఫలితాలపై ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాల కోసం కృషిచేస్తాం. ఫెయిలైన విద్యార్థులను అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం ఆయా హైస్కూళ్లలో ప్రత్యేక తరగతులను ప్రారంభిస్తాం. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోరుకునే బాలబాలికలు మే 1లోగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మే 19 నుంచి 28 వరకు జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజును అపరాధ రుసుంలేకుండా ఈ నెల 30 వరకు, రూ.50 పెనాల్టీతో పరీక్ష తేదీ ముందు రోజు వరకు చెల్లించే వెసులుబాటు ఉంది.

- వెంకటలక్ష్మమ్మ, డీఈవో

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పది పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా స్థానం మెరుగుపడినా ఉత్తీర్ణతా శాతం గత ఏడాది కంటె తగ్గింది. మెరుగైన ఫలితాలకోసం అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో పండుగ రోజులు, సెలవు దినాలు సహా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. తుది ఫలితాల్లో ఆశించిన ఉత్తీర్ణత దక్కలేదు. ఈ ఫలితాలు 'నిజంగా కష్టపడి చదివి' పరీక్షలు రాసిన విద్యార్థులవని ఒక విద్యాధికారి విశ్లేషించగా, ప్రాథమిక స్థాయి నుంచి పునాది లేకుండా ఒకేసారి టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు ఆశించడం సరికాదని మరో విద్యాధికారి అభిప్రాయపడ్డారు. బాగా చదివేవారిని విభజించి వారికి పాఠ్యాంశాల బోధన కొనసాగిస్తూనే, వెనుకబడిన విద్యార్థులకు తొలి మూడు నెలల కాలంలో చదవడం, రాయడం వంటి బేసిక్స్‌పై తర్ఫీదు నిచ్చిన అనంతరమే పూర్తిస్థాయిలో బోధించడం ద్వారా మంచి ఫలితాలను తీసుకురావచ్చని సుదీర్ఘ అనుభవం ఉన్న మరో విద్యాధికారి పేర్కొన్నారు.

'ఓపెన్' టెన్త్‌లో వైఫల్యం

దూరవిద్య పరీక్షల నిర్వహణలో జిల్లాలో కఠినతరమైన తనిఖీల ప్రభావంతో అభ్యాసకులు పొరుగు జిల్లాలకు వెళ్లిపోతున్న విషయం విదితమే. ఈ ఏడాది ఓపెన్ స్కూల్స్ టెన్త్ పరీక్షలకు జిల్లాలో 746మంది విద్యార్థులు హాజరుకాగా కేవలం 92మంది (12.33శాతం)మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల్లో 'ఓపెన్ బుక్' పద్ధతిని నిరోధిస్తుండడమే జిల్లాలో ఉత్తీర్ణత భారీగా తగ్గిపోడానికి కారణమని ఓ విద్యాధికారి కుండబద్దలుకొట్టారు. ఇక దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షలకు 955 మంది విద్యార్థులు హాజరుకాగా 366మంది (38.32శాతం) ఉత్తీర్ణులయ్యారు. వచ్చేనెల 19 నుంచి జరిగే దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షలకు టెన్త్ విద్యార్థులు సబ్జెక్టు ఒక్కంటికి రూ.100చొప్పున, ఇంటర్ విద్యార్థులు సబ్జెక్టు ఒక్కంటికి రూ.150చొప్పున ఈ నెల 26నుంచి మే 5వ తేదీవరకు ఏపీ ఆన్‌లైన్‌ద్వారా చెల్లించాలని డీఈవో సూచించారు.

వెనుకబడిన జడ్పీ ఉన్నత పాఠశాలలు

పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో సంఖ్యాపరంగా జిల్లాలోని 179 జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 10,161మంది హాజరుకాగా, వీరిలో 6612మంది (65.07శాతం) ఉత్తీర్ణులయ్యారు.178 ప్రైవేటు అన్‌ఎయిడెడ్ హైస్కూళ్ల నుంచి మొత్తం 8405 మంది బాలబాలికలు హాజరుకాగా 7974మంది (94.87 శాతం) విజయం సాధించి జిల్లాలో టాప్‌స్థానంలో నిలిచారు. ఇక పరీక్షలకు వందల సంఖ్యలోనే విద్యార్థులు హాజరైన ఎయిడెడ్ పాఠశాలల నుంచి 572 మందికి 379 మంది, ఏపీ రెసిడెన్షియల్ 238 మందికి 236, బీసీ వెల్ఫేర్ 40 మందికి 38, ప్రభుత్వ హైస్కూల్స్‌లో 518 మందికి 290, కేజీబీవీ 107 మందికి 104, మునిసిపల్ పాఠశాలల నుంచి 761మందికి 481, సోషల్‌వెల్ఫేర్ 621 మందికి 557, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 618 మందికి 427, ట్రైబల్‌వెల్ఫేర్ ఆశ్రం గురుకులాల్లో 324 మందికి 176మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులలో అత్యధికంగా ఫస్ట్ డివిజన్‌లో 7169మంది ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల నుంచి ఉండగా, తదుపరి స్థానంలో 3925మందితో జడ్పీ హైస్కూళ్లు ఉన్నాయి. ఏలూరులోని పాఠశాలల్లో జిల్లాలోనే అత్యధికంగా 838 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు.

వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్యూర్స్..

పది పరీక్షలు రాసిన విద్యార్థులు 5091 మంది ఉండగా, అత్యధికంగా 3549 మంది జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచే ఉండడం గమనార్హం. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ఫెయిలైన మొత్తం బాలబాలికల్లో తెలుగు సబ్జెక్టులో 1328 మంది, హిందీ 626, ఇంగ్లీషు 2221, గణితం 3734, సైన్స్ 3225, సోషల్ స్టడీస్ 2945 మంది ఉన్నారు.

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలు

పోటాపోటీ

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు పోటీపడ్డారు. అందరికంటే అత్యధికంగా ఏలూరు శాంతినగర్ ఆక్స్‌ఫర్డ్ హైస్కూలు విద్యార్థిని బళ్ల గగనశ్రీ 597/600 స్ట్రైక్ రేట్‌తో మార్కులు సాధించి ఈ ఏడాది 'పది' పరీక్షల జిల్లా టాపర్‌గా నిలిచింది. ఆమె తల్లిదండ్రులు వ్యాపార రంగంలో ఉన్నారు. ఇక ప్రభుత్వ పాఠశాలల నుంచి టాపర్లలో ఆగిరిపల్లి మండలం ఎం.సురవరం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి గిడుతూరి జనార్థన్ బాబు 588మార్కులు, మండవల్లి మండలం లింగాల జడ్పీ హెచ్ఎస్ విద్యార్థి బాసా ధీరజ్‌సాయి విశాల్ 587 మార్కులు, కలిదిండి జడ్పీహెచ్ఎస్ నాయుడు హర్షవర్థిని, కామవరపుకోట జడ్పీహెచ్ఎస్ చిలుకుబత్తుల సూర్యదీప్తిలకు 586 మార్కులు సాధించారు. చింతలపూడి జడ్పీహెచ్ఎస్ కానూరి పూజిత 585, పెదపాడు మండలం వీరమ్మకుంట జడ్పీహెచ్ఎస్ కలిపిండి నిహారిక 584, ఏలూరు రూరల్ మండలం శనివారపుపేట జడ్పీహెచ్ఎస్ సుంకర లక్ష్మీపూజ 583, ఆగిరిపల్లి జడ్పీ హెచ్ఎస్ నక్కా హేమ నాగ త్రివేణి, మండవల్లి జడ్పీహెచ్ఎస్ నండూరి లక్ష్మీసంహితలకు 582 మార్కులు చొప్పున, కైకలూరు జడ్పీహెచ్ఎస్ సేకం ప్రణతి వైష్ణవి, ఏలూరు శనివారపుపేట జడ్పీ హెచ్ఎస్ అడిగర్ల నవీన్‌కు 581 మార్కులు చొప్పున వచ్చాయి.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు

చాట్రాయి మండలం సి.గుడిపాడు జడ్పీ హెచ్ఎస్, ద్వారకాతిరుమల జడ్పీ హెచ్ఎస్, కుక్కునూరు మండలం వేలేరు కేజీబీవీ, నూజివీడు మండలం అగిరిపల్లి జడ్పీ హెచ్ఎస్, అప్పలరాజుగూడెం ఏపీ రెసిడెన్షియల్ స్కూలు నూరుశాతం ఉత్తీర్ణతను నిలబెట్టుకున్నాయి.

ఐఏఎస్ కావడమే లక్ష్యం



పదిలో కలిదిండి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎన్.హర్షవర్థిని 586 మార్కులు సాధించింది. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని తెలిపింది. తల్లిదండ్రుల సహకారంతో కష్టపడి చదవడంతో మంచి మార్కులు వచ్చాయి. ఉపాధ్యాయులు ఉత్తమ బోధన చేశారని తెలిపింది.

- కలిదిండి, ఆంధ్రజ్యోతి

సివిల్స్ ర్యాంక్ సాధిస్తా



సివిల్ మంచి ర్యాంక్ సాధించి దేశానికి సేవ చేయడమే లక్ష్యమని బాస ధీరజ్ సాయి విశాల్ అన్నారు. లింగాల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి 587 మార్కులు సాధించి ఏలూరు జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. తండ్రి భాస రవికుమార్ ఫొటోగ్రాఫర్.

- మండవల్లి, ఆంధ్రజ్యోతి

ట్రిపుల్ ఐటీకి వెళతా



కామవరపుకోట జడ్పీ హైస్కూల్ విద్యార్థిని చిలుకుబత్తుల సూర్యదీప్తి పదో తరగతిలో 586 మార్కులు సాధించింది. పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించానని చెప్పింది. తల్లిదండ్రులు కూలి పనులు చేసి తనను చదివించారని, ట్రిపుల్ ఐటీలో చేరతానంది.

- కామవరపుకోట, ఆంధ్రజ్యోతి

ఐఐటీలో ఇంజనీరింగ్ లక్ష్యం



స్థానిక సుబ్బరాజు హైస్కూల్‌లో చదివిన కె.పూజిత 585 మార్కులు సాధించింది. ఐఐటీలో ఇంజనీరింగ్ చేయడం తన లక్ష్యమని తెలిపింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే సాధించానని చెప్పింది.

- చింతలపూడి, ఆంధ్రజ్యోతి



ఏలూరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన నేతలు, కార్యకర్తలు

లోపలి పేజీల్లో

పహల్గామ్‌లో ఉగ్రదాడి దారుణం

కలచివేసింది : ఎంపీ మహేశ్

కొవ్వొత్తులతో బీజేపీ, జనసేన నేతలు, కార్యకర్తల ర్యాలీ

సమష్టి కృషితో లక్ష్య సాధన

ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి

పీజీఆర్ఎస్‌లో అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి

మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్



గోనె సంచులను పరిశీలిస్తున్న జేసీ

ధాన్యం సంచులు సిద్ధం

జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

భీమడోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలనులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి బుధవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచుల వివరాలు, కొనుగోలు లక్ష్యం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు సిద్ధం ఉన్నాయన్నారు. సంచులు కూడా నాణ్యతగా ఉన్నాయన్నారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా, ఏవో ఉషారాణి, ఏడీఏ ఉషారాజకుమారి, రైతులు పాల్గొన్నారు.

10లోగా ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలి : కలెక్టర్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్, బీపీ, మధుమేహం, తదితర అసంక్రమిత వ్యాధుల నియంత్రణలో భాగంగా ఇంటింటా చేపట్టిన ఎన్‌సీడీ సర్వే మే 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఎన్ఆర్‌పేట అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. ఆమె ఎన్‌సీడీ సర్వేపై వైద్యాధికారులతో సమీక్షించారు. నిర్థిత సర్వే రోజువారీ లక్ష్యాలను పూర్తిచేయనివారికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నరేంద్రకృష్ణ, మెడికల్ ఆఫీసర్ ప్రగతి, తహసీల్దార్ శేషగిరి పాల్గొన్నారు.

డిజిటల్ అరెస్ట్ అంటూ.. రూ.15.50 లక్షలు కొట్టేశారు 3

పశువైద్యంపై సర్వే

పారదర్శక సేవలకు ప్రభుత్వం కసరత్తు

పశు సంవర్ధక శాఖ జేడీ గోవిందరాజు



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పశుసంవర్ధకశాఖ నిర్వీర్యం అయ్యింది. గత ఐదేళ్లలో ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, నూతన భవనాలు నిర్మించడం గానీ జరగలేదు. కనీసం ఉన్న పాత భవనాల మరమ్మతులకు కూడా వైసీపీ ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు. గత ఐదేళ్లలో డాక్టర్లు, సిబ్బంది నియామకాలు చేయకపోవడంతో వైద్యం కూడా కుంటుపడింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వచ్చిన 10 నెలల్లో పశు సంవర్ధక శాఖను పటిష్టం చేయడానికి సర్వే చేస్తున్నారు. పశువుల ఆస్పత్రులలో సౌకర్యాలు మెరుగుపరిచి, డాక్టర్లు, సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపడుతున్నారు.

- పశువుల ఆసప్రత్రుల్లో సౌకర్యాల కల్పన
- గ్రామాల్లో పారదర్శకంగా వైద్య సేవలు
- నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఏలూరు/ఏలూరు టూటౌన్(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 23: జిల్లాలో పాడి పశువుల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి బుధవారం ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్ చేపట్టింది. రైతులు ప్రస్తావించిన సమస్యలపై పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ టి.గోవిందరాజు సమాధానం ఇచ్చారు. ఆస్పత్రి భవనాలన్నీ పాతబడిపోయామని, వర్షాలొస్తే ఆస్పత్రుల్లో నీరు చేరి మందులు కూడా తడిసిపోతున్నాయని రైతులు తెలిపారు. డాక్టరు, సిబ్బంది అందుబాటులో ఉండరని, వైద్యం సకాలంలో అందక పశువులకు జబ్బులు పెరిగిపోవడం, చనిపోవడం జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో డాక్టర్ల పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పారదర్శకంగా సేవలందించేందుకు పర్యవేక్షణపై జేడీ సమాధానాలు..

- పెదగొన్నూరులో పశువుల ఆసుపత్రి కూలి పదేళ్లయింది. పక్కనే షెడ్లలో వైద్యం అందించడం ఇబ్బందిగా ఉంది.

- సత్యనారాయణ, పెదగొన్నూరు, ముదినేపల్లి మండలం

జేడీ: పశువుల ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదికను పంపాం. నాబార్డు ఆర్ఐడీఎఫ్ నుంచి నిధులు మంజూరు కావాలి. రాగానే నిర్మాణం చేపడతాం.

- సానారుద్రవరంలో డాక్టర్ అందుబాటులో లేక పశువులకు వైద్యం సకాలంలో అందడం లేదు. ఆస్పత్రి భవనం శిథిలం కావడంతో వర్షం వస్తే మందులు తడిచిపోతున్నాయి.

- ఎస్ సుబ్బారావు సానారుద్రవరం, కలిదిండి మండలం

జేడీ: డాక్టర్ పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. పొరుగున ఉన్న డాక్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించాం. డాక్టర్ అందుబాటులో లేని సమయంలో వెటర్నరీ అసిస్టెంట్లు వైద్యం అందిస్తారు. ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- పశువుల ఆసుపత్రి ఆవరణ దుర్వాసన వస్తోంది. డాక్టర్లు కూడా సరిగ్గా అందుబాటులో ఉండరు.

- లక్ష్మణ్, భీమడోలు

జేడీ: ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో వెటర్నరీ డాక్టర్ల పోస్టులు 18 ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం భర్తీ చేయగానే ఇక్కడ డాక్టర్‌ను నియమిస్తాం. ప్రస్తుతం ఇన్‌చార్జి డాక్టర్ వైద్య సేవలందిస్తున్నారు.

- ఇంత వరకు మా గ్రామంలో పశువులకు వెటర్నరీ సిబ్బంది గాలికుంటు వ్యాధి టీకాలు టీకాలు వేయలేదు.

- మధుసూధనరావు, శివపురం, చింతలపూడి మండలం

జేడీ: మా సిబ్బంది ఇంటింటికి తిరిగి గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నారు. ఇంకా జరుగుతూనే ఉంది. ప్రాధాన్యతా క్రమంలో కొంచెం ఆలస్యం అయి ఉండవచ్చు. ఈరోజే సిబ్బందిని పంపి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తాం

- ఇటీవల మా పశువులకు జబ్బు చేసింది. పశువుల ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో లేరు.

- జి.నాగేశ్వరరావు, జనార్థనవరం, చాట్రాయి మండలం

జేడీ: పశువుల ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడం వాస్తవం కాదు. ఈ విషయంపై విచారణ చేస్తాం. ప్రస్తుతం ఇన్‌చార్జి డాక్టర్ ఈదర నుంచి వచ్చి సేవలందిస్తున్నారు. పశువులకు బీమా చేయించడానికి స్థానికంగా సిబ్బందిని సంప్రదించండి.

- వెటర్నరీ సిబ్బంది ఇంజక్షన్లు చేస్తే గంటల్లోనే పశువులు చనిపోతున్నాయి. మా పిల్లికి ఇంజక్షన్ వేయించగానే చనిపోయింది. గతంలో కూడా ఇలా జరిగింది.

- అక్బర్ బాషా, జగన్నాథపేట, పోలవరం మండలం

జేడీ: ఇంజక్షన్ ఇవ్వగానే చనిపోవడం అనేది జరగదు. పశువులకు వ్యాధి ముదిరిన తర్వాత తీసుకువచ్చి ఉంటారు. విచారణ చేసి నిజాలను తేల్చుతాం.

- మా ఊరిలో పశువుల ఆసుపత్రి లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షాకాలం వర్షపు నీటితో నిండిపోతోంది.

- కృష్ణమోహన్, బుట్టాయగూడెం గ్రామం

జేడీ: ఆ ప్రాంతాన్ని మా సిబ్బంది పరిశీలించి, తగు నివేదిక తయారు చేస్తారు. అనంత రం ప్రభుత్వానికి మరమ్మత్తులకు నిధుల కొరతాం.

- పశువైద్యశాలలో సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో సీజనల్ వ్యాధులకు గురవుతున్నాయి. పశువైద్య శిబిరాలు నిర్వహించడం లేదు.


- ఎం మోహన్, చాటపర్రు, ఏలూరు రూరల్ మండలం

జేడీ: చాటపర్రులో డాక్టర్, సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 వరకు అందుబాటులో ఉంటున్నారు. సీజనల్ వ్యాధులకు ఎప్పటికప్పుడు టీకాలు వేస్తున్నాం. ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహించేలా తగు చర్యలు తీసుకుంటాం.

- మాదేపల్లిలో వెటర్నరీ సిబ్బంది కొరత ఉంది. సంచార పశువైద్య అంబులెన్స్ అందుబాటులో లేవు.

- కె.మోహన్‌రావు, మాదేపల్లి, ఏలూరు రూరల్ మండలం

జేడీ: పశువులకు అనారోగ్యం సోకితే సిబ్బందిని సంప్రదించండి. ఆసుపత్రికి తీసుకురాలేని పరిస్థితి ఉంటే సిబ్బంది ఇంటికి వచ్చి వైద్య సేవలందిస్తారు. సంచార వైద్య సేవల అంశంపై ప్రభుత్వం పరిధిలో ఉంది.



పట్టిసీమ డీసిల్టేషన్ పాయింట్

ఇసుక కష్టాలు తీర్చేలా

- పట్టిసీమ, గూటాలలో 43,201 మెట్రిక్ టన్నుల లభ్యత
- పడవల ద్వారా వెలికితీత

ఏలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భవన నిర్మాణాలకు వేసవి, వర్షాకాలాల్లో ఇసుకను అందుబాటులో ఉంచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. పోలవరం మండలంలో పట్టిసీమ డీసిల్టేషన్ పాయింట్ నుంచి గతంలో నిలిపివేసిన ప్రాంతం నుంచే మళ్లీ ఇసుకను బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా వెలికితీతకు జిల్లా యంత్రాంగం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టినందున పట్టిసీమ పాయింట్ నుంచి రెండు, మూడు రోజుల్లో ఇసుక వెలికితీత చేపట్టాలని జిల్లా ఇసుక కమిటీ నిర్ణయం తీసుకుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనలో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు ఇసుకను నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు అడుగులు వేస్తున్నారు. పట్టిసీమ నుంచి బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా పడవలపై ఇసుకను ఒడ్డుకు తేనున్నారు. జిల్లాలో డీసిల్టేషన్ పాయింట్ నుంచి 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు యంత్రాంగం పర్యావరణ అనుమతులను సాధించగా, ఫిబ్రవరి 23 నాటికి 1799 మెట్రిక్ టన్నులను వెలికితీశారు. ఇప్పుడు మిగిలిన బ్యాలెన్స్ నిల్వలు 28,201 మెట్రిక్ టన్నులను ఇసుకను ప్రజా అవసరాలకు వినియోగించనున్నారు. ఇక్కడ ఒక మెట్రిక్ టన్ను ఇసుక ధరను రూ.229 జిల్లా కమిటీ నిర్దేశించింది. ఇక్కడ తీసిన ఇసుక రెండు నెలల అవసరాలకు సరిపోతుందని అంచనా. దీంతో పాటు గూటాల -1 పాయింట్ నుంచి మరో 15వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు యంత్రాంగం అనుమతులు పొందినట్లు జిల్లా గనులశాఖ డీడీ రవికుమార్ తెలిపారు. మొత్తం మీద 43,201 మెట్రిక్ టన్నుల ఇసుక జిల్లా అవసరాలకు అందుబాటులోకి రానుంది.

నేటి నుంచి చైతన్య భారతి నాటిక పోటీలు

భీమవరం అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): భీమవరం గన్నాబత్తుల క్రీడా మైదానంలో గురువారం నుంచి నాలుగు రోజులపాటు జరగనున్న చైతన్య భారతి 18వ జాతీయస్థాయి నాటిక పోటీల ఏర్పాట్లు పూర్తయ్యాయని చైతన్య భారతి నృత్య నాటక పరిషత్ అధ్యక్షుడు రాయప్రోలు భగవాన్ తెలిపారు. గురువారం నిర్వహించే నాటక పోటీలో ప్రముఖ సినీనటుడు రావు రమేష్‌కు ఆత్మీయ చైతన్య పురస్కారం, సినీ నటుడు, రచయిత మిశ్రోకు చుక్కన సత్యనారాయణరాజు రంగస్థల చైతన్య పురస్కారం, నటీమణి మణిబాల పెనుపోతుల శేషగిరి రంగస్థల చైతన్య పురస్కారాలతో సత్కరిస్తామన్నారు. అనంతరం కళానికేతన్ కత్రపాడు వారిచే 'కిడ్నాప్', మైత్రి కళానిలయం హైదరాబాద్ వారి 'బ్రహ్మస్వరూపం' నాటక ప్రదర్శనలు జరుగుతాయన్నారు. ఈ పోటీలను కేంద్రమంత్రి శ్రీనివాసవర్మ, డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు, ఎమ్మెల్యే అంజిబాబు, కలెక్టర్ నాగరాణి ప్రారంభిస్తారన్నారు. 56 అడుగుల పొడవు, 36 అడుగుల వెడల్పుతో అతి భారీవేదికను నాటక ప్రదర్శన కోసం ఏర్పాటు చేస్తున్నామన్నారు. వేదిక ఏర్పాట్లను నిర్వాహకులు భట్టిప్రోలు శ్రీనివాసరావు, కట్రెడ్డి సత్యనారాయణ, పేరిచర్ల లక్ష్మణవర్మ, బొండా రాంబాబు తదితరులు పర్యవేక్షించారు.


నాటిక పోటీలకు సిద్ధమవుతున్న కళావేదిక


పోలవరం ప్రాజెక్టులో కాంక్రీటు మిశ్రమం పరిశీలన.. ల్యాబ్‌లో పరీక్షలు చేస్తున్న నిపుణుల బృందం

'పోలవరం'లో రెండోరోజు నిపుణుల బృందం పరిశీలన

పోలవరం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టులో రెండోరోజు బుధవారం కేంద్ర నిపుణుల బృందం పరిశీలించింది. ప్రాజెక్టులో డయాఫ్రంవాల్ ప్రాంతంలో కాంక్రీటు మిక్సింగ్, ల్యాబ్‌లలో కాంక్రీటు, రాతి నాణ్యతా ప్రమాణాలను పరిశీలన చేసింది. రాతి నాణ్యతా నిపుణులు సందీప్ దనోటే ఆధ్వర్యంలో గురువారం కూడా పరీక్షలు నిర్వహించి నమూనాలతో ఢిల్లీ తిరిగి వెళతారని, కాంక్రీటు నాణ్యతా నిపుణులు సిద్దార్థ్ హెడావే, విపుల్ కుమార్‌గుప్తా గురు, శుక్రవారాల్లో నాణ్యతా ప్రమాణాలు తదితర అంశాలు పరిశీలించి సేకరించిన నమూనాలతో ఢిల్లీ తిరిగి వెళతారని ఎస్‌ఈ రెడ్డి రామచంద్రరావు తెలిపారు.


ద్వారకాతిరుమలలో జరుగుతున్న ఉపనయనం.. అనివేటి మండప ఆవరణలో వివాహవేడుక

శ్రీవారి క్షేత్రంలో జోరుగా వివాహ, ఉపనయనాలు

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ఉపనయనాలు, వివాహాలు నిర్వహించేందుకు మంచి ముహూర్తం కావడంతో బుధవారం శ్రీవారి క్షేత్రం వేదికైంది. సాధారణంగా ఉపయనాలకు మంచిముహూర్తం కుదరదు. ఈ ఈ మాసంలో మంచిముహూర్తం కావడంతో, ఉపనయనాలు, వివాహాలు అనివేటి మండప ప్రాంతంలోను, పాత కల్యాణ మండపాల్లో శాస్త్రోక్తంగా జరిగాయి. అగ్నిక్రియలను జరిపించి శుభముహూర్త సమయంలో వటువులకు యజ్ఞోపవీత ధారణ జరిపారు. స్థానిక పాత కల్యాణమండప ప్రాంతంలోనూ ప్రైవేటు పంక్షన్ హాల్స్‌లోను వివాహాలు ఉదయం, రాత్రి ముహూర్తాలలో అధికంగా జరిగాయి. అంతా పూర్తయిన తర్వాత వటువులు, పెళ్లిజనాలు శ్రీవారు, అమ్మవార్లను దర్శించుకున్నారు.

బాలిక అదృశ్యం కేసును ఛేదించిన భీమవరం పోలీసులు

ఇంటికి తీసుకువచ్చి అప్పగించిన పోలీసులు.. కృతజ్ఞతలు తెలిపిన బాలిక తల్లిదండ్రులు

భీమవరం క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పశ్చిమ గోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి ఆదేశాలతో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి గంటల వ్యవధిలో 14 ఏళ్ల బాలిక మిస్సింగ్ కేసును భీమవరం టూటౌన్ పోలీసులు ఛేదించారు. బిడ్డను క్షేమంగా ఇంటికి తీసుకువచ్చి అప్పజెప్పిన పోలీసు అధికారులకు, సిబ్బందికి బాలిక తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. వివరాలివి.. భీమవరం టూటౌన్ ఏరియాకు చెందిన 8వ తరగతి చదువుతున్న బాలిక ఈనెల 22వ తేదీ సాయంత్రం 4 గంటల నుంచి కనిపించలేదు. బాలిక తల్లిదండ్రులు చుట్టుపక్కల, సమీప బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకకపోవడంతో అదేరోజు రాత్రి భీమవరం టూటౌన్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. తక్షణమే మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. భీమవరం టూటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.కాళీచరణ్, తన సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి బాలిక ఆచూకీ కోసం తొలుత జిల్లావ్యాప్తంగా లుక్ ఔట్ నోటీసులు జారీ చేసి డాగ్ స్క్వాడ్, డ్రోన్ల సాయంతో పరిసర ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించినప్పటికీ బాలిక ఆచూకీ తెలియరాలేదు. స్థానిక ప్రజలు, తోటి విద్యార్థులు చివరగా సదరు బాలికను గమనించిన చుట్టుపక్కల ప్రదేశాలలో గల పలు సీసీ టీవీ కెమెరాల ఫుటేజ్‌లను పరిశీలించి, ఆ బాలిక పూరీ-తిరుపతి ఎక్స్‌ప్రెస్‌లో విశాఖపట్నం వైపు ప్రయాణిస్తుందన్న సమాచారం మేరకు జిల్లా పోలీసు అధికారులు తుని, అనకాపల్లి, విశాఖపట్నం రైల్వే స్టేషన్లలోని గవర్నమెంట్ రైల్వే పోలీసు, రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ క్రమంలో 23న ఉదయం విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో ఆ బాలికను విశాఖ రైల్వే పోలీసులు గుర్తించి భీమవరం టూటౌన్ పోలీసు అధికారులకు సమాచారం ఇచ్చారు. టూటౌన్ పోలీసులు అక్కడికి వెళ్లి బాలికను క్షేమంగా తిరిగి భీమవరం తీసుకువచ్చి వారి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిక మిస్సింగ్ కేసును త్వరితగతిన ఛేదించిన టూటౌన్ ఇన్‌స్పెక్టర్ జి.కాళీచరణ్, సిబ్బందిని జిల్లా ఎస్పీ నయీం అస్మి ప్రత్యేకంగా అభినందించారు.

నిలిచిన అదనపు తరగతి గదులు త్వరలోనే పూర్తిచేస్తాం

పెనుగొండ, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): త్వరలోనే పాఠశాలలకు నిధులు విడుదల చేయించి అభివృద్ధి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయడానికి కృతనిశ్చయంతో ఉన్నామని జిల్లా అడిషనల్ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ శ్యామ్ సుందర్ అన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాను సారం పెనుగొండలోని చెరుకువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన పరిశీలించారు. పాఠశాలలకు 'మన బడి- మన భవిష్యత్తు' పథకంలో భాగంగా అభివృద్ధి చేసే నిమిత్తం అంచనా వేసే నిమిత్తం అదనపు తరగతి గదులు నిర్మాణాలను పరిశీలించారు. పాఠశాల అభివృద్ధి బాధ్యతను సమగ్ర శిక్ష వారికి అప్పగించినట్లు తెలిపారు. త్వరలోనే పాఠశాలలకు గ్రాంట్ రిలీజ్ చేసి అభివృద్ధి పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. పాఠశాల ప్రస్తుత పరిస్థితిని రాష్ట్ర అధికారులకు తెలిపి వారి ఆదేశాల ప్రకారం అభివృద్ధి చేస్తామన్నారు. చెరుకువాడ పాఠశాలలో అదనపు తరగతి గదుల నిర్మాణాన్ని కూడా పరిశీలించారు. కార్యక్రమంలో ఎంఈవో-1 డి.సుభాకరరావు, ఎంఈవో 2 పి.రామకృష్ణ, హెచ్ఎం పి.భరణికుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ పాల్గొన్నారు

రఘునాథుని హుండీ ఆదాయం రూ.1.61 లక్షలు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రఘునాథస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవదాయధర్మాదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. అధికారులు, భక్తుల సమక్షంలో జరిగిన ఈ లెక్కింపులో 1,61,363 ఆదాయంగా లభించినట్లు దేవదాయధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.అనురాధ తెలిపారు.

తాగునీటి చెరువుల్ని నింపుకోవాలి

కలిదిండి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా తాగునీటి చెరువులను పూర్తిగా నింపుకోవాలని కైకలూరు ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం వెంకటాపురం, సానారుద్రవరం గ్రామాల్లో తాగునీటి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతుల వారీగా అన్ని గ్రామాల్లో తాగునీటి చెరువులను నింపటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి చెరువులకు నీటి వంతు వెళ్తుండగా, కాల్వల్లో తాగునీరును చేపల చెరువులకు మళ్లిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ మాజీ ఛైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కురేళ్ల ఏడుకొండలు, వెంకటాపురం, సానారుద్రవరం సర్పంచ్‌లు గూడవల్లి శ్రీనివాసరావు, నున్న రాజేశ్వరమ్మ, కృష్ణబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కృష్ణారావు పాల్గొన్నారు.

'గోస్తనీ' అపవిత్రం

డంపింగ్ యార్డును తలపిస్తున్న గోస్తనీ నది


గోస్తనీలోనే డంపిగ్ యార్డు ఏర్పాటు చేసిన దృశ్యం

గతంలో ఎంతో పవిత్రమైన గోస్తనీ నది ఇప్పుడు పరిశ్రమల కాలుష్యంతో అపవిత్రంగా మారడంతోపాటు, పూడికతీత లేకపోవడంతో పూడుకు పోయి రైతులకు శాపంగా మారింది. తణుకు సమీపంలో వేల్పూరులో పుట్టి అక్కడ నుంచి పాలకోడేరు సమీపంలోని మోగల్లు వద్ద యనమదుర్రులో కలుస్తుంది. పూర్వం ఈ నదిలో నీటినే నత్తారామేశ్వరంలోని రామలింగేశ్వరస్వామి దేవస్థానంలోని పరశురాముడు ప్రతిష్ఠించిన శివలింగాన్ని ఈ నదిలోని నీటితోనే నింపి పదకొండు నెలలు చల్లగా ఉండేలా చేసేది. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. అనేక మంది ఈ నీటినే వాడుకునేవారు. పవిత్ర జలంగా స్నానాలు చేసేవారు. ప్రస్తుతం దగ్గరకు వెళ్లాలంటే భక్తులు, ప్రజలు, ప్రజాప్రతినిధులు పారిపోయే పరిస్థితి నెలకొంది.

- ముంపు సమస్య నివారణకు నిధులు మంజూరు జరిగేనా ?
- రైతులకు ఆచంట ఎమ్మెల్యే పితాని భరోసా
- రూ 11.5 కోట్లతో ఆధునికీకరణకు ప్రతిపాదనలు

పరిశ్రమల కాలుష్యంతో రైతులకు తప్పని కష్టాలు

పెనుమంట్ర, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): గత కొన్నేళ్లుగా వర్షాకాలంలో భారీ వర్షం కురిస్తే ఎగువనుంచి వచ్చేనీటి ప్రవాహాన్ని కిందకు పంపేందుకు సరైన ప్రవాహం లేకపోవడంతో పంట పొలాలు ముగినిపోయి రైతులను కన్నీటికష్టాల్లో నెట్టుతోంది. దీనికి ప్రధాన కారణం వేల్పూరు వద్ద జీవీ కెనాల్, గోస్తనీ కలిసే ప్రదేశంలో ఇరిగేషన్ అధికారులు అదనపు నీటిని మురుగు డ్రెయినేజీలోకి వదలేయడంతో ఈ నీరు మరింత పెరిగి వర్షాకాలంలో ముంపునకు గురవుతోంది.


పెనుమంట్రలో పూడిక పోయిన గోస్తనీ నది

35 ఏళ్ల క్రితం తవ్వకం

గోస్తనీ నది పూడికను 35 ఏళ్ల క్రితం అప్పటి ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి హయాంలో ప్రపంచ బ్యాంకు నాబార్డు నిధులతో మురుగుకాల్వలు, కాల్వలను ఆధునికీకరించారు. అందులో భాగంగా గోస్తనీ నందిని అభివృద్ధి చేశారు. ఆ తరువాత ఈ నదివైపు చూసిన ప్రభుత్వాలు కనిపించలేదు. ఈ క్రమంలో నది పూడిక పోయినా, గట్లు జారీ పోయినా, నది గట్లు ఆక్రమణకు గురైనా పట్టించుకునే నాథుడే కరువయ్యారు.

ఈ ప్రభుత్వంలోనైనా పూడికతీత జరిగేనా ?

గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు మొర పెట్టుకున్నప్పటికీ ఫలితం కనిపించలేదు. అధికారులు, మంత్రులు పరిశీలించడం తప్ప ఒక్క రూపాయి కూడా పూడికకు కేటాయించలేదు. ఈ నేపథ్యంలో ఆచంట ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ రైతులకు హామీ ఇచ్చారు. వర్షాకాలం లోపు వేల్పూరు నుంచి పెనుమంట్ర వరకు 18 కిలోమీటర్లు రూ.5.5 కోట్లతో పూడికకు నాబార్డ్ స్కీమ్‌లో మోడరేషన్‌కు ప్రతిపాదనలు పంపారు. దీనిలో తవ్వకాలు, గట్ల పటిష్ఠత, ఆక్రమణలు, తొలగింపులు, ఇన్‌లెట్‌లు నిర్మించనున్నారు. ఇది మేజర్ మురుగు కాలువ కావడంతో పంటులో ఎక్స్‌కవేటర్‌ను ఏర్పాటు చేసి తవ్వకం చేయడం, లాంగ్ మిషన్‌తో పూడిక తవ్వకాలు జరిపించాల్సి ఉంది. ఈ నంది ప్రారంభంలో 13 మీటర్ల నుంచి ప్రారంభమై. యనమదుర్రు డ్రెయిన్ వద్దకు వెళ్లేసరికి 23 మీటర్ల వెడల్పు ఉంటుంది. భీమవరం సెక్షన్ పరిధిలో తవ్వకానికి రూ.6 కోట్లతో ప్రతిపాదించారు. మొత్తం గోస్తనీ ఆధునికీకరణకు రూ.11.5 కోట్లు ప్రతిపాదించారు. ప్రభుత్వం ఎలా స్పందించి నిధులు కేటాయించి రైతులను ముంపు భారి నుంచి కాపాడుతుందో వేచిచూడాలి.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు ప్రారంభం

మే 7 నుంచి 14 వరకు ఉత్సవాలు

- 7న వరుడు కానున్న శ్రీవారు
- 11న రాత్రి శ్రీవారి తిరుకల్యాణం
- 12న రథోత్సవం
- ఉత్సవాల్లో ఆర్జిత సేవలు రద్దు



ద్వారకాతిరుమల, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చిన్న తిరుమలేశుని శ్రీవిశ్వావసు నామసంవత్సర వైశాఖమాస దివ్య బ్రహ్మోత్సవాలకు క్షేత్రంలో ఏర్పాట్లు బుధవారం ప్రారంభమయ్యాయి. వచ్చేనెల 7 నుంచి 14 వరకు వైఖానస ఆగమ యుక్తంగా జరుగనున్న ఉత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు ఆలయ పరిసరాలలో ఏర్పాట్లకు శ్రీకారం చుట్టారు. స్థానిక పాత కల్యాణ మండపం ముందు శ్రీవారు, అమ్మవార్ల భారీవిద్యుత్ కటౌట్ ఏర్పాటుకు చురుగ్గా పనులు జరుగుతున్నాయి. ఆలయ గోపురాలకు ఇప్పటికే విద్యుత్ తోరణాలను అమర్చే పనిలో సిబ్బంది నిమగ్నమయ్యారు. శ్రీవారి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆయా రోజుల్లో నిత్యార్జిత కల్యాణాలను, ఆర్జిత సేవలను రద్దు చేస్తున్నట్టు ఆలయ ఈవో ఎస్‌వీ సత్యనారాయణ మూర్తి తెలిపారు.


శ్రీవారు, అమ్మవార్ల భారీ విద్యుత్ కటౌట్‌కు ఏర్పాట్లు చేస్తున్న సిబ్బంది (ఇన్‌సెట్‌లో) కల్యాణమూర్తులు

బ్రహ్మోత్సవ షెడ్యూల్ ఇలా..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా వచ్చేనెల 7న ఉదయం స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారునిగాను, పెండ్లి కుమార్తెలుగాను చేస్తారు. 8న ధ్వజారోహణ, 10న ఎదుర్కోలు ఉత్సవం, 11న రాత్రి 8.30 గంటలకు శ్రీవారి తిరుకల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. 12న రాత్రి 7.30 గంటలకు రథోత్సవం, 13న శ్రీచక్రవార్యుత్సవం, ధ్వజావరోహణ, 14న ఉదయం చూర్ణోత్సవం, వసంతోత్సవం, రాత్రి జరిగే ద్వాదశకోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్పయాగోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని భక్తులు గమనించాలన్నారు. బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని ఆయా రోజుల్లో ఉదయం, సాయంత్రం వాహనసేవలుంటాయని భక్తులు వీక్షించి తరించాలని ఈవో కోరారు.


ఆళ్వార్ గోపురాలకు రంగులు వేస్తున్న సిబ్బంది


కల్యాణ తంతు నిర్వహిస్తున్న అర్చకులు


స్వామి, అమ్మవార్లకు పట్టువస్త్రాలు తెస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి, ఈవో మూర్తి తదితరులు

కమనీయం.. శ్రీనివాసుని కల్యాణం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పురాతన లక్ష్మీపురం ఆలయంలో శ్రీనివాసునికి జరుగుతున్న దివ్యకల్యాణ మహోత్సవాల్లో భాగంగా స్వామివారి కల్యాణం బుధవారం రాత్రి కమనీయంగా జరిగింది. శ్రీవారి క్షేత్రానికి దత్తత దేవాలయమైన ఈ ఆలయంలో అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేదమంత్రోచ్ఛరణల నడుమ జరిగిన కల్యాణతంతు భక్తులకు నేత్రపర్వమైంది. ఉదయం విశేష పూజాధికాలు జరిగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లను పల్లకి వాహనంలో ఉంచి అట్టహాసంగా కల్యాణవేదిక వద్దకు తీసుకెళ్లారు. ముందే అలంకరించిన వేదికపై కల్యాణమూర్తులను ఉంచి కల్యాణ తంతును ప్రారంభించారు. ప్రభుత్వం తరఫున గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు, దేవస్థానం తరఫున ఆలయ ఈవో ఎస్వీ సత్యనారాయణమూర్తి స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. అర్చకులు శుభముహూర్త సమయంలో నూతన వధూవరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపచేశారు. అనంతరం మాంగల్యధారణ, తలంబ్రాలు భక్తుల గోవిందనామ స్మరణల నడుమ వైభవంగా జరిగింది. టీడీపీ నేతలు లంకా సత్తిపండు, పోలిన శ్రీను, మాజీ జడ్పీటీసీ మొగతడకల లక్ష్మీరమణి, మద్రాస్ రాము, రేగంటి రాంబాబు పాల్గొన్నారు.

నేడు పంచాయతీరాజ్ దినోత్సవం / ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చేతుల మీదుగా పురస్కారాలు అందజేత

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలో పలు సంస్కరణలకు ఆద్యులుగా నిలిచిన అధికారులను పురస్కారాలతో సత్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా గురువారం మంగళగిరిలోని సీకే కన్వెన్షన్ హాల్లో నిర్వహించే కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్‌కు సంబంధించి అనంతపురం జిల్లా కలెక్టర్ వినోద్‌కుమార్, సత్యసాయి జిల్లా కలెక్టర్ చేతన్‌కు అవార్డులు ప్రదానం చేయనున్నారు. పంచాయతీరాజ్ విభాగంలో ఇంటింటి నుంచి చెత్త సేకరించి, గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడంలో కృషి చేసిన గుంటూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల జిల్లా పంచాయతీ అధికారులు బీవీ నాగసాయి కుమార్, వి.శాంతమణి, బి్రటా అరుణశ్రీ, డాక్టర్ జె.అరుణ పురస్కారానికి ఎంపిక య్యారు. 2024-25కి సంబంధించి పన్నులు, పన్నేతర వసూళ్లలో ఉత్తమ ఫలితాలు సాధించిన చిత్తూరు, పశ్చిమగోదావరి, తిరుపతి జిల్లాల పంచాయతీ అధికారులు కోసూరు సుధాకర్‌రావు, బి్రటా అరుణశ్రీ, దయాన సుశీలదేవిని అవార్డు వరించింది. ఇంకా పలు విభాగాలలో అధికారులకు ఉప ముఖ్యమంత్రి పురస్కారాలు అందజేస్తారు.



ఏలూరు పాతబస్టాండ్ అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో విశ్వహిందూపరిషత్ ధర్నా.. జంగారెడ్డిగూడెంలో కొవ్వొత్తులతో ప్రదర్శన

ఉగ్రదాడిని ఖండిస్తూ కొవ్వొత్తులతో నిరసన

ఏలూరురూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జమ్మూకశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లా పహల్గామ్‌లో ఉగ్రసంస్థ లష్కరేతోయిబా జరిపిన మారణకాండను నిరసిస్తూ విశ్వహిందూ పరిషత్, బీజేపీ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం రాత్రి నగరంలో శాంతియుత ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ మాట్లాడుతూ ఉగ్రదాడిని ఖండించారు. నెక్కంటి శ్రీనివాసరావు, గెడ్డం నాగరాజు, విశ్వహిందూ పరిషత్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో..

ఏలూరులో జనసేన ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. విజయవాడ ఆర్టీసీ జోనల్ ఛైర్మన్ రెడ్డి అప్పలనాయుడు మాట్లాడుతూ పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు అత్యంత హేయమైన పిరికిపంద చర్య అన్నారు. పెహల్గామ్ ఘటన దురదృష్టకరమన్నారు. జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, ఓబిలిశెట్టి శ్రవణ్‌కుమార్ గుప్తా, నగర అధ్యక్షులు నగిరెడ్డి కాశీ పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో..

జంగారెడ్డిగూడెం : జంగారెడ్డిగూడెం పట్టణంలో బుధవారం రాత్రి కూటమి నాయకుల ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పి.రామలక్ష్మి, జనసేన నియోజక వర్గ ఇన్‌చార్జి మేకా ఈశ్వరయ్య, టీడీపీ నాయకుడు షేక్ ముస్తఫా ఉగ్రవాదుల దాడిని ఖండించారు.

ఉగ్రదాడి కలచివేసింది : ఎంపీ పుట్టా

ఏలూరుటూటౌన్ : పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తనను తీవ్రంగా కలచివేసిందని ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. అమాయకులే లక్ష్యంగా ఉగ్రమూకలు దాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. దాడికి తెగబడిన ఉగ్రవాదుల పట్ల ఎన్‌డీఏ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందన్నారు.


అమ్మకానికి సిద్ధంగా ట్రంకు పెట్టెలు

ట్రంకు పెట్టెలే లాకర్లు

ఒకప్పుడు పెళ్లికి మస్ట్.. ప్రస్తుతం తగ్గిన వినియోగం

పెనుగొండ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అమ్మాయికి పెళ్లి చేసి అత్తారింటికి పంపించేటప్పుడు ట్రంకు పెట్టె ఇవ్వడం ఆనవాయితీ. దానిలో అమ్మాయి బట్టలు, బంగారు ఆభరణాలు పెట్టుకునేది. నగదు ఉంచాలన్నా ట్రంకు పెట్టెలో పెట్టి తాళం వేసుకునేవారు. పేద, మధ్యతరగతి వర్గాల వారికి ట్రంకు పెట్టెలే లాకర్లుగా ఉండేవి. కాలక్రమంలో ఇనుప బీరువాలు రాకతో వాటిలోనే బట్టలు, విలువైన వస్తువులు భద్రపరుచుకోవడం మొదలుపెట్టారు. ట్రంకు పెట్టెల వాడకం కాస్త తగ్గింది. ఒకప్పుడు పేదోడి పెళ్లి అయినా, కోటీశ్వరుడి పెళ్లి అయినా పెట్టె తప్పనిసరిగా ఉండాల్సిందే. పెళ్లికి బయలుదేరే ముందు పెళ్లిలో వాడే తలంబ్రాలు, సూత్రాలు, బట్టలు ఆ పెట్టెలో పెట్టి తీసుకెళ్లేవారు. పెళ్లి తంతు ప్రారంభం కాగానే ఒక పెద్దమనిషిని పెళ్లి పెట్టె దగ్గర కూర్చోపెట్టేవారు. పురోహితులు అడిగిన వస్తువులన్నీ పెట్టెలో ఉంచి తీసుకొచ్చేవారు. కాలం మారినా చాలా ఇళ్లల్లో ఇప్పటికే పెళ్లి పెట్టె వాడకం సంప్రదాయం అలాగే కొనసాగుతుంది.

పెనుగొండలో ట్రంకు పెట్టెల పరిశ్రమ దశాబ్దాల క్రితం నుంచి సాగుతుంది. ఇక్కడ తయారైన పెట్టెలు గతంలో కర్ణాటక, మహారాష్ట్ర వంటి రాష్ట్రాలు వెళ్లేవి. ఇక్కడ పని నేర్చుకునేవారు ఆయా ప్రాంతాలకు వెళ్లి అక్కడే తయారీ ప్రారంభించడంతో రెండు రాష్ట్రాలకు ఎగుమతులు కాస్తతగ్గాయి. పెనుగొండలో పెద్ద, చిన్న తరహా ట్రంకు పెట్టెల పరిశ్రమలు వందలాది మందికి ఉపాధి చూపుతున్నాయి. ప్రస్తుతం హాస్టళ్లల్లో విద్యార్థులు ఎక్కువగా పెట్టెలు వాడుతున్నారు.

గతంతో పోల్చితే అమ్మకాలు లేవు



ట్రంకు పెట్టెల తయారీ, అమ్మకం 20 ఏళ్లుగా నిర్వహిస్తున్నా. ఏటా మే, జూన్ నెలల్లో ఖాళీ ఉండదు. ప్రస్తుతం హాస్టల్ విద్యార్థులు ఎక్కువగా ట్రంకు పెట్టెలు వాడుతున్నారు. గతంతో పోల్చు కుంటే ప్రస్తుతం అమ్మకాలు ఉండడం లేదు. వాడకం బాగా తగ్గిపోయింది.

\- చవకా నరసింహరావు, తయారీ యజమాని

నేటినుంచి బదిలీ టీచర్లకు మెడికల్ చెకప్ క్యాంపు

» కొత్త జిల్లాల వారీగా షెడ్యూల్ విడుదల : ఉమ్మడి జిల్లా డీఈవో వెంకటలక్ష్మమ్మ

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): కొద్దిరోజుల్లో జరుగనున్న సాధారణ బదిలీలకు ప్రిఫరెన్షియల్ కేటగిరీ/స్పెషల్ పాయింట్లను పొందేందుకు అవసరమైన వైద్యధ్రువీకరణ పత్రాలను పొందేందుకు పాటించాల్సిన విధి విధానాలపై డీఈవో వెంకటలక్ష్మమ్మ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో హెచ్ఎంలు, టీచర్లకు ఈనెల 24 నుంచి 26 వరకు ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో నిర్వహించే మెడికల్ చెకప్ క్యాంపునకు హాజరయ్యే ఉపాధ్యాయులు సంబంధిత కేటగిరీల్లో అర్హతలున్నవారు, గతంలో వినియోగించుకున్నవారు తమ పాత ఆరోగ్య సర్టిఫికెట్లను మెడికల్‌బోర్డు వైద్యాధికారులకు చూపించి, ధ్రువీకరణచేయించుకుని తాజాగా కొత్త మెడికల్ సర్టిఫికెట్‌లను పొందాల్సి ఉంటుందన్నారు. నిర్ణీత షెడ్యూలు ప్రకారం పూర్వపు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి ప్రస్తుత ఏలూరు జిల్లా పరిధిలోని 19 మండలాలు, ప్రస్తుత తూర్పుగోదావరి జిల్లాలో విలీనమైన తొమ్మిది మండలాల ఉపాధ్యాయులు ఈనెల 24న ఉదయం తొమ్మిది గంటలనుంచి మెడికల్ చెకప్ క్యాంపునకు హాజరుకావాలన్నారు. 25న ప్రస్తుత పశ్చిమ గోదావరి జిల్లాలోని 20 మండలాల టీచర్లు మెడికల్ క్యాంపునకు ఉదయం తొమ్మిది గంటలకు హాజరుకావాలని సూచించారు. నిర్ణీత తేదీల్లో మాత్రమే నిర్దేశించిన జిల్లాల్లోని మండలాల హెచ్ఎంలు, ఉపాధ్యాయులకు మెడికల్ చెకప్ క్యాంపు జరుగుతుందని స్పష్టం చేశారు.

వైసీపీ రద్దు చేసిన 28 పథకాలను పునరుద్ధరిస్తాం

» రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ చైర్‌పర్సన్ డాక్టర్ ఉండవల్లి శ్రీదేవి


మాట్లాడుతున్న ఉండవల్లి శ్రీదేవి

ఏలూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):గత వైసీపీ ప్రభుత్వం ఎస్సీ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేస్తే అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం వెంటనే జవసత్వాలు అందించేలా సీఎం చంద్రబాబు నిధులు కేటాయించారని రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ ఛైర్పర్సన్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. బుధవారం ఏలూరు ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. మాదిగల సంక్షేమంతోపాటు వారిని ఆర్థికంగా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన 28 పథకాలను పునరుద్ధరిస్తామన్నారు. గత ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని ఉన్న నిధులు పక్కదారి పట్టించారని విమర్శించారు. ఎన్డీఏ ప్రభుత్వం మాదిగల అభివృద్ధికి నూరుశాతం కట్టుబడి ఉందని వారి అభ్యున్నతికి సీఎం చంద్రబాబు సహకారంతో కృషి చేస్తామన్నారు. టీడీపీ అంటనే మాదిగల ప్రభుత్వమన్నారు. జిల్లా ఎస్సీ సొసైటీ కార్యనిర్వాహక సంచాలకులు ఎం.ముక్కంటి, నాయకులు పొలిమేర హరికృష్ణ, మర్లపూడి పాల్‌రాజు, బ య్యారపు రాజేశ్వర రావు, కొమ్ముల రాజేష్, జుంజి మోజెస్, శ్రీరామ రమేష్, మహిళా నాయకులు, జిల్లా ఎస్సీ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పోప్ మృతి కథోలికా పీఠానికి తీరని లోటు

» ఏలూరు పీఠాధిపతి బిషప్ జయరావు » సెయింట్ జోసెప్ దంతవైద్య కాలేజీలో సంతాప సభ


పోప్ ఫ్రాన్సిస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బిషప్ జయరావు

పెదవేగి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : పోప్ ఫ్రాన్సిస్ మృతి కథోలికా పీఠానికి తీరని లోటని ఏలూరు పీఠాధిపతి బిషప్ పొలిమేర జయరావు అన్నారు. పెదవేగి మండలం దుగ్గిరాల సెయిం ట్ జోసెఫ్ దంతవైద్య కళాశాలలో బుధవారం పోప్ ఫ్రాన్సిస్ సంతాపసభను ఏర్పాటు చేసి, పోప్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోప్ మృతితో యావత్ పీఠం శోకసంద్రంలో మునిగి పోయిందని విచారవదనంతో చెప్పారు. 154 దేశాల కార్డినర్ ప్రతినిధులు పోప్‌ను ఎన్నుకుం టారన్నారు. పోప్ మృతికి కేంద్ర, రాష్ట్రాలు సంతాపదినాలు ప్రకటించి, స్పందించిన విధానం అభినందనీయమని పేర్కొంటూ ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఏలూరు పీఠం వికార్ జనరల్ ఫాదర్ పి.బాల, చాన్సలర్ ఫాదర్ బాబూ జార్జ్, కోశాధికారి బి.రాజు, సోషల్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ ఫాదర్ ఇమ్మానియేల్, కళాశాల ఏవో ఫాదర్ ఫెలిక్స్, నర్శింగ్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.జాకబ్, తోట ఆంతోని, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.స్లీవరాజు, అధ్యాపకులు, దంతవైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఎండుగడ్డి ఇక్కట్లు

» యంత్రాలతో వరికోతలు.. పశుగ్రాసానికి కొరత
» రైతులకు భారంగా పశువుల పెంపకం


వరిగడ్డి చుట్టలను ట్రాక్టర్‌పై తరలిస్తున్న దృశ్యం

గణపవరం, ఏప్రిల్ 22 (ఆంధ్రజ్యోతి) : పాడి పరిశ్రమకు కీలకమైన పశుగ్రాసం కొరతతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పశుగ్రాసం లేక పాడి పశువులను రక్షించుకునే క్రమంలో రైతులు కష్టాలు అన్నీఇన్నీ కావు. ఈ పరిస్థితి ప్రతీఏటా ఏర్పడడంతో పాటు అక్కడక్కడ ఉన్న కొద్దిపాటి వరిగడ్డి ధరలు చుక్కలనంటుతున్నాయి. యంత్రాలతో వరికోతలు కోస్తుండడంతో ఎండుగడ్డి కొరత తీవ్రంగా పట్టిపీడిస్తోంది. ఫలితంగా పశుపోషణకు రైతులు ఇబ్బందులు తప్పడం లేదు. ఉమ్మడి జిల్లాతో పాటు ముఖ్యంగా ఉంగుటూరు నియోజకవర్గంలో ఈ దాళ్వా మాసూళ్ల యంత్రాలతోనే చేపట్టారు. వాతావరణంలో మార్పులు రావడంతో రైతులు కూలీలతో వరికోతలు కోయకుండా యంత్రాలపైనే ఆధారపడి మాసూళ్లు చేస్తున్నారు. ఉంగుటూరు నియోజకవర్గం గణపవరం మండలం 6,150 హెక్టార్లలో, భీమడోలు మండలంలో 6,300 హెక్టార్లలో, నిడమర్రు మండలంలో 4,600 హెక్టార్లలో, ఉంగుటూరు మండలంలో 9,100హెక్టార్లలో దాళ్వా వరిసాగు చేశారు. యంత్రాలతోనే మాసూళ్లు చేయడంతో వరిగడ్డి కొరత ఏర్పడిందని రైతులు చెబుతున్నారు. గతంలో అక్కడక్కడ కొంతమంది మాత్రమే యంత్రాలతో కోతలు కోయించేవారు, కూలీలతో కోతలు కోసి అరబెట్టి కుప్ప చేయడానికి పెట్టుబడి అధికం కావడంతో యంత్రాలతోనే కోతలు కోసేందుకు ఆసక్తి చూపుతున్నారు. గత ఖరీఫ్ కోతల సమయంలో తుపాన్‌భయంతో యంత్రాలతోనే కోతలు కోయించారు. ప్రస్తుతం రబీ సీజన్‌లో సాగు చేసిన పంటను యంత్రాలతో మాసూళ్లు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు.

ట్రాక్టర్ వరిగడ్డి రూ.13 వేలు

గతంలో ట్రాక్టర్ వరిగడ్డి రూ.6వేలు ఉండేది. ప్రస్తుతం రూ.13 వేల ధర పలుకుతుంది. యంత్రంతో చుట్టిన ఒక్కో గడ్డి బేలు రూ.25-35 కేజీలు ఉంటుంది. పొలం యాజమాని బేలుకు రూ.30 చొప్పున యంత్ర యాజమానికి చెల్లిస్తున్నారు. బయటవారికి కావాలంటే ఖరీఫ్‌లో కట్ట రూ.120-130వరకు తీసుకోగా ప్రస్తుతం రూ.180 వరకు పలుకుతుండడంతో పశుపోషకులు బెంబేలెత్తుతున్నారు.

ప్రభుత్వం పశుగ్రాసం అందించాలి



మా ప్రాంత ఆయకట్టులో ఆశించిన స్థాయిలో పశుగ్రాసం లభించదు. చేపలు, రొయ్యల చెరువులు అధికంగా సాగు చేయడంతో వరి పంట తగ్గుముఖంపట్టింది. పైగా అకాల వర్షాలు, యంత్రాలతో మాసూళ్లు చేయడం వల్ల గడ్డి లభించడం లేదు. ప్రభుత్వం పశుగ్రాసం అందించి ఆదుకోవాలి

- కొల్లూరి శ్యామ్‌ప్రసాద్, రైతు, కొత్తపల్లి

పాడి పశువులను అమ్ముకుంటున్నాం



పాడిపశువులను కాపాడుకునే ప్రయత్నంలో పశుగ్రాసం ధరలు అందుబాటులో లేవు. మెట్ట తదితర ప్రాంతాలకు ఎండుగడ్డి రవాణా అవుతుంది. అధిక ధర పెట్టి కొనుగోలు చేస్తున్నారు. పశుగ్రాసం మా ప్రాంతంలో లభించడం తక్కువగా ఉంది. ఖర్చులు పెరిగిపోవడంతో పాడిపశువులకు గ్రాసం అందించలేక పశువులను విక్రయించుకుంటున్నాం.

- సంకు శ్రీనివాసరావు, రైతు, భువనపల్లి

సమష్టి కృషితో లక్ష్య సాధన

» ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి
» పీజీఆర్‌ఎస్‌లో అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి
» మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశం


ఏలూరులో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్ చిత్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

ఏలూరు/ఏలూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): 'పేదలకు 'సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించే బాధ్యత మనపై ఉంది. పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించే అంశంపై దృష్టిపెట్టాలి. సమష్టి కృషి తో అన్నిరంగాల్లో లక్ష్యాలను సాధిద్దాం' అని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం ల్యాండ్ అసైన్‌మెంట్ కమిటీ, ఇతర కార్యక్రమాల అమలు తీరుపై బుధవారం ఆయన సమీక్షించారు. ఏలూరు జిల్లాను ప్రగతి పథంలో ఐదో స్థానం నుంచి మూడో స్థానానికి తీసుకురావాలని, ల్యాండ్ అసైన్‌మెంట్‌లో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో ప్రణాళిక బద్ధంగా ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు కల్పించాలన్నారు. పీ-4 కింద ప్రతీ కుటుంబంలో ఒకరికి ఉపాధి, పారిశ్రామిక వేత్తలను తయారు చేయడానికి కృషి జరగాలన్నారు. త్వరలో తల్లికి వందనం కింద రూ.9,407 కోట్ల విడుదల చేస్తామని, తాగునీటికి అత్యధికంగా ప్రాధాన్యతనిచ్చి నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్‌ఎస్‌లో అందే అర్జీలను వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలన్నారు. సమావేశంలో ఏలూరు జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకూడదు : మంత్రి

రబీ ధాన్యం కొనుగోలులో రైతులకు సమస్యలు తలెత్తకుండా రైస్ మిల్లర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా కలెక్టరేట్‌లో రాష్ట్రంలోని పలు జిల్లాల రైస్‌మిల్లర్ల ప్రతినిధులు, ఎగుమతిదారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ రైతు ఉత్పత్తులకు గిట్టుబాటు ధరకు మించి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న వాతావరణ పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని రైతుల నుంచి ధాన్యం కొనుగోలును ముమ్మరం చేయాలన్నారు.

గిరిజన ఉత్పత్తులకు జాతీయస్థాయి మార్కెటింగ్


హస్తకళలను పరిశీలిస్తున్న మంత్రి నాదెండ్ల

బుట్టాయగూడెం :ఏజెన్సీలో పండే పంటలకు, ఇతర ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేకపోవడంతో గిరిజనులు నష్టపోతున్నారని ఆ పరిస్థితిని మారుస్తూ గిరిజన, హస్తకళల ఉత్పత్తులకు జాతీయస్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించేలా గిరిజన సహకార సొసైటీని బలోపేతం చేస్తామని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు. బుధవారం రెండోరోజు పర్యటనలో భాగంగా పులిరాముడుగూడెంలో ఆయన పర్యటించారు. గ్రామంలో గిరిజనులు వెదురుతో తయారు చేసిన కళాకృతులు ఎంతో ఆకర్షణీయంగా ఉన్నాయని ఆన్‌లైన్ ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయి మార్కెటింగ్‌కు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తొలుత పీఆర్‌గూడెంలో గిరిజన వెదురు హస్తకళల తయారీ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. దివ్యాంగుడైన ట్రైనర్ మారయ్యను అభినందించారు. ఐటీడీఏ వద్ద గిరిజనులకు వైద్యసేవలు అందించడం కోసం అంబులెన్సును ప్రారంభించారు. ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, పత్సమట్ల ధర్మరాజు, ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు, పీవో కె.రాములునాయక్, ఆర్టీసీ రీజనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఘంటా మురళీ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తండ్రితో గొడవ పడి ఆత్మహత్యాయత్నం

రక్షించిన పోలీసులు


ఆత్మహత్యాయత్నం చేసిన వ్యక్తిని బంధువులకు అప్పగిస్తున్న పోలీసులు

కొవ్వూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గామన్‌బ్రిడ్జిపై నుంచి ఆత్మహత్యా ప్రయ త్నం చేస్తున్న వ్యక్తిని సురక్షితంగా బం ధువులకు అప్పగించినట్లు పట్టణ సీఐ పి. విశ్వం తెలిపారు. పోలీసులు అందించిన వివరాల ప్రకారం.. ఏలూరు జిల్లా ఉంగుటూరుకు చెందిన నెక్కంటి వెంకటేశ్వరరావు తండ్రితో గొడవపడి మోటారు సైకిల్‌పై ఈ నెల 22వ తేదీ రాత్రి కొవ్వూరు గామన్‌బ్రిడ్జి పైకి చేరుకున్నాడు. బంధువులకు వాట్సాప్ వీడియోకాల్ చేసి గోదావరిలోకి దూకి చనిపోతున్నాని తెలిపాడు. దీనిపై బంధువులు 112కు కాల్ చేశారు. సమాచారం తెలుసుకున్న పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వెంకటేశ్వరరావుని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చి కౌన్సెలింగ్ ఇచ్చి బంధువులకు అప్పగించారు. వెంకటేశ్వరరావుని రక్షించడంలో హెచ్‌సీ పి.సత్యనారాయణ, కానిస్టేబుల్ ఎస్. గణేష్, ఆర్.కె. సత్యనారాయణ, హోంగార్డు జాకీర్ హుస్సేన్‌లను సీఐ విశ్వం అభినందించారు.

బీచ్‌లో ఆత్మహత్యాయత్నం: కాపాడిన కానిస్టేబుల్

నరసాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పేరుపాలెం బీచ్‌లో ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించిన కె.చంద్రయ్యను సాహసించి కాపాడిన కానిస్టేబుల్ పెంటపాటి సత్యనారాయణను జిల్లా ఎస్పీ నయీం అస్మి ప్రశంసాపత్రంతో అభినందించారు. మంగళవారం రాత్రి విధుల్లో ఉన్న సత్యనారాయణకు బీచ్‌లోని మోళ్ళపర్రు వద్ద వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడుతున్నాడని, తక్షణం వెళ్లాలని పోలీస్ కంట్రోల్ రూమ్‌కు ఫోన్ వచ్చింది. వెంటనే సత్యనారాయణ మోళ్ళపర్రు వెళ్లాడు. ఆ సమయంలో అక్కడ అనుమానాస్పదంగా బీచ్‌లో తిరుగుతున్న చంద్రయ్య దగ్గరకు వెళ్లేందుకు ప్రయత్నించగా.. వెంటనే అతను సముద్రంలోకి పరుగెత్తాడు. సత్యనారాయణ అతని వెనకే పరుగెత్తి అడ్డుకున్నాడు. కుటుంబ వివరాలు తెలుసుకుని పేరుపాలెం నార్త్‌లో ఉంటున్న చంద్రయ్య బంధవులకు సమాచారం ఇచ్చారు. ఉన్నతాధికారులకు విషయాన్ని తెలియజేసి చంద్రయ్యను కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ శ్రీవేద, సీఐలు యాదరిగి, దుర్గాప్రసాద్, ఎస్సై వాసు అభినందించారు. సాయంత్రం నరసాపురం విచ్చేసిన ఎస్పీ నయీం అస్మి సత్యనారాయణకు ప్రసంశపత్రాన్ని అందించి అభినందించారు.

ఆన్‌లైన్‌లో పోలీసు కేసు అంటూ మోసం

» రూ.15.50 లక్షలు కాజేసిన కేటుగాళ్లు
» పెదపాడు పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

పెదపాడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వసంతవాడ గ్రామానికి చెందిన కె.శాస్త్రికి ఈనెల 7వ తేదీ మధ్యాహ్నం రెండు గంటలకు బెంగళూరు పోలీస్‌స్టేషన్ నుంచి మాట్లాడుతున్నామని, మీపై మానవ అక్రమ రవాణా పేరిట ఎఫ్.ఐ.ఆర్ నెంబరు బి.కె.354ఎ/0425 పేరిట కేసు నమోదైందంటూ భయపెట్టారు. మరలా ఫోన్ చేసి మా విచారణలో మీ ప్రమేయం ఏమీ లేదని తేలిందని చెప్పి పై అధికారి విచారణ పేరిట 8వ తేదీన శాస్త్రి చేత ఆన్‌లైన్‌లో ప్రైమరీ ఇన్వెస్టిగేషన్ పేరిట ఓ మహిళ ఉన్నతాధికారినని చెప్పి లెటర్ తీసుకున్నారు. అనంతరం మరలా ఫోన్ చేసి ఆర్టీజీఎస్ రూ.15.50 లక్షలు పంపాలని, లేకపోతే 9వ తేదీన అరెస్ట్ పంపుతామంటూ బెదిరించారు. దీంతో భయపడి రూ.15.50 లక్షలను వారు చెప్పిన ఖాతాలో జమ చేశారు. అనంతరం ఇదంతా సైబర్ నేరగాళ్ల పన్నాగంగా కుటుంబసభ్యులు తెలపడంతో సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేశారు. వారి సమాచారం మేరకు పెదపాడు ఎస్ఐ కట్టా శారద సతీష్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శక్తి యాప్‌తో మహిళలకు రక్షణ: డీఎస్పీ


సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మహిళలు, బాలికల రక్షణకోసం ఎన్నో చట్టాలు ఉన్నాయని వాటిని తెలుసుకుని సద్వినియోగం చేసుకోవాలని ఏలూరు డీఎస్పీ డి శ్రావణ్‌కుమార్ సూచించారు. ఏలూరులోని బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులకు శక్తియాప్, మహిళా రక్షణ చట్టాలపై అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ శక్తియాప్ తమ మొబైల్‌లో ఉంటే పరోక్షంగా తమతో పోలీసు సహాయం ఉన్నట్టేనని సూచించారు. ఏదైనా అత్యవసర సమయంలో పోలీస్ సేవలు, సహాయం కోసం వెంటనే 112కు కాల్ చేయాలని సూచించారు. లేదా శక్తియాప్‌లోని ఎస్ఓఎస్ బటన్ నొక్కితే వెంటనే ఆ లోకేషన్ పోలీస్ కంట్రోల్ రూమ్‌కు చేరుతుందని, అక్కడ నుంచి సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం అందుతుందని, పది నిముషాల్లోపే పోలీసులు అక్కడకు చేరుకుంటారని తెలిపారు. ఇటీవల సైబర్ నేరాలు పెరిగిపోయాయని ఆన్‌లైన్‌లో రకరకాల యాప్‌లతో మోసాలు చేస్తున్నారని సైబర్ నేరగాళ్ళ వలలో పడకుండా అత్యంత జాగ్రత్త వహించాలన్నారు. పొరపాటున సైబర్ నేరాలకు గురైతే 1930కు ఫిర్యాదు చేయాలన్నారు. బాల్య వివాహాలు జరిగినా, బాలలకు రక్షణార్థం 1098 టోల్ ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు. మహిళల రక్షణకు 181కు కాల్ చేయాలన్నారు. ట్రాఫిక్ సమస్య పరిష్కారం కోసం 1073కి, అగ్ని మాపక కేంద్ర సహాయం కోసం 101కు కాల్ చేయాలన్నారు. ఈ నెంబర్లు అన్నీ తమ మొబైల్‌లోనూ నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏలూరు మహిళా పోలీస్ స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, టూటౌన్ సీఐ అశోక్‌కుమార్, శక్తి టీమ్ సభ్యులు పాల్గొన్నారు.

యర్రమళ్ళలో ఉరి వేసుకుని ఒకరి ఆత్మహత్య

ఉంగుటూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): చేబ్రోలు పోలీసు స్టేషన్ పరిధిలోని యర్రమళ్ళ గ్రామంలో మంగళవారం రాత్రి మానుకొండ బాబూరావు(50)అనే వ్యక్తి తన ఇంటి సమీపంలో చెట్టుకు తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని భార్యతో పదేళ్ళ నుంచి విడిగా ఉంటున్నారు. ఈ నేపధ్యంలో జీవితం మీద విరక్తి చెంది ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండవచ్చని స్థానికులు చర్చించుకుంటున్నారు. చేబ్రోలు పోలీసులు కేసు నమోదు చేసి బాబూరావు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం అనంతరం మృత దేహాన్ని బంధువులకు అప్పగించారు.

యువకుడి అదృశ్యం


నాగరాజు (ఫైల్)

టి.నర్సాపురం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎం.జయబాబు తెలిపారు. కామవరపుకోటకు చెందిన మోదుగమూడి నాగరాజు (35) ఈ నెల 20వ తేదీ రాత్రి టీనర్సాపురం తన చిన్నమామ కందిమళ్ల సత్యనారాయణ ఇంటి వద్దకు వచ్చి తిరిగి కామవరపుకోట తన ఇంటికి వెళ్తున్నాను అని చెప్పి సాయంత్రం 6.30గంటల సమయంలో బయల్దేరి వెళ్ళినట్లు సత్యనారాయణ తెలిపారు. అప్పటి నుంచి ఇంటికి వెళ్ళకపోవడంతో ఈ నెల 22న స్థానిక పోలీస్‌స్టేషన్ చిన్నమామ కందిమళ్ల సత్యనారాయణ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. అతని ఆచూకి తెలిసిన వారు 94407 96676కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

చోరీ కేసులో ముద్దాయికి జైలు

భీమడోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : దుగ్గిరాల గ్రామంలో గత డిసెంబరు 13వ తేదీన గంగానమ్మ గుడిలో అమ్మవారి నగలు దొంగతనం జరిగినట్లు వచ్చిన కేసుపై సంబంధిత నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. బుధవారం భీమడోలు సివిల్ కోర్టు న్యాయమూర్తి ఆదిత్య రుషిక్ సంబంధిత ముద్దాయి ఆకుల మహేష్‌కు ఐదు నెలల జైలు శిక్ష, రూ.500 జరిమానా విధించారు. జరిమానా కట్టని ఎడల నెల సాధారణ జైలు శిక్ష విధించారని ఎస్ఐ సుధాకర్ తెలిపారు.

కోడి వ్యర్థాల లారీ పట్టివేత


భీమడోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : కురేళ్ళగ్రామంలో ఉన్న చెపల చెరువులకు కోడి వ్యర్థాలను తరలిస్తుండగా భీమడోలు పోలీసులు వాహనాన్ని సంబంధిత డ్రైవర్‌ని అదుపులోకి తీసుకున్నారు. తోకలపల్లి గ్రామానికి చెందిన బలేరాము, టాటా వ్యానులో కోడి వ్యర్థాలను తరలిస్తుండగా భీమడోలు ఎస్ఐ సుధాకర్ సిబ్బందితో కురెళ్ళగూడెం హైవే బ్రిడ్జి సమీపంలో వాహనాన్ని అడ్డుకుని డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఈవ్యర్థాలను గణేష్ అనే చేపల చెరువుల యజమానికి తరలిస్తున్నట్లు నిర్ధారించారు. వాహనాన్ని సీజ్ చేశారు.

జగనన్న కాలనీలో చోరీ

అర కేజీ వెండి, ఏడు గ్రాముల బంగారం అపహరణ

ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటికి తాళం వేసి బయటకు వెళ్ళి వచ్చేటప్పటికి దొంగలు ఆ ఇంటి తాళాలు పగులగొట్టి వెండి, బంగారపు వస్తువులను అపహరించుకుపోయారు. ఏలూరు రూరల్ మండలం కోడేలులోని జగనన్న కాలనీలో పల్లా వెంకటేశ్వరరావు నివాసం ఉంటున్నారు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉండగా, పిల్లలు హాస్టల్‌లో చదువుతున్నారు. భార్య తణుకులో ఉన్న పుట్టింటికి ఈనెల 22వ తేదీన వెళ్ళింది. వెంకటేశ్వరరావు ఆటో డ్రైవర్‌గా జీవిస్తున్నాడు. ఒక్కడే ఉన్న అతను అదే రోజు సాయంత్రం ఏలూరు వెన్నవల్లివారిపేటలో ఉన్న తన తల్లి వద్దకు వెళ్ళి ఉన్నాడు. బుధవారం ఉదయం తిరిగి తన ఇంటికి వెళ్ళి చూసేటప్పటికి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లో అరకేజీ వెండి, ఏడు గ్రాముల బంగారపు వస్తువులు అపహరణకు గురయ్యాయి. ఈ సంఘటనపై ఏలూరు రూరల్ ఎస్ఐ సిహెచ్‌కె దుర్గా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గోదావరిలో పడి కూలీ మృతి



ఆచంట, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఆచంట మండలం కరుగోరుమిల్లి శివారు ముత్యాల వారిపాలెంకు చెందిన ముత్యాల సత్యనారాయణ (70)ప్రమాదవశాత్తు గోదావరిలోపడి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం సత్యనారాయణ మంగళవారం ఉపాధి కూలీ నిమిత్తం కోడేరు లంకలోకి వెళ్లారు. పని అనంతరం మధ్యాహ్నం స్నానం కోసం గోదావరిలో దిగి ప్రమాదవశాత్తు మృతి చెందాడు. మంగళవారం సాయంత్రానికి సత్యనారాయణ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతికారు. బుధవారం ఉదయం గన్నవరం దగ్గర గోదావరిలో మృత దేహం లభ్యమైంది. గన్నవరం పోలీసులకు సత్యనారాయణ కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): రైలు పట్టాలుదాటుతున్న ఒక యువకుడిని ప్రమాదవశాత్తు రైలు ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఏలూరు ఆదివారపుపేట ఏటిగట్టు ప్రాంతానికి చెందిన ఇచ్ఛాపురం గౌతమి కుమార్ (19)ఒక మోటారు బైక్ షోరూమ్‌లో సర్వీస్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నాడు. అతను ఏలూరు శ్రీనివాస థియేటర్ సమీపంలోని చిట్టివలస పాకల వద్ద బుధవారం సాయంత్రం రైలు పట్టాలుదాటుతుండగా ప్రమాదవశాత్తు రైలు ఢీకొని మృతి చెందాడు. ఈ సమాచారం అందుకున్న ఏలూరు రైల్వే ఎస్ఐ తన సిబ్బందితో సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలిపై దాడి

ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : ఓ యువకుడు ప్రేమించి పెళ్ళిచేసుకుని ఆపై విడిపోయాడు. మాజీ అత్తగారిపై కక్ష పెంచుకుని ఆపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన ఆమె విజయవాడలోని ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నది. ఏలూరు కత్తేపువీధికి చెందిన షేక్ బాజీ గతంలో బావిశెట్టివారిపేటకు చెందిన ఒక యువతిని ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు. ఆ తరువాత ఆమెను వదిలి వేశాడు. ఆ యువతి తల్లి అయిన జయలక్ష్మీపై కక్ష పెంచుకున్నాడు. ఈనెల 22వ తేదీ రాత్రి ఆమె బిర్లాభవన్ సెంటర్ వద్ద ఉండగా అకస్మాత్తుగా వెనుక నుంచి వచ్చి ఆమెపై దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. తీవ్ర గాయాలకు గురైన ఆమెను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. షేక్ బాజీ పరారీలో ఉన్నాడు. ఈ సంఘటనపై ఏలూరు వన్‌టౌన్ సీఐ జి సత్యనారాయణ ఆధ్వర్యంలో వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

వశిష్ట మెరైన్ యాజమాన్యంపై కేసు

పాలకోడేరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మోగల్లు గ్రామంలోని వశిష్ట మెరైన్ ఫ్యాక్టరీలో అమ్మోనియా లీకై గాయాలకు కారణమైన వశిష్ట యాజమాన్యంపై ఆ ఫ్యాక్టరీ కార్మికురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పాలకోడేరు స్టేషన్ రైటర్ నాగరాజు తెలిపారు. మంగళవారం రాత్రి వశిష్ట మెరైన్ ఫ్యాక్టరీలో అమ్మోనియా గ్యాస్ లీకైంది. కార్మికులు ఊపిరాడక బయటకు వచ్చే సమయంలో ఒకరికొకరు నెట్టుకోవడంతో వారు గాయాల పాలయ్యారు. అదేవిధంగా కొంత మంది ఊపిరాడక ఆసుపత్రి పాలయ్యారు. దీనిపై ఫ్యాక్టరీలో పని చేస్తున్న కార్మికురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పాలకోడేరు పోలీసులు తెలిపారు.

పుస్తక పఠనంతో మానసిక ఉల్లాసం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పంగిడిగూడెం జడ్పీ హైస్కూల్లో ప్రపంచపుస్తక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రార్థనా సమావేశంలో విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల హెచ్ఎం సురేష్ మాట్లాడుతూ పుస్తక పఠనంతో విద్యార్థుల్లో మానసిక వికాసం పెరుగుతుందన్నారు. ప్రతీ విద్యార్థి గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలని కోరారు. పుస్తక పఠనంతో విద్యార్థి ఎంతో జ్ఞానాన్ని పెంపొందించుకోవచ్చన్నారు. అనంతరం తెలుగు పండిట్ మద్దాల పెద్దిరాజు పుస్తకపఠన శైలిని పరిశీలించి సూచనలు చేశారు.

మంచి నీటి చెరువు గట్లు పటిష్టం చేస్తున్నాం

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): నగర ప్రజలకు తాగునీరందించే సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు గట్లు పటిష్టపరిచే చర్యలు చేపట్టినట్టు నగరపాలక సంస్థ కోఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు అన్నారు. మూడ్రోజుల నుంచి మున్సిపల్ సిబ్బంది ఆహర్నిశలు కష్టపడుతూ లీకేజీలను అరికట్టామని అన్నారు. ఇప్పటి నుంచి నిరంతరం పర్యవేక్షిస్తూ ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించామన్నారు. వేసవిలో నగర ప్రజలకు రెండుపూటలా తాగునీరును అందిస్తామన్నారు.

నామినేటెడ్ పదవుల్లో బీసీలకు న్యాయం చేయాలి

లింగపాలెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : నామినేటెడ్ పదవుల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించి న్యాయం చేయాలని బీసీ సెల్ మండలాధ్యక్షుడు తాళం సోంబాబు అన్నారు. లింగపాలెం మండలం సింగగూడెంలో ధర్మగుండాలమ్మ ఆలయం వద్ద బీసీ సమాఖ్య మండల సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో జిల్లా బీసీ సెల్ అధికార ప్రతినిధి పిల్లల శ్రీనివాస్ యాదవ్, మండల ప్రధాన కార్యదర్శి చెన్ను శ్రీనివాస్ యాదవ్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో బీసీలకు ఏఎంసీ చైర్మన్‌గా అవకాశం ఇవ్వాలని చింతలపూడి తాలూకా పరిధిలో 54 శాతం నామినేటెడ్ పదవులు బీసీలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గజ్జా వెంకటేశ్వరరావు, పి.వెంకటేశ్వరరావు, నాయుడు మహేశ్, పి.సత్యనారాయణ పాల్గొన్నారు.

ఇళ్లు కట్టుకోవడానికి అనుమతులు ఇప్పించండి


వినతిపత్రం ఇస్తున్న నాయకులు

బుట్టాయగూడెం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : వేలేరుపాడు మండలం కొయిదా పంచాయతీ పరిధిలో దట్టమైన అటవీ ప్రాంతంలో పాపికొండల నడుమ ఉన్న మోదేలు కొండరెడ్లు ఇళ్లు నిర్మించుకోడానికి అనుమతులు ఇప్పించాలని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నాయకుడు కారం రాఘవ మంత్రి నాదెండ్ల మనోహర్‌కు బుధవారం ఐటీడీఏ వద్ద వినతి పత్రం అందజేశారు. 2022లో ప్రధానమంత్రి యోజన పథకంలో 27 మంది కొండరెడ్లకు ఇళ్లు మంజూరైనా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారని తెలిపారు. ఇళ్లకు సరైన రోడ్డు, విద్యుత్ లేక ఇబ్బందులు పడుతున్నామని, ఐటీడీఏ అధికారులకు చెప్పినా ఫలితం లేదన్నారు. కార్యక్రమంలో ఈ.భూషణం, కొండరెడ్లు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని ఖండించిన ముస్లిం జేఏసీ

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : జమ్మూ కశ్మీర్‌లో జరిగిన ఉగ్రదాడులను జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ తరపున వక్ఫ్ బోర్డు మాజీ జిల్లా చైర్మన్ షేక్ ముస్తఫా బుధవారం ఖండించారు. ఉగ్రదాడుల్లో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి కలగాలని బిలాల్ మసీదులో బుధవారం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా ముస్తఫా మాట్లాడుతూ ముస్లిం ముసుగు వేసుకుని ఇటువంటి చర్యలకు పాల్పడటం నీచమైన చర్యగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు.కార్యక్రమంలో షేక్ బాజీ(టిప్‌టాప్) షేక్ యాకూబ్, షేక్ అదిల్, ఎండీ నబీ, షాహిన్ పాల్గొన్నారు.

సానిగూడెంలో క్రైస్తవుల ప్రత్యేక ప్రార్థనలు

దెందులూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని ప్రముఖ దైవ జనులు, ఏలూరు ఆర్‌సీఎం (పీఠం) విచారణ వికార జనరల్ రెవ పాదర్ పి.బాల అన్నారు. బుధవారం దెందులూరు మండలం సానిగూడెంలోని నిత్య సహాయ మాత దేవాలయం వార్షికోత్సవంలో భాగంగా పాదర్ జోస్‌పాల్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున సంఘ పెద్దలు, క్రైస్తవులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సంపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ

ఏలూరు రూరల్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : టెన్త్ రాసి ఇంటర్‌లో ప్రవేశం చబోతున్న విద్యార్థులను ఎంపిక చేసి 15 రోజుల పాటు సంపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇచ్చినట్టు ప్రధాన శిక్షకులు ప్రత్యూష సుబ్బారావు పేర్కొన్నారు. ప్రేమాలయంలో స్టెప్, మనవతా, సెంటర్ హ్యూమన్ ఎక్సలెన్స్, ప్రేమాలయం సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 20 మంది విద్యార్థినులకు సంపూర్ణ వ్యక్తిత్వ వికాస శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. ముగింపు సమావేశానికి సిఆర్ఆర్ కళాశాల కార్యదర్శి మాగంటి ప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థినులకు సర్టిఫికెట్స్ ప్రదానం చేసినట్టు తెలిపారు.

కాటూరి నాగయ్య మాస్టారుకు సన్మానం

ద్వారకాతిరుమల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): దొరసానిపాడు ఎంపీయూపీ స్కూల్లో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా సుదీర్ఘకాలం పనిచేసి ఉద్యోగ విరమణ చేయనున్న కాటూరి నాగయ్యను పలువురు ఘనంగా సత్కరించారు. ఎంఈవో-1 డి.సుబ్బారావు, ఎంఈఓ-2 పరసా వెంకట్రావులు ముఖ్య అతిథులుగా హాజరై నాగయ్య దంపతులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గెడ్డం దేవానందరావు, బి.జయరాజు, కట్టా శ్రీనివాసరావు, టీడీపీ నేతలు మద్దిపాటి రత్నాజీ, పసుమర్తి సోమశేఖర్ పాల్గొన్నారు.

మంత్రి సారథిని కలిసిన దాసరి శేషు


మంత్రితో శేషు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా ఉన్న తనను టీడీపీ అధిష్ఠానం నూజివీడు నియోజకవర్గ పరిశీలకుడిగా నియమించినట్టు దాసరి శ్యామ్ చంద్రశేషు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి కొలుసు పార్థసారథిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి నియోజకవర్గ పార్టీ విషయాలపై చర్చించినట్టు శేషు తెలిపారు.

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పెదపాడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : ఏటా వల్లూరి సుష్మా మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నాయుడుగూడెంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు వల్లూరి సుష్మా మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వల్లూరి వెంకట కృష్ణయ్య తెలిపారు. ఏలూరు శంకర నేత్రాలయ, కామినేని హాస్పటల్స్ వైద్య బృందం పర్యవేక్షణలో ఉచిత వైద్య శిబిరాన్ని బుధవారం నిర్వహించి 200 మందికి పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. అనంతరం పలువురు పేద విద్యార్థులకు చదువుకు అవసరమైన ఆర్థిక సహకారాన్ని స్కాలర్‌షిప్‌ల రూపంలో అందజేశారు. ఈ కార్యక్రమంలో వల్లూరి సుభద్రాదేవి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఎన్టీఆర్ మెగా ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్

వేలేరుపాడు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : వేలేరుపాడులోని ఎన్టీఆర్ మినీ స్టేడియంలో టీడీపీ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ మెగా ఓపెన్ టెర్నమెంట్‌ను ఏపీ ట్రైకార్ చైర్మన్ బొరగం శ్రీనివాసులు ప్రారంభించారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బొరగం శ్రీనివాసులు బ్యాటింగ్ చేయగా వేలేరుపాడు ఎస్.ఐ. రామారావు బౌలింగ్ చేశారు.ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ శాఖమూరి సంజీవులు, టీడీపీ మండల కార్యదర్శి కట్టం రాంబాబు, మండల ఉపాధ్యక్షులు కురుమెళ్ల సుధాకర్, తెలుగు యువత అధ్యక్షులు కోటిపల్లి ముత్యాలరావు, టీడీపీ నాయకులు కొమ్మన వెంకటేశ్వరరావు, కరుటూరి రాధాకృష్ణ, జాగర్లమూడి శ్రీకాంత్, చాపర్ల శ్రీనివాసరావు, పసుపులేటి లక్ష్మయ్య, కర్పూరం గోపాలకృష్ణ, జి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీ పీఆర్ఎం ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక


కె.స్వామి

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా కాకరపర్తి స్వామి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో ఎన్నికలు జరిగాయి. ఎన్నికల అధికారిగా రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు కె.యోహాన్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్.గోపాలకృష్ణ ఎన్నికల పరిశీలకుడిగా వ్యవహరించారు. ఈఎన్నికల్లో ఉపాధ్యక్షురాలిగా కె.మంగతాయారు ప్రధాన కార్యదర్శిగా వి.ప్రసాద్, జిల్లా కౌన్సిల్ సభ్యులుగా కె.శ్రీనివాసరావు, నరసింహరావు ఎన్నికయ్యారు.

శ్రీవారి సేవలో గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి



ద్వారకాతిరుమల, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమలేశుని ఆలయాన్ని గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకట్రాజు బుధవారం రాత్రి సందర్శించారు. ఆలయానికి వచ్చిన ఆయనకు అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్ల మూలవిరాట్‌లను దర్శించుకుని ఆయన ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఆయనకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం అందచేసారు. ఈవో సత్యన్నారాయణ మూర్తి ఆయనకు స్వామివారి చిత్రపటాన్ని, ప్రసాదాలను అందించారు. ఆయన వెంట లంకా సత్యన్నారాయణ, పోలిన శ్రీను, మద్రాస్ రాము, నాదెళ్ల సురేంద్రనాథ్ చౌదరి, పాతూరి సహృదయ్ పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రోడ్డుపై ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్ మూతలు - రోడ్డుకు సమాంతరంగా ఉండేలా చూడాలంటూ విజ్ఞప్తులు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : ఏలూరు నగరంలోని వన్‌టౌన్ ప్రాంతంలో అగ్రహారం, గడియార స్తంభం సెంటర్, వెలక్కాయల సందు, శెనగపప్పు బజారు తదితర ప్రాంతాల్లో నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో గతంలో రోడ్డు మధ్య భాగంలో అండర్ డ్రైయినేజీ మ్యాన్ హోల్స్ ఏర్పాటు చేశారు. ఈ మ్యాన్ హోల్స్ కొన్నిచోట్ల రోడ్డు కంటే ఎత్తుగా ఉండడం, మరికొన్ని చోట్ల రోడ్డు కంటే దిగువగా ఉండటంతో రాకపోకలు సాగించేందుకు వాహనదారులు అసౌకర్యానికి గురవుతున్నారు. రాత్రివేళల్లో ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగించే వారు ఈ మ్యాన్‌హోల్స్ వలన గాయాలపాలవుతున్నారు. నగరపాలక సంస్థ అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నగరంలోని పలు డివిజన్లలోని రోడ్డు మధ్యలో ఉన్న మ్యాన్‌హోల్స్ అన్నింటిని పర్యవేక్షించి ఎత్తుగా ఉన్నవి దిగువకు, దిగువగా ఉన్నవి ఎత్తు చేసి రాకపోకలు సజావుగా సాగేలా చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.



రోడ్డుపైన ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్స్

ఇంటర్వ్యూ..

58 వేల టన్నుల ధాన్యం సేకరణే లక్ష్యం

నూతంగి ప్రవీణ్ రాజ్, మండల వ్యవసాయాధికారి, ఉంగుటూరు



● **మండలంలో ఎన్ని ఎకరాల విస్తీర్ణంలో దాళ్వా సాగవుతోంది?**

జవాబు : 23,062 ఎకరాలలో వరి సాగు చేపట్టారు. దిగుబడి ఎకరాకు 65 నుంచి 70 బస్తాల వరకు వస్తోంది.

● **మండలంలో ధాన్యం సేకరణ లక్ష్యం ఎంత?**

జవాబు : జిల్లాలో రెండు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుగా నిర్ణయించారు. ఉంగుటూరు మండలంలో 58 వేల టన్నుల ధాన్యం సేకరణగా నిర్ణయించారు.

● **దాళ్వాలో ప్రధాన వరి రకాలు ఏవి?**

జవాబు : పి.ఆర్. 126, 1121 వరి రకాలు ఎక్కువగా సాగయ్యింది.

● **ధాన్యం సేకరణలో ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా?**

జవాబు : ధాన్యం సేకరణకు సంచులు అందుబాటులోకి రావడం లేదు. ఒక్కసారిగా రైతులంతా మాసూళ్లు చేపట్టడం, అలాగే వాతావరణం ఇబ్బంది పెట్టడంతో కొంత సమస్య ఉత్పన్నమైంది.

- ఉంగుటూరు

77.24 శాతం ఉత్తీర్ణత

ఏలూరు జిల్లా విద్యార్థులను అభినందించిన ఎంపీ మహేశ్


విద్యార్థిని స్నేహవర్షినిని అభినందిస్తున్న కొయ్యలగూడెం డిప్యూటీ విద్యాశాఖాధికారి రామన్నదొర

(ఆంధ్రజ్యోతి, నెట్‌వర్క్)

టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఎంపీ మహేశ్ కుమార్ అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో 81శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఇంతటి విజయానికి కారణం మంత్రి నారా లోకేశ్ తీసుకున్న చర్యలేనన్నారు. ఏలూరు జిల్లాలో 77.24 శాతం ఫలితాలు సాధించడానికి కృషి చేసిన ఉపాధ్యాయులు, అధికారులకు అభినందనలు తెలిపారు. దెందులూరు మండలంలోని ఎనిమిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో 486 మంది టెన్త్ పబ్లిక్ పరీక్షలు రాగా 288 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో గోపన్నపాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థిని కె.తేజశ్రీ 559 మార్కులు సాధించి మండలంలో మొదటి స్థానంలో నిలిచింది. రెండవ స్థానంలో మేదినరావు పాలెం జడ్పీ ఉన్నత పాఠశాలలో టెన్త్ చదువుతున్న చల్లారి రమ్యశ్రీ 557 మార్కులు సాధించి రెండవ స్థానం సాధించింది. లింగపాలెం మండలంలో టెన్త్ పరీక్షల్లో 81 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో రామారావు పేర్కొన్నారు. ధర్మాజీగూడెం పాఠశాలకు చెందిన విద్యార్థి షేక్ యాకూబ్ వలి 569, ఎం.నాగ విజయలక్ష్మి 563 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచారని అన్నారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయులు బి.వెంకటరత్నం, బీవీఎస్ఎన్ రాజు అభినందించారు. పెదపాడు మండలంలోని 11 ప్రభుత్వ పాఠశాలల్లో 543 మంది విద్యార్థులకు గానూ 391 మంది ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి నబ్బితి నరసింహమూర్తి, దేవినేని వెంకట రమణలు తెలిపారు. పెదపాడు మండలంలో వీరమ్మకుంట హైస్కూల్ నుంచి 584 మార్కులతో కలిపిండి నిహారిక, వట్లూరు సోషల్ వెల్ఫేర్ పాఠశాల నుంచి టి.మహాలక్ష్మి 563 మార్కులు సాధించినట్టు తలిపారు. ద్వారకాతిరుమల మండలంలో ఉత్తీర్ణతా శాతం 78.97 వచ్చినట్టు ఎంఈవో పరసా వెంకట్రావు తెలిపారు. ఏపీఎస్‌డబ్ల్యూఆర్ స్కూల్‌కు చెందిన మద్దా సువర్ణకు 553 మార్కులతో మండల ఫస్ట్ రాగా, జి.కొత్తపల్లి జడ్పీ ఓరియంటల్ హైస్కూల్‌కు చెందిన కుక్కల రాజేష్ 552 మార్కులతో ద్వితీయ స్థానం, తిమ్మాపురం జడ్పీ హెచ్ స్కూల్‌కు చెందిన తోట శాంతి 550 మార్కులతో తృతీయస్థానం సాధించినట్టు ఎంఈవో తెలిపారు. పోలవరం మండలంలోని 10 పాఠశాలల నుంచి మొత్తంగా 340 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కాగా 224 మంది హాజరైనట్టు మండల విద్యాశాఖాధికారులు సురేష్ బాబు, సురేంద్రరాయ్‌లు తెలిపారు. కాలింగి తన్మయి 562 మార్కులు సాధించగా, ఉగిరిపల్లి సాయి సుదీర్ 550, తెలగంశెట్టి దుర్గాప్రసాద్ 544 మార్కులు సాధించి మండలంలో ఉత్తమ ప్రతిభ కనబరచారు. తూర్పు గోదావరి జిల్లా వేలివెన్ను శశి స్కూల్లో చదువుతున్న జయవరపు శివరామకృష్ణ పద్మావతిల కుమారుడు ఉజ్వల సాయికృష్ణ 595 మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో టాపర్‌గా నిలిచాడు. వేలేరుపాడు మండలంలోని నాలుగు పాఠశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా 136 మంది ఉత్తీర్ణులయ్యారు. వేలేరుపాడు జడ్పీ హైస్కూల్‌కు చెందిన రంకిరెడ్డి హర్షవర్ధన్ 549మార్కులు సాధించి మండలం ఫస్ట్ రాగా, కర్నాటి భావనశరణ్య 544మార్కులు సాధించి ద్వితీయ స్థానం సాధించారు. జంగారెడ్డిగూడెం మండలంలోని వేగవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థి నల్లగోపుల శామ్యూల్ రాజు 573 మార్కులు సాధించి మండలం ఫస్ట్ రాగా, శ్రీనివాసపురం గ్రామానికి చెందిన కుందవరపు పూజిత 571 మార్కులతో ద్వితీయ స్థానం, 564 మార్కులతో దేవులపల్లి విద్యాబాల తృతీయ స్థానం సాధించింది. జంగారెడ్డిగూడెం జడ్పీ బాలుర హైస్కూల్లో 500 మార్కులు కంటే ఎక్కువ సాధించిన విద్యార్థులను ప్రధానోపాధ్యాయురాలు లోవ కుమారి, ఉపాధ్యాయులు అభినందించారు.టెన్త్ విద్యార్థులు పెదవేగి మండలంలో 66.61 శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈవో వి.అరుణ్ కుమార్ తెలిపారు. ఎస్ఎంసీ హైస్కూల్ విద్యార్థిని టి.జాహ్నవి 580, గంగన్నగూడెం శివారు శ్రీసాయి హైస్కూల్ విద్యార్థి పీఎస్ఎస్.మణికంఠ 580 మార్కులతో మండలం టాపర్‌గా నిలవగా, కొప్పాక, విజయరాయి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల విద్యార్థులు జి.ఏసుబాబు, ఇ.వాసంతిలు 572 మార్కులు సాధించారని తెలిపారు. నిడమర్రు మండలంలో ఏడు ఉన్నత పాఠశాలల తరపున 311 మంది టెన్త్ పరీక్షలకు హాజరుకాగా 176 మంది ఉత్తీర్ణత సాధించారని మండల విద్యాశాఖాధికారి భాస్కర్ తెలిపారు. చిననింద్రకొలను విద్యార్థిని కందుల దివ్య అత్యధికంగా 554 మార్కులు సాధించగా, పెదనింద్రకొలను విద్యార్థిని నిమ్మల పావని 553, ఛానమిల్లి ఉన్నత పాఠశాల విద్యార్థిని బి.మధచందన 541 మార్కులు సాధించినట్టు తెలిపారు. కొయ్యలగూడెం మండలంలోని గవరవరం సాయిరాకేశ్ పాఠశాల విద్యార్థిని పసుపులేటి స్నేహవర్షిని 594 మార్కులతో మండలంలో ప్రథమ స్థానం సాధించగా, సరిపల్లి ఎంవీఆర్ పాఠశాల విద్యార్థిని మెట్టా నాగ దివ్య 590 ద్వితీయ స్థానం, అదే పాఠశాలకు చెందిన జొన్నగడ్డల అప్పారావు 589 తృతీయ స్థానం సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి సురేశ్‌బాబు తెలిపారు. ఈ మేరకు ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను డిప్యూటీ విద్యాశాఖాధికారి రామన్నదొర అభినందించారు. బుట్టాయగూడెం మండలంలో 613 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 377 మంది ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి టి.బాబూరావు తెలిపారు. బుట్టాయగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని కట్టా లావణ్య 579 మార్కులతో మండల టాపర్‌గా నిలిచినట్టు తెలిపారు. టినర్సాపురం మండలంలో 61 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారి రామ్మూర్తి తెలిపారు. 415మంది విద్యార్థులు హాజరుకాగా 253మంది ఉత్తీర్ణత సాధించినట్టు తెలిపారు. టినర్సాపురం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పసుపులేటి.ఆశాశ్రీసౌర్య, బొర్రంపాలెం డీఎస్ఆర్ విద్యాసంస్థల నుంచి జీ.మౌనికలు 579 మార్కులతో ప్రథమ స్థానంలో నిలవగా అప్పలరాజుగూడెం గురుకుల పాఠశాల విద్యార్థి ఎల్.వరుణ్ సందేశ్ 578 మార్కులు సాధించి మండలంలో ద్వితీయ స్థానం సాధించినట్లు ఆయన తెలిపారు. జీలుగుమిల్లి మండలంలో 354 మంది పరీక్షలు రాయగా 192మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఈవోలు 1,2 కె.శ్రీనివాసరావు, ఎస్.బుచ్చయ్యలు తెలిపారు. జీలుగుమిల్లికి చెందిన కె.సాయిపవన్ కుమార్ 568 మార్కులు సాధించి మండలం ఫస్ట్ రాగా, కామయ్యపాలెం జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పి.హేమసాయిలక్ష్మి 555 మార్కులతో ద్వితీయ స్థానం సాధించినట్టు తెలిపారు. కామవరపుకోట మండలంలో 395 మంది పరీక్ష రాయగా 287 మంది ఉత్తీర్ణత సాధించినట్టు ఎంఇఓలు డి.సుబ్బారావు, సి.హెచ్.ప్రశాంత్ కుమార్‌లు తెలిపారు. కామవరపుకోట హైస్కూల్స్‌కు చెందిన సి.హెచ్.సూర్యదీప్తి 586 మార్కులతో మండలం ఫస్ట్ రాగా, అదే పాఠశాలకు చెందిన కె.రమ్యశ్రీ సాయి 574 మార్కులతో ద్వితీయ స్థానం, టూకూరి నిహారిక 568 మార్కులతో తృతీయ స్థానం సాధించినట్టు తెలిపారు. ఏలూరు జిల్లా కెఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని విద్యార్థులు 63 శాతం ఉత్తీర్ణత సాధించినట్టు పీవో కె.రాములు నాయక్, గిరిజన సంక్షేమశాఖ ఉప సంచాలకులు శ్రీవిద్య తెలిపారు. ఐటీడీఏ పరిధిలో 731 మంది పరీక్షలు రాయగా 485 మంది ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు. ఉంగుటూరు మండలంలో 60 శాతం విద్యార్థులు టెన్త్‌లో ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారులు రవీంద్రభారతి తెలిపారు. ఇందులో బాదంపూడి హైస్కూల్‌కు చెందిన శిరికి జస్వంత్ 580 మార్కులు సాధించి మండలం ఫస్ట్ రాగా, నారాయణపురం వివేకానంద పాఠశాలకు చెందిన గుడ్ల హర్షప్రియ 577 మార్కులతో ద్వితీయ స్థానం సాధించినట్టు తెలిపారు. భీమడోలు మండలంలో 70 శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు విద్యాశాఖాధికారులు తెలిపారు. పూళ్ళ జడ్పీ హైస్కూలు విద్యార్థిని తన్మశ్రీ 575 సాధించగా, భీమడోలు హైస్కూలు విద్యార్థిని స్నేహదీపిక 565, గురుకుల పాఠశాల విద్యార్థిని వి.వెన్నెల 565 మార్కులు సాధించి మండలంలో టాపర్స్‌గా నిలిచారని తెలిపారు. కుక్కునూరు మండలంలో 81.82 శాతం టెన్త్ విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్టు మండల విద్యాశాఖాధికారులు తెలిపారు. ఎనిమిది పాఠశాలలకు చెందిన 297మంది విద్యార్థులు పరీక్షలు రాయగా అందులో 243మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ప్రభుత్వ పాఠశాలకు చెందిన కారం లిఖిత 509 మార్కులతో ఉత్తమ ప్రతిభ చూపింది.


తరుణ్ (543)


ఆశాశ్రీసౌర్య(579)


కె.రమ్యశ్రీ(574)


మణి సృజన(559)


కె.సాయి(568)


యాకూబ్‌వలీ(569)


విజయలక్ష్మి(563)


సాయికృష్ణ(595)


జస్వంత్(580)

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం


నగదు అందజేస్తున్న టీడీపీ నాయకులు

జంగారెడ్డిగూడెం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో గాయపడిన రాజీవ్ నగర్‌కు చెందిన టీడీపీ కార్యకర్త చల్లా రామకృష్ణకు టీడీపీ నాయకులు సాయం అందజేశారు. టీడీపీ నాయకులు బూరుగుపల్లి సూరిబాబు, మద్దిపాటి నాగేశ్వరరావు, రాయపాటి సుబ్బారావులు బుధవారం రామకృష్ణను పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.12 వేల నగదు, 25 కిలోల బియ్యం అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈర్ని సూరిబాబు, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు ఎడ్లపల్లి ఏడుకొండలు, శీలం రాంబాబు, కొత్తూరి సత్తిబాబు, డేరంగుల వెంకట్, పవన్, కోటేశ్వరరావు, నూక రాజు నాగు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

టి.నర్సాపురం, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): టి.నర్సాపురం పంచాయతీలోని రుద్రకోటరాజుగూడెం గ్రామంలోనే ఆర్‌కేఆర్ ఐడియల్స్ తరపున చలివేంద్రం ప్రారంభించి ప్రయాణికులకు మజ్జిగ, మంచినీరు అందజేశారు. గత సంవత్సరం 10వ తరగతిలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ముగ్గురు విద్యార్థులకు ఈ సంవత్సరంలో ఇంటర్‌లో ఉత్తమ ప్రతిభ కనపిరిచిన విద్యార్థులకు రూ.18వేలు బహుమతిగా అంజేసినట్లు తెలిపారు. మూడు సంవత్సరాలుగా విద్యార్థులను ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భూపతిరామారావు, వేగిరాల రాంబాబు, గుండే మహ రాజ్, ఉప సర్పంచ్ నేతర వెంకటేశ్వరరావు, ఎంపీటీసీ బాలయ్య తెలిపారు.

ఉగ్రదాడి హేయమైన చర్య : చంటి

ఏలూరు టూటౌన్, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): జమ్మూ కాశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు కాల్పులు జరపడం హేయమైన చర్య అని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ దాడిలో ఆశువులుబాసిన వారికుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

దాతృత్వం చాటిన మండల పాస్టర్స్

కుక్కునూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడుతున్న అమరవరం పంచాయతీకి చెందిన తిమోటి అనే వ్యక్తికి కుక్కునూరు మండల పాస్టర్స్ ఫెలోషిప్ సేవకులు రూ.11 వేలు నగదు వైద్య ఖర్చుల నిమిత్తం అందజేశారు. వీరికి బాధితులు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించండి


బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఏలూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : బడిబాట కార్యక్రమంలో భాగంగా ఏలూరు రూరల్ మండలం మాదేపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు పి.ఆంజనేయులు, శివశంకర్ వినూత్న రీతిలో బడిబాటకు శ్రీకారం చుట్టారు. విద్యార్థులతో కలిసి గ్రామంలో ప్రతీ ఇంటికి తిరిగి బడి ఈడు పిల్లలను బడికే పంపాలని, అది ప్రభుత్వ బడిలోకే పంపాలని కోరారు. అలాగే పాటల రూపంలో ప్రభుత్వ పాఠశాలల గొప్పతనం గురించి వివరించారు. బుధవారం అడ్మిషన్లు డ్రైవ్ నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్ళి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

'ఎంచుకున్న సబ్జెక్టుల్లో రాణించాలి'

ఏలూరు రూరల్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు తాము చదివే కోర్సుల్లోని సబ్జెక్స్ నైపుణ్యాలు సాధించాలని, ఆ దిశగా ముందుకు సాగాలని రాష్ట్ర ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తుమ్మారెడ్డి శివరాం అన్నారు. బుధవారం ఎన్.ఫౌండేషన్ అధినేత నారా శేషు ఆధ్వర్యంలో యువతకు స్వయం ఉపాధి పథకాలు, అవకాశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న ప్రోత్సాహకాలు యువతకు, విద్యార్థులకు వివరించారు. పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారస్తులుగా ఎదగాలని వాళ్ళకు కొత్త ఎంఎస్ఎంఈ పాలసీ వివరించారు. ఈ పాలసీని ఉపయోగించుకుని పారిశ్రామికవేత్తలుగా, వ్యాపారస్థులుగా ఎదిగి పది మందికి ఉపాధి కల్పించడానికి దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఎస్ఎంఈ అడిషనల్ డైరెక్టర్ సుదర్శన్‌బాబు, అంబికా సంస్థల చైర్మన్ అంబికా కృష్ణ, మర్చెంట్స్ ఆఫ్ ఛాంబర్స్ అధ్యక్షులు శేర్నేళ్ళ రాజేంద్ర నాగ హనుమాన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ డైరెక్టర్ నారా నరసింహమూర్తి, నగరంలోని పుర ప్రముఖులు పాల్గొన్నారు.

పంట కాలువల్లో పూడిక తీత ప్రారంభం


పనులు పర్యవేక్షిస్తున్న శివ రామారావు

నిడమర్రు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : పంట కాలువలకు నీటి విడుదల నిలిపివేయడంతో ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు చొరవతో పూడికతీత పనులను చేపట్టారు. అడవికొలను డీసీ పరిధిలోని పెదనింద్రకొలనులోని కొండారెడ్డి, కలవకోడు, పంట కాలువలకు రైతుల సహ కారంతో మొదటి సారిగా కుమ్మరకోడు నుంచి కాంటూరు వరకు సర్వే చేసి, సరిహద్దు రాళ్లు వేయించి పూడికతీత లో భాగంగా తవ్వకం పనులు ప్రారంభించారు. ఈ పను లను డీసీ చైర్మన్ బేతు వెంకట శివరామారావు, పెద నింద్రకొలను నీటి సంఘం అధ్యక్షులు అయితం రాజేంద్ర ప్రసాదులు దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా రైతులు ఎమ్మెల్యే ధర్మరాజుకు, డీసీ కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

లక్ష్మీపురంలో అరటితోట దగ్ధం

పెదవేగి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : లక్ష్మీపురం గ్రామానికి చెందిన బలుసు సాయిబాబుకు చెందిన అరటితోట అగ్నిప్రమాదంలో దగ్ధమైంది. గోపన్నపాలెం- పెదవేగి ప్రధాన రహదారి పక్కన ఉన్న ఈ అరటి తోటకు మంటలు ఎలా అంటుకున్నాయో తెలియలేదని బాధిత రైతు సాయిబాబు తెలిపారు. ఈ ప్రమాదం వల్ల దాదాపు రూ.50వేల వరకు నష్టం వాటిల్లిందని రైతు తెలిపారు.

కనకారావుకు సత్కారం

కామవరపుకోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : ఉగాది పురస్కారాల్లో భాగంగా సీఎం చంద్రబాబు ద్వారా పద్మశ్రీ అవార్డు అందుకున్న దివంగత నాజర్ శిష్యుడు లక్కవరం గ్రామానికి చెందిన నబ్బి కనకారావుకు కళా రత్న బిరుదు ప్రదానంతో సత్కరించారు. ఈ మేరకు సీపీఐ కార్యాలయంలో బుధవారం నబ్బి కనకారావును ఈ మేరకు సత్కరించినట్టు ప్రజా నాట్య మండలి నాయకులు టి.వి.ఎస్. రాజు, ఇబ్రహీంలు తెలిపారు.

సారా కేసులో మహిళ బైండోవర్

కామవరపుకోట, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : సారా కేసుల్లో నిందితురాలైన కామవరపుకోటకు చెందిన వాకా సావిత్రిని బుధవారం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. ఆమెపై 129 బిఎన్ఎస్ఎస్ చట్టం ప్రకారం బైండోవర్ నమోదు చేశామని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు.

ఫీవర్ సర్వేపై అవగాహన ర్యాలీ

ఉంగుటూరు,ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి) : చేబ్రోలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో బుధవారం తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప వైద్యాధికారి వై.వీ.లక్ష్మణరావు ఆధ్వర్యంలో ఫీవర్ సర్వే జరిగింది. ఇందులో భాగంగా ప్రజారోగ్యంపై ప్రజలకు చుట్టు పక్కల వారికి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో శ్రీనివాస్, వి.వి.నాగలక్ష్మి, సుజాత, స్వప్న, వెంకట స్వామి పాల్గొన్నారు.

మేడే ఉత్సవాలకు సన్నాహాలు

ఏలూరు కార్పొరేషన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 139వ మేడే ఉత్సవాలను ఏలూరు నగరంలో అన్ని డివిజన్లలోను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య తెలిపారు. మే ఒకటవ తేదీన అన్ని డివిజన్లలో అరుణ పతాకాలు ఎగురవేయడం, కార్మికులతో ప్రదర్శన జరపడం, కార్మిక సమస్యలపై పోరాటాలు సాగిస్తామని తెలిపారు. ఆయన వెంట ఏఐటీయూసీ నాయకులు పళ్ళెం కిషోర్, జగన్నాథరావు, బండి వెంకటేశ్వరరావు ఉన్నారు.

శాశ్వత పరిష్కారమే లక్ష్యం

ఏలూరుటూటౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపిస్తామని ఎమ్మెల్యే బడేటి చంటి అన్నారు. ప్రజాదర్బార్ కార్యక్రమం బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించారు. ఎమ్మెల్యే చంటి మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను క్రమపద్ధతిలో నెరవేరుస్తున్నామన్నారు. ప్రజాసమస్యల సత్వరపరిష్కారానికి చర్యలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో ఇచ్చిన హామీలన్ని నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నామన్నారు.

నవ్య
కుటుంబ కదంబం
గురువారం • 24 ఏప్రిల్ 2025



స్వశక్తితో ఉన్నత స్థానాలకు ఎదిగి, తమ తమ రంగాల్లో శక్తిమంతులుగా గుర్తింపు పొందిన కొందరు మహిళల జాబితాను 'ఫోర్బ్స్' పత్రిక ఇటీవల విడుదల చేసింది. ఆయుర్వేద ఉత్పత్తుల రంగంలో అంతర్జాతీయ బ్రాండ్ వ్యవస్థాపకురాలైన 69 ఏళ్ల మీరా కులకర్ణి, దేశంలో అత్యున్నత మానసిక వైద్య సంస్థకు డైరెక్టర్‌గా తనదైన ముద్ర వేస్తున్న 64 ఏళ్ల డాక్టర్ ప్రతిమా మూర్తి వారిలో ఉన్నారు.



స్వశక్తి 'సంపన్నులు'

నమ్మకమే ఆమె ధైర్యం

పుట్టిన ఊరైన ఢిల్లీలో, ప్రకృతి సౌందర్యంతో అలరారే సిమ్లాలోని హాస్టల్స్‌లో ఆడుతూ పాడుతూ గడిచిపోయిన రోజుల తరువాత... కఠినమైన జీవన వాస్తవికత మీరా కులకర్ణి అనుభవంలోకి వచ్చింది. "దానికి కారణం నేను తీసుకున్న నిర్ణయమే" అంటారామె. మీరాను విదేశాల్లో చదివించాలని ఆమె తండ్రి కోరిక. మరోవైపు పెళ్ళి సంబంధం వచ్చింది. "పుట్టిన దేశాన్ని, కన్నవారిని వదిలేసి... కొత్త చోటుకు వెళ్ళాలనే ఆలోచన నాకు భయంగా అనిపించింది. అందుకే పెళ్ళికి ఒప్పుకున్నాను. కానీ వెనక్కి తిరిగి చూసుకుంటే... 'నాకు ఏమాత్రం తెలియని వ్యక్తిని ఎలా పెళ్ళి చేసుకోగలిగాను? అది నాకు భయంగా ఎందుకు అనిపించలేదు?' అనే ప్రశ్నకు నా దగ్గర సరైన సమాధానం లేదు" అని చెబుతారు మీరా. పెళ్ళయ్యాక... ఢిల్లీ నుంచి వ్యాపారస్తుడైన భర్తతో కలిసి చెన్నైలో కాపురం. కానీ అప్పటికే ఆమె భర్త వ్యాపారం నష్టాల్లో ఉంది. దానికి తోడు అతనికి మద్యపాన వ్యసనం. నాలుగేళ్ళు గడిచాక... భర్త వేధింపులను భరించలేని ఆమె... ఇద్దరు పిల్లలతో మళ్ళీ ఢిల్లీ వచ్చేశారు. చిన్న చిన్న పనులు చేస్తూ, తల్లిదండ్రుల సాయంతో పిల్లల్ని పెంచుతూ, ఒంటరి తల్లిగా మీరా సాగిస్తున్న జీవితం... ఆయుర్వేద సబ్బుల తయారీతో కొత్త మలుపు తిరిగింది.

> 'డెబ్భై శాతం తగ్గింపు అంటూ ఊరించే నకిలీ, నాసిరకం ఆయుర్వేద ఉత్పత్తులు మార్కెట్‌లో కుప్పలుతెప్పలుగా కనిపిస్తాయి. అలాంటి జిమ్మికులను మేము ఎప్పుడూ నమ్ముకోలేదు.

నమ్మకంతో ధైర్యం చేశాను...

"మన దేశంలో తయారవుతున్న సబ్బుల్లో నాణ్యత లేదని తెలుసుకున్నాక... ప్రాచీన ఆయుర్వేద పద్ధతుల్లో నేనే వాటిని తయారు చేయాలనుకున్నాను. ఋషీకేశ్‌ను ఆయుర్వేదానికి పుట్టినిల్లు అంటారు. అక్కడ నిపుణులను కలిసి... కొన్ని పద్ధతులు తెలుసుకున్నాను. అయితే ఆ పద్ధతుల్లో సబ్బుల తయారీ చాలా ఖరీదైనతా. కానీ ఆ పద్ధతిలో తయారు చేస్తే తప్ప వాటిలో నాణ్యత ఉండదు. మంచి ఉత్పత్తులకు ఆదరణ ఉంటుందని నా నమ్మకం. అందుకే ధైర్యం చేశాను. ప్రయోగాలు కొనసాగించి... కొన్ని సబ్బులు చేశాను. తెలిసిన వారికి, కొన్ని దుకాణాలకు ఇచ్చాను. మెల్లగా మొదలైనా... కొన్నవారే మళ్ళీ మళ్ళీ కొనడం, వారి సిఫార్సుతో కొత్త కస్టమర్లు రావడంతో అమ్మకాలు వేగం అందుకున్నాయి. దాన్ని పూర్తిస్థాయి వ్యాపారంగా మార్చాలనే ఆలోచన 2000 సంవత్సరంలో వచ్చింది. రెండు లక్షల పెట్టుబడి, ఇద్దరు ఉద్యోగులతో 45 ఏళ్ళ వయసులో 'ఫారెస్ట్ ఎసెన్షియల్స్' ప్రారంభించాను" అని గుర్తు చేసుకున్నారు మీరా. ఇప్పుడు మేనేజింగ్ డైరెక్టర్‌గా ఆ సంస్థను నడిపిస్తున్నారు.

వారే ప్రచారకర్తలు

గత పాతికేళ్ళలో 'ఫారెస్ట్ ఎసెన్షియల్స్' శరవేగంతో విస్తరించింది. ఒక విదేశీ కంపెనీ పెట్టుబడి పెట్టడంతో కొత్త ఉత్పత్తుల తయారీకి వీలు కలిగింది. ఫేషియల్, బాడీ, వెల్‌నెస్... ఇలా పలు విభాగాల్లో కొన్ని పదుల ఉత్పత్తులను మీరా బృందం రూపొందించింది. లగ్జరీ ఆయుర్వేదిక్ బ్రాండ్‌గా ఖ్యాతి సంపాదించింది. దేశంలో ఈ సంస్థకు 130కి పైగా స్టోర్స్ ఉన్నాయి. 120 దేశాలకు వారి ఉత్పత్తులు ఎగుమతి అవుతున్నాయి. ఈ క్రమంలో మీరాకు, ఆమె బ్రాండ్‌కు పలు పురస్కారాలు లభించాయి. దేశంలో ప్రభావవంతమైన మహిళగా 'ఫోర్బ్స్' తదితర జాబితాల్లో మీరా పేరు చోటు చేసుకుంది. ఈ రోజు ఎలాంటి రుణాలు లేని వందల కోట్ల బ్రాండ్‌గా ఆమె సంస్థ నిలిచింది. "డెబ్భై శాతం తగ్గింపు అంటూ ఊరించే నకిలీ, నాసిరకం ఆయుర్వేద ఉత్పత్తులు మార్కెట్‌లో కుప్పలుతెప్పలుగా కనిపిస్తాయి. అలాంటి జిమ్మికులను మేము ఎప్పుడూ నమ్ముకోలేదు. ప్రకటనలకు ఖర్చు పెట్టం. మా వినియోగదారులే మాకు ప్రచారకర్తలు" అంటారు మీరా. 'ఎసెన్షియల్లీ మీరా' పేరుతో ఆమె రాసిన ఆత్మకథ మంచి ఆదరణకు నోచుకుంది.

మనసు గుట్టు కనిపెడుతూ..

ఎంబీబీఎస్ చెయ్యాలి. డాక్టర్‌గా పేరు తెచ్చుకోవాలి... ఇది ప్రతిమామూర్తి చిన్ననాటి కల. అనుకున్నట్టే బెంగళూరు వైద్య కళాశాలలో సీటు సంపాదించారు. క్రమంగా... ఆలోచనలు, మెదడు మానవులను, వారి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తాయనే విషయం మీద ఆసక్తి పెరిగింది. ఎంబీబీఎస్ పూర్తి చేసిన వెంటనే... 'నిమ్హాన్స్' (జాతీయ మానసిక, నరాల విజ్ఞాన సంస్థ)లో డీపీఎం, ఎండీ (సైకలాజికల్ మెడిసిన్) పూర్తి చేశారు. ఆ తరువాత... బ్రిటన్‌లోని యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో సైకలాజికల్ మెడిసిన్‌లో డిప్లమా చేశారు. అప్పట్లో ఆమె ఆసక్తి వేరే వైద్య విభాగం మీదకు మళ్ళితే... దేశం ఒక గొప్ప సైకియాట్రిస్టును కోల్పోయేదంటారు ఆమె గురించి తెలిసిన వైద్య నిపుణులు. తన రంగంలో అత్యున్నతంగా నిలవడమే కాదు... దేశంలోనే అతి పెద్ద మానసిక ఆరోగ్య సంస్థ 'నిమ్హాన్స్'కు డైరెక్టర్ స్థాయికి ఎదిగారు. ఆ పదవిని చేపట్టిన రెండో మహిళగా, తొలి మహిళా సైకియాట్రిస్టుగా ఆమె చరిత్రకెక్కారు. 2021లో ఆ బాధ్యతలను ప్రతిమ స్వీకరించిన సమయానికి... దేశం కొవిడ్ కల్లోలంలో ఉంది. "కొవిడ్ మహమ్మారి ఏదో ఒక మేరకు అందరినీ మానసికంగా ప్రభావితం చేసింది. సరైన వైద్య సాయం అందకపోవడం వల్ల ఆ సమస్యలు కొందరిలో కొనసాగుతున్న పరిస్థితిని చూస్తున్నాం" అంటారు ప్రతిమ.

> 1980ల్లో నేను డిప్లమా చేస్తున్నప్పుడు ఒక బ్యాచ్‌లో పదిమంది ఉంటే ఇద్దరే అమ్మాయిలు ఉండేవారు. ఇప్పుడు 40 మందిని పోస్ట్ గ్రాడ్యుయేషన్‌కు తీసుకుంటున్నాం. వారిలో సగానికి పైగా అమ్మాయిలే. ఇది మంచి పరిణామం"

జాతీయ సర్వేకి సారథ్యం...

ప్రత్యక్షంగానైనా, జూమ్ లాంటి మాధ్యమాల ద్వారా అయినా... సమస్యలను ఆమె చాలా ఓపికగా వింటారు. సాధ్యమయ్యే పరిష్కారాలు చెబుతారు. అసిస్టెంట్ ప్రొఫెసర్, సెంటర్ ఫర్ అడిక్షన్ మెడిసన్‌కు అధిపతి, సైకియాట్రీ విభాగాధిపతి, ఇప్పుడు డైరెక్టర్... ఇలా తన వృత్తి జీవితంలో ఏ దశలో ఉన్నా ఆమె నిబద్ధతలో మార్పు లేదు. "నిమ్హాన్స్... కేవలం మానసిక ఆరోగ్యానికి మాత్రమే కాదు.. న్యూరో సర్జరీ, న్యూరాలజీ, న్యూరో రేడియాలజీ లాంటి అనేక అంశాల్లో సేవలు అందించే సంస్థ. నేను చదువుకున్న సంస్థకే డైరెక్టర్ కావడం నా బాధ్యతను మరింత పెంచింది" అంటున్నారు ప్రతిమ. కరోనా అనంతరం దేశంలోని మానసిక ఆరోగ్య పరిస్థితుల గురించి మరింత తెలుసుకోవడానికి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో ప్రస్తుతం జరుగుతున్న 'నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే'కి ఆమె సారథ్యం వహిస్తున్నారు. "ఇలాంటి సర్వే మొదటిసారి పదేళ్ళ క్రితం... పన్నెండు రాష్ట్రాల్లో జరిగింది. దేశంలోని ప్రతి పదిమందిలో ఒకరు గుర్తించదగిన మానసిక ఆరోగ్య వైకల్యాలతో బాధపడుతున్నారని, అర్హులైన మానసిక ఆరోగ్య నిపుణుల కొరత ఉందని ఆ సర్వే వెల్లడించింది. రెండవది అయిన తాజా సర్వే వివరాలను వచ్చే ఏడాది ప్రచురిస్తాం. గ్రామీణ, పట్టణ, గిరిజన ప్రాంతాల్లో, వలస కార్మికుల్లో కొవిడ్ అనంతర పరిమాణాలను ఈ సర్వేలో ప్రధానంగా అధ్యయనం చేస్తున్నాం" అని ఆమె చెబుతున్నారు.

22 భాషల్లో కౌన్సెలింగ్

"మానసిక వైద్యనిపుణులుగా మహిళల సంఖ్య పెరిగి, నాయకత్వ స్థానాల్లో ఉండాల్సిన అవసరం ఎంతో ఉంది. 1980ల్లో నేను డిప్లమా చేస్తున్నప్పుడు ఒక బ్యాచ్‌లో పదిమంది ఉంటే ఇద్దరే అమ్మాయిలు ఉండేవారు. ఇప్పుడు దాదాపు 40మందిని పోస్ట్ గ్రాడ్యుషన్‌కు తీసుకుంటున్నాం. వారిలో సగానికి పైగా అమ్మాయిలే. ఇది మంచి పరిణామం" అంటున్న ప్రతిమ... 'నిమ్హాన్స్'లో సరికొత్త మార్పులకు శ్రీకారం చుడుతున్నారు. 2022లో కేంద్రం ప్రవేశపెట్టిన 'నేషనల్ టెలీ మెంటల్ హెల్త్ ప్రోగ్రామ్'కు ఆమె నాయకత్వం వహిస్తున్నారు. "ఆ ఏడాది అక్టోబర్ నుంచి ఈ ఏడాది మార్చి వరకూ ఈ ప్రోగ్రామ్ హెల్ప్‌లైన్ ద్వారా దేశవ్యాప్తంగా 19 లక్షల మంది రిజిస్టర్ అయ్యారు. ప్రతి రాష్ట్రంలో సుశిక్షితులైన కౌన్సెలర్లు.. 22 భాషల్లో వారి ఇబ్బందులు విని, సలహాలు ఇస్తారు" అని వివరించారు. ఆమె నేతృత్వంలోనే 'నిమ్హాన్స్'కు ప్రపంచ ఆరోగ్య సంస్థ నుంచి కిందటి ఏడాది 'నెల్సన్ మండేలా అవార్డ్ ఫర్ హెల్త్ ప్రమోషన్' లభించింది. వ్యక్తిగతంగా కర్ణాటక ప్రభుత్వం నుంచి 'డాక్టర్ రాజా రామన్న రాజ్య పురస్కారం' సహా అనేక గౌరవాలను ప్రతిమ అందుకున్నారు. 300కు పైగా పరిశోధనా పత్రాలు జాతీయ, అంతర్జాతీయ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. "వైద్యులు ఉన్నది రోగుల సేవ కోసమే. వారి ఇబ్బందులు తీరే మార్గాలను సూచించాలి. అన్నిటికన్నా వారికి మన పట్ల, మనం అనుసరించే వైద్య పద్ధతుల పట్ల నమ్మకం కలిగించడం ముఖ్యం. నా వృత్తి జీవితంలో నేను కట్టుబడి ఉన్న అంశం అదే" అంటున్నారు ప్రతిమ.

కౌన్సెలింగ్

కొత్త తల్లికి నిస్పృహ ఎందుకు?

డాక్టర్, నాకు ఇటీవలే ప్రసవమైంది. తల్లిని అయినందుకు ఉప్పొంగిపోవడానికి బదులుగా తెలియని నిరాశ, నిస్పృహలు వేధిస్తున్నాయి. నాకు ఎందుకు ఇలా జరుగుతోంది?

- ఓ సోదరి, హైదరాబాద్

పేగు తెంచుకుని పుట్టిన పసికందు మీద తల్లికి అవ్యాజ్యమైన ప్రేమ కలగడం సహజమే! కానీ కొందరు బాలింతల్లో 'పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్' అనే సమస్య తలెత్తుతుంది. ప్రతి ఏడుగురు బాలింతల్లో ఒకరు పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్ బారిన



పడుతూ ఉంటారు. ఇది ప్రసవమైన వెంటనే కనిపించవచ్చు, లేదా బిడ్డకు ఏడాది వయసొచ్చే లోపు జరగొచ్చు. అయితే ఎక్కువగా ఈ సమస్య ప్రసవమైన 3 వారాల్లోగానే తలెత్తుతూ ఉంటుంది. నిరాశలో కూరుకుపోవటం, జీవితం మీద ఆసక్తి కోల్పోవటం, అకారణంగా ఏడుస్తూ ఉండటం లాంటి లక్షణాలు ఈసమస్యలో కనిపిస్తాయి. ఈ డిప్రెషన్‌కు లోనయిన తల్లులు...బిడ్డను సరిగా చూసుకోలేనేమో, తల్లిగా బాధ్యతను సమర్ధంగా నిర్వహించలేనేమో, బిడ్డకు ప్రేమను సంపూర్తిగా అందించలేనేమో అనే చిత్రమైన మానసిక స్థితికి లోనవుతూ ఉంటారు. అయితే ఇలాంటి డిప్రెషన్ గురించి భయపడాల్సిన పని లేదు. ప్రసవంతో హెచ్చుతగ్గులకు లోనయ్యే శరీరంలోని హార్మోన్లు, పూర్వం డిప్రెషన్ బారిన పడి ఉండటం, విపరీతమైన ఒత్తిడితోపాటు, కుటుంబ సభ్యుల తోడ్పాటు కొరవడటం లాంటి కారణాల వల్ల తల్లులు పోస్ట్‌పార్టమ్ డిప్రెషన్‌కు గురవుతారు. అయితే ఈ సమస్యను 'యాంటీ డిప్రెసెంట్స్'తో చికిత్స చేసి సరిదిద్దవచ్చు. ఈ మందులు డిప్రెషన్‌కు కారణమయ్యే మెదడులోని కొన్ని రసాయనాలను సంతులనపరిచి సమస్యను తొలగిస్తాయి. ఈ మందుల వల్ల తల్లి పాలు తాగే పిల్లలకు ఎలాంటి దుష్ప్రభావాలూ కలగవు. కాబట్టి డిప్రెషన్ తాలూకు లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి.

- డాక్టర్ దినేష్ కుమార్ చిర్ల,
పీడియాట్రీషియన్ అండ్ నియో నాటాలజిస్ట్,
హైదరాబాద్.

పిల్లలను హాస్టల్‌కు పంపే ముందు...

ఒక్కోసారి పిల్లలను చదువు నిమిత్తం పాఠశాల స్థాయిలోనే హాస్టల్‌కి పంపాల్సి ఉంటుంది. అలాంటప్పుడు తల్లిదండ్రులు ముందుగానే పిల్లలకు కొన్ని విషయాలను నేర్పించడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు.



- పిల్లలకు బాధ్యతగా వ్యవహరించడం నేర్పించాలి. చిన్న చిన్న పనులు చెప్పి చేయిస్తూ ఉంటే వాళ్లకి పనులు చేయడం అలవాటు అవుతుంది.
- సమయానుసారం దినచర్య, వ్యాయామం పూర్తిచేసేలా అలవాటు చేయాలి. క్రమశిక్షణతో ఉండడం నేర్పించాలి.
- పుస్తకాలు సహా దుస్తులు, ఇతర వస్తువులను భద్రపరచుకునే విధానాలు తెలియజెప్పాలి.
- పిల్లలు కొత్త చోట ఉండడానికి భయపడుతూ ఉంటారు. అలాకాకుండా వారిని వెన్నంటి ప్రోత్సహిస్తే ఎప్పటికప్పుడు ఎలాంటి పరిస్థితులతోనైనా సర్దుకుపోవడాన్ని అలవాటు చేసుకుంటారు.
- పిల్లలకు ఆలోచించి నిర్ణయం తీసుకోవడం ఎలానో నేర్పించాలి. ఏ సందర్భాన్ని ఎలా అర్థం చేసుకోవాలో తెలియజెప్పాలి. దీంతో వాళ్లు ఎక్కడైనా ధైర్యంగా ఉండగల్గుతారు.
- అనుకోకుండా ఏదైనా పొరబాటు జరిగితే దాని నుంచి పాఠం నేర్చుకోవడం ఎలానో వివరించి చెప్పాలి.
- ఇతరులను గౌరవించడం, స్నేహపూర్వకంగా మాట్లాడడం, సంయమనంతో మెలగడం లాంటివి నేర్పించాలి.
- పరస్పరం సహాయ సహకారాలు అందించుకోవడం, ఇచ్చిపుచ్చుకునే విధానాల గురించి వివరించాలి.
- బడిలో చెప్పిన పాఠాలను ఎప్పటికప్పుడు నేర్చుకుంటూ నిర్ణీత సమయంలో హోమ్‌వర్క్‌లు పూర్తి చేయడాన్ని అలవాటు చేయాలి.
- చిన్న చిన్న ఆరోగ్య సమస్యల గురించి వివరిస్తూ వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలియజెప్పాలి.
- ఆహారం తీసుకోవడం, ఆటలు ఆడడం, చదువుకోవడం, వ్యక్తిగత శుభ్రత లాంటివి పాటించడంలో నిర్లక్ష్యం వహించకూడదని పిల్లలకు వివరించాలి.



'ఆమ్ పన్నా' కొత్తగా

ప్రస్తుతం మనకు పుల్లని పచ్చి మామిడికాయలు లభ్యమవుతున్నాయి. వీటిలో విటమిన్-సి అధికంగా ఉంటుంది. వీటితో చేసిన 'ఆమ్ పన్నా' తాగితే వేసవి తాపం తీరుతుంది. ఆమ్ పన్నా ఎలా తయారు చేయవచ్చో తెలుసుకుందాం.

తయారీ విధానం

- ఒక చెంచా జీలకర్రను తీసుకొని దోరగా వేయించి చల్లార్చాలి. పది పుదీనా ఆకులు, పావు చెంచా మిరియాలు, రెండు చెంచాల బెల్లపు పొడి, తగినంత ఉప్పును ఒక మూకుడులో వేసి వేయించాలి. జీలకర్ర సహా వీటన్నింటినీ మిక్సీలో మెత్తగా పొడి చేసి పెట్టుకోవాలి.
- రెండు మీడియం సైజు మామిడి కాయలను తీసుకొని... వాటిని ప్రెషర్‌కుక్కర్‌లో మెత్తగా ఉడికించాలి. ఈ మామిడి కాయల తొక్కలను తీసి లోపల గుజ్జును తీయాలి.
- ముందుగా చేసుకున్న పొడిని.. ఈ గుజ్జును.. మిక్సీలో వేసి బాగా తిప్పాలి. దీనిని ఒక కంటైనర్‌లో భద్రపరుచుకోవాలి. ఇది పది రోజుల దాకా పాడుకాదు. కావాలనుకున్నప్పుడు ఈ మిశ్రమాన్ని గ్లాసులో సగం వేసి చల్లటి నీళ్లలో కలుపుకోవాలి. సోడాలో కలుపుకున్నా బాగుంటుంది.
- కేవలం మామిడి రుచి మాత్రమే కావాలనుకొనేవారు పుదీనా ఆకులు వేయాల్సిన అవసరం లేదు.

సెలబ్ ఫిట్

ఆరోగ్యమే అందం

ఆమె గాత్రం... సమ్మోహనాస్త్రం. రాగం... సుస్వరాల సంగమం. బాలీవుడ్ అగ్రతారలకు ఏమాత్రం తీసిపోని అభిమాన గణం. దేశ విదేశీ వేదికలపై తన పాటతో మైమరిపిస్తున్న ప్రముఖ గాయని నేహా కక్కర్. గానంతోనే కాకుండా... రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా... ఫ్యాషన్ ఐకాన్‌గా... యువతరానికి ప్రేరణగా నిలుస్తోంది నేహా. 'మిమ్మల్ని నిత్యనూతనంగా ఉంచుతున్నది ఏంట'ని అడిగితే... క్రమం తప్పని వ్యాయామం, ఆహారపు అలవాట్లే అంటుంది తడుముకోకుండా.



మొన్నామధ్య ఒక వివాదం... ఆస్ట్రేలియాలోని మెల్‌బోర్న్‌లో కన్సర్ట్‌కు నేహా మూడు గంటలు ఆలస్యంగా వచ్చిందని. ఈ గొడవలో ఇంటా బయట ఆమెపై విమర్శలు వెల్లువెత్తాయి. వీటన్నిటినీ మౌనంగా భరించిన నేహా... కార్యక్రమం అయిన కొన్ని రోజులకు అసలు విషయం చెప్పింది.. నిర్వాహకులు తనకు, తన బ్యాండ్‌కు అసలు డబ్బులే ఇవ్వలేదని! 'నేను ఆలస్యంగా వచ్చానంటూ నాపై నిందలు మోపారు. కానీ నాకు గానీ, నా బృందానికి గానీ ఏమైందని ఎవరన్నా అడిగారా? నిర్వాహకులు నాకు ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా పారిపోయారు. నా కోసం వచ్చిన అభిమానులను నిరాశపరచకూడదని ఆ షో నేను ఉచితంగా చేశాను. మాకే కాకుండా సౌండ్ సిస్టమ్ వారికి కూడా పేమెంట్ అందలేదు. దాంతో వారు షో వదిలేసి వెళ్లిపోయారు. ఆఖరి నిమిషంలో నా భర్త రోహన్‌ప్రీత్‌సింగ్ తోడ్పాటుతో కన్సర్ట్ నిర్వహించగలిగాను. వేదిక మీద మాట్లాడినప్పుడు ఈ విషయాలేవీ నేను చెప్పలేదు. కారణం... నావల్ల ఎవరికీ నష్టం జరగకూడదని అనుకున్నాను. కానీ ఇప్పుడు అందరూ తప్పు నాదేనంటూ మాట్లాడుతుంటే... ఆ అపవాదు చెరిపేసుకోవడానికే వాస్తవం ఏమిటో చెప్పాను' అంటూ తన ఆవేదన పంచుకున్న నేహాకు విమర్శలు, ఎత్తిపొడుపులు కొత్తేమీ కాదు. సామాజిక మాధ్యమాల్లో తరచూ ఆమెపై అవాస్తవ కథనాలు పుట్టుకొస్తూనే ఉంటాయి. భర్తతో విడిపోతుందని ఒకసారి... ఆరోగ్యం విషమించిందని మరొకసారి... ఎవరికి ఇష్టంవచ్చినట్టు వారు దుష్ప్రచారం చేస్తూనే ఉన్నారు. అయితే వీటన్నిటినీ పక్కన పెట్టేసి తన పని తాను చేసుకొంటూ వెళుతుంది 36 ఏళ్ల నేహా.

గాయకుల కుటుంబం...

ఉత్తరాఖండ్‌లోని రుషికేశ్‌లో పుట్టిన నేహా... నాలుగేళ్ల వయసులోనే పాటలు పాడటం మొదలుపెట్టింది. తమ కూతురి ఆసక్తిని ఆమె తల్లిదండ్రులు గుర్తించారు. తనకు మంచి శిక్షణ ఇప్పించాలని ఢిల్లీకి వచ్చి స్థిరపడ్డారు. చిన్న చిన్న వేదికలపై ఆధ్యాత్మిక గీతాలు పాడుతున్న నేహా.. పదహారేళ్ల వయసులో అన్నయ్యతో కలిసి ముంబయికి వెళ్లింది. ఆమె అన్న టోనీ, అక్క సోను కక్కర్ కూడా గాయకులే. ముంబయి వెళ్లాక 2005లో టీవీ రియాలిటీ షో 'ఇండియన్ ఐడల్ సీజన్2'లో పోటీపడింది. కానీ ఆరంభంలోనే ఎలిమినేట్ అయింది. మూడేళ్ల తరువాత 'నేహా ద రాక్‌స్టార్' పేరిట తొలి ఆల్బమ్ విడుదల చేసింది. అదే ఏడాది సుఖ్వీందర్‌సింగ్‌తో కలిసి 'మీరాబాయ్ నాటౌట్'లో 'హై రామా' గీతం ఆలపించింది. అదే ఆమెకు తొలి సినిమా పాట. ఆ తరువాత తెలుగు, కన్నడ సినిమాల్లో కూడా పలు పాటలు పాడింది. 2012లో విడుదలైన 'కాక్‌టైల్'లో 'సెకండ్‌హ్యాండ్ జవానీ' పాట సూపర్‌హిట్ కావడంతో నేహా కెరీర్ మలుపు తిరిగింది. ఇక అక్కడి నుంచి వరుసపెట్టి ఎన్నో హిట్ పాటలు ఆలపించింది. 'ఇండియన్ ఐడల్' తదితర రియాలిటీ షోలకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తోంది. వీటితోపాటు దేశవిదేశాల కన్సర్ట్‌లో తన గాత్రంతో అలరిస్తోంది.



అభిమానం 'కోట్లు' దాటింది...

బాలీవుడ్ అగ్ర తారలకు దీటుగా నేహాకు ఇన్‌స్టాగ్రామ్‌లో 7.8 కోట్లమంది ఫాలోవర్స్ ఉన్నారు. ఆమె యూట్యూబ్ చానల్‌ను దాదాపు కోటిన్నరమంది సబ్‌స్క్రైబ్ చేశారు. ఫేస్‌బుక్, ఇతర మాధ్యమాల్లోని అభిమానగణం దీనికి అదనం. ప్రతి పోస్ట్‌కూ లక్షల్లో వ్యూస్, లైక్‌లు. నటుడు హిమాన్ష్ కోహ్లీతో నాలుగేళ్లు ప్రేమాయణం నడిపిన నేహా... అతడిని పెళ్లి చేసుకొంటున్నట్టు కూడా ప్రకటించింది. అయితే కొద్ది రోజుల్లోనే తామిద్దరం విడిపోయామని ట్వీట్ చేసింది. 2020లో పంజాబీ సంగీత కళాకారుడు రోహన్‌ప్రీత్‌సింగ్‌ను పెళ్లాడింది. వృత్తిగత జీవితంలో ఎంత బిజీగా ఉన్నా.. వ్యక్తిగత జీవితానికి కూడా సమయం కేటాయిస్తుంది ఈ గాయని. రోజంతా తనను తాను ఉల్లాసంగా ఉంచుకోవడానికి క్రమం తప్పకుండా వ్యాయామాలు చేస్తుంది. ఆహార నియమాలు పాటిస్తుంది. అందుకే కాలం మారుతున్నా.. నేహా అందం మాత్రం తరగడంలేదు.

వర్కవుట్ ఇలా...

ఎంత పని ఒత్తిడి ఉన్నా అదేపనిగా కుర్చీకి అతుక్కుపోదు నేహా. ముఖ్యంగా తిన్న తరువాత. గంటలతరబడి కూర్చొంటే ఊబకాయంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు ఎన్నో చుట్టుముడతాయని అంటుంది ఈ భామ. ఎప్పుడూ చురుగ్గా, రోజంతా ఉత్సాహంగా ఉండేందుకు ప్రయత్నిస్తుంది. దాని కోసం నిత్యం వ్యాయామాలు చేస్తుంది. జిమ్‌కు వెళ్లామా... లేదా అన్నది ఆమెకు ప్రధానం కాదు. వీలైతే ఇంట్లోనే వర్కవుట్స్ ముగిస్తుంది. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉంటుంది.

- ఉదయం యోగాతో నేహా రోజు మొదలవుతుంది. బరువు తగ్గడానికి యోగా తనకు ఎంతో సహకరించిందని అంటుంది ఆమె. అంతేకాదు... అదనపు కేలరీలు, కొవ్వు కరిగిపోయి, శరీరం నాజూకుగా తయారవుతుంది. అందుకే తన జీవనశైలిలో యోగా లేని రోజంటూ ఉండదని అంటుంది.
- జాగింగ్, రన్నింగ్. బరువు తగ్గడానికి ఇది మంచి కార్డియో ఎక్సర్‌సైజ్.
- 'వర్కవుట్స్ కోసం జిమ్ మీద ఆధారపడను. ఎందుకంటే ఎడతెరిపిలేని షెడ్యూల్స్‌వల్ల ఒక్కోసారి జిమ్‌కు వెళ్లడం కుదరకపోవచ్చు. అందుకే నా వ్యాయామాల్లో అధిక శాతం ఇంట్లో చేసేవే ఉంటాయి' అంటున్న నేహా... అందుకు తగినట్టుగానే తన వర్కవుట్స్‌ను డిజైన్ చేసుకుంది.
- పుషప్స్‌కు ఎక్కువ సమయం కేటాయిస్తుంది.
- అధిక బరువుల జోలికి పోదు. డంబెల్స్ లాంటి తేలికపాటి బరువు గల వెయిట్స్‌తో సాధన చేస్తుంది.

ఇంటి వంటకే ఓటు...

నేహా నమ్మిన సూత్రం ఇది. అందుకే ఆరోగ్యకరమైన, క్రమశిక్షణగల జీవన శైలికి అధిక ప్రాధాన్యం ఇస్తుంది. తీసుకొనే ఆహారంలో పోషక విలువలు పుష్కలంగా ఉండేలా చూసుకొంటుంది. సాధ్యమైనంతవరకు ఇంటి వంట తినడానికే ప్రయత్నిస్తుంది.

- రోజుకు కనీసం మూడు నుంచి నాలుగు లీటర్ల మంచి నీళ్లు తాగుతుంది నేహా. అలాగే కొబ్బరి నీళ్లు కూడా తీసుకొంటుంది. ఇవి శరీరం డీహైడ్రేషన్‌కు గురి కాకుండా కాపాడతాయి. చర్మాన్ని ప్రకాశవంతంగా, మృదువుగా ఉంచడంలో దోహదపడతాయి.
- పండ్ల రసాలు ఎక్కువగా తాగుతుంది. పార్టీలకు వెళ్లినా జ్యూస్‌లు, మిల్క్ షేక్‌లు, సూప్స్ లాంటి ఆరోగ్యకరమైన, బలవర్ధకమైనవే తీసుకొంటుంది.
- నేహాకు కాఫీ చాలా ఇష్టం. కానీ అప్పుడప్పుడు మాత్రమే తాగుతుంది. సేంద్రియ ఎరువులతో పండిన ఆహార పదార్థాలనే వంటకు ఉపయోగిస్తుంది.

20న అంగన్వాడీల సమ్మె

▸ వేతనాల పెంపు, బాలసంజీవని యాప్‌లో మార్పులకు డిమాండ్

▸ సెంటర్ల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలనీ విజ్ఞప్తి

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): అంగన్వాడీలకు వేతనాల పెంపు, మినీలను మెయిన్ అంగన్వాడీలుగా మార్చే జీవో వెంటనే ఇవ్వాలని, బాల సంజీవని యాప్‌లో మార్పులు చేయాలని, అంగన్వాడీ సెంటర్ల నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలనే డిమాండ్లతో మే 20న రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున సమ్మె చేయనున్నట్లు ఏపీ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బేబిరాణి, సుబ్బరావమ్మ తెలిపారు. విజయవాడలో నిర్వహించిన యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఈ మేరకు నిర్ణయించినట్లు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బాల సంజీవని యాప్‌లో 7 నెలల నుంచి 3 సంవత్సరాల లోపు వయసున్న పిల్లలకు ఫొటో క్యాప్చర్ తీసేయాలని, ప్రస్కూల్ పిల్లలకు ఫొటో ఆధారంగా రేషన్ ఇవ్వాలనే నిబంధనలు తొలగించాలని ప్రభుత్వాన్ని కోరనున్నట్టు తెలిపారు. అంగన్వాడీ వర్కర్లకు, మినీ వర్కర్లకు ఫేస్ యాప్ ఇన్, ఔట్ లొకేషన్ తీసివేయాలని, లబ్ధిదారులకు అందిస్తున్న సరుకులన్నీ ఒకేసారి వచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సెంటర్ నిర్వహణకు ట్యాబ్‌లు ఇవ్వాలని, వేసవి సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమస్యల పరిష్కారం కోరకు అధికారులకు వినతిపత్రాలు ఇవ్వాలని సమావేశంలో నిర్ణయించామన్నారు. కార్మిక కోడ్స్, ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు మే 20న దేశ వ్యాప్తంగా సార్వత్రిక సమ్మె చేయాలని నిర్ణయించాయని, ఆ సమ్మెలో అంగన్వాడీలు పాల్గొని జయప్రదం చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.



ప్రధాని సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న మంత్రి నారాయణ, గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి

ఐదు లక్షల మందితో 2న ప్రధాని సభ

▸ అందుకు తగ్గట్లుగా అమరావతిలో పకడ్బందీ ఏర్పాట్లు

▸ పోలీస్ అధికారులతో కలిసి ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి నారాయణ

గుంటూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి పునర్నిర్మాణ పనుల ప్రారంభం సందర్భంగా వచ్చే నెల 2న జరిగే ప్రధాని నరేంద్ర మోదీ సభకు 5 లక్షల మంది హాజరుకానున్నారని రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి పొంగూరు నారాయణ చెప్పారు. అమరావతిలో జరిగే ఆ సభకు పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ప్రధాని రోడ్ షో, సభ ఏర్పాట్లను మంత్రి బుధవారం పరిశీలించారు. గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి, ఎస్పీ సతీష్ కుమార్‌తో కలిసి రెండుగంటలపాటు రాజధానిలోని పలు ప్రాంతాల్లో మంత్రి విస్తృతంగా పర్యటించారు. ప్రధాని పాల్గొనే సభా ప్రాంగణానికి చేరుకునేందుకు అవసరమైన రోడ్లను పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. మే 2న మధ్యాహ్నం 3 గంటలకు ప్రధాని మోదీ గన్నవరం ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని తెలిపారు. అక్కడి నుంచి అమరావతికి వచ్చి 1.1 కిలోమీటర్ల మేర రోడ్ షోలో పాల్గొంటారని, అనంతరం వేదిక వద్దకు చేరుకుంటారని వెల్లడించారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు సభలో ఉంటారని చెప్పారు. ఈ సభకు రాష్ట్ర నలుమూలల నుంచి సుమారు 5 లక్షల మంది ప్రజలు వస్తారని అంచనా వేస్తున్నామని, దానికి తగినట్లుగా శరవేగంగా ఏర్పాట్లు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రజల రాకపోకలకు మొత్తం 8 రోడ్లను, 11 పార్కింగ్ ప్రదేశాలను గుర్తించామని తెలిపారు. ప్రజలు సభ వద్దకు చేరుకునేందుకు వీలుగా ఈ-11, ఈ-13, ఈ-15 రోడ్లతో పాటు సీడ్ యాక్సెస్ రోడ్డు నుంచి రాకపోకలు జరుగుతాయని తెలిపారు. ఈ రోడ్లకు తక్షణం మరమ్మతులు చేసి అభివృద్ధి చేయాలని సీఆర్డీఏను ఆదేశించామన్నారు. మంగళగిరి నుంచి రెండు రోడ్లు, తాడేపల్లి నుంచి ఒకటి, వెస్ట్ బైపాస్ నుంచి ఒకటి, ప్రకాశం బ్యారేజి నుంచి రెండు, తాడికొండ నుంచి ఒకటి, హరిశ్చంద్రాపురం నుంచి ఒక రోడ్డు ద్వారా సభా వేదిక వద్దకు చేరుకోవచ్చని తెలిపారు. వాహనాల రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ట్రాఫిక్ జామ్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నామని వెల్లడించారు.

మద్యం నియంత్రణ, డీఅడిక్షన్ సెంటర్లపై

విస్తృత ప్రచారం కల్పించాలి

▸ ఇప్పటివరకు ఏవైనా కార్యక్రమాలు చేపట్టారా?

▸ పూర్తి వివరాలతో కౌంటర్ వేయండి: హైకోర్టు

అమరావతి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మద్యం నియంత్రణ, డీఅడిక్షన్ సెంటర్ల పనితీరుపై విస్తృత ప్రచారం కల్పించాల్సిన అవసరముందని హైకోర్టు ధర్మాసనం అభిప్రాయపడింది. మద్యం డీఅడిక్షన్ సెంటర్లపై ప్రజల్లో అవగాహన లేదని పేర్కొంది. మద్యం సేవించడం వల్ల కలిగే దుష్ప్రభావాలు, డీఅడిక్షన్ సెంటర్లపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఏ చర్యలు తీసుకుంటున్నారు? ఎలాంటి ప్రచార కార్యక్రమాలు చేపట్టారు? ప్రచార కార్యక్రమాల కోసం బడ్జెట్ ఏమైనా కేటాయించారా? పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఎక్సైజ్, ఆరోగ్య శాఖల ముఖ్య కార్యదర్శులు, ఎక్సైజ్ శాఖ కమిషనర్‌కు నోటీసులు జారీ చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది. నెలలో ఒక వ్యక్తికి విక్రయించే గరిష్ఠ మద్యం బాటిళ్ల సంఖ్యను నిర్ణయించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలన్న పిటిషనర్ అభ్యర్థనను తోసిపుచ్చింది. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని, అలాంటి ఉత్తర్వులు జారీ చేయలేమని పేర్కొంది. డీఅడిక్షన్ సెంటర్ల పనితీరు, రోగులకు అందుతున్న చికిత్సను నిరంతరం పర్యవేక్షించేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ విశాఖకు చెందిన డాక్టర్ ఎస్.షిరిన్ రెహ్మాన్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. నెలలో ఒక వ్యక్తికి విక్రయించే గరిష్ఠ మద్యం బాటిళ్ల సంఖ్యను నిర్ణయించేలా ప్రభుత్వానికి ఆదేశాలు ఇవ్వాలని కోరారు. 21 ఏళ్ల లోపువారికి మద్యం విక్రయించకుండా నిలువరించేందుకు ఆధార్ లింక్ చేసి మద్యం విక్రయించేలా చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఈ పిల్ బుధవారం హైకోర్టులో విచారణకు వచ్చింది. పిటిషనర్ తరఫున న్యాయవాది వి.రఘు వాదనలు వినిపించారు. రాష్ట్రంలో డీఅడిక్షన్ సెంటర్ల నిర్వహణ సరిగా ఉండటం లేదని, అందులో ఎంతమంది చికిత్స పొందారనే వివరాలు ఏపీ అధికారుల వద్ద లేవని అన్నారు. ఈ దశలో ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. రాష్ట్ర ప్రభుత్వాలకు మద్యం విక్రయాల ద్వారా అత్యధిక రెవెన్యూ వస్తుందని, ఈ నేపథ్యంలో అమ్మకాలను నియంత్రించే చర్యలు ప్రభుత్వాలు తీసుకోవని తెలిపింది. పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేసింది.



చిత్రజ్యోతి

SINCE 1965

మానవత్వానికే మాయని మచ్చ

పహల్గాం ఉగ్ర దాడిపై చిత్ర పరిశ్రమ దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. పర్యాటకులపై జరిగిన ఉగ్రవాదుల కాల్పుల ఘటనను ఖండిస్తూ పలువురు సినీ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు.



అమాయక ప్రజలు, పర్యాటకులను బలిగొన్న భయంకరమైన, హృదయ విదారకమైన దాడి ఇది. ఘటన జరిగిన తీరు గురించి తెలుసుకుంటుంటే మనసు వికలమైంది. క్షమించరాని క్రూరమైన చర్య ఇది. బరువెక్కిన హృదయంతో మరణించిన వారి కుటుంబాలకు నా సానుభూతి తెలియజేస్తున్నాను. వారికి జరిగిన నష్టం పూడ్చలేనిది. - **చిరంజీవి**





ఉగ్రదాడి హేయం... అణచడమే మన ధ్యేయం. వికృత చర్యలపై విక్రమిద్దాం... కశ్మీరం మనదే సదా... పోరాడుదాం పద... అసువులు బాసిన అమాయక పౌరులందరికీ నా అశ్రునివాళి! - **బాలకృష్ణ**

పహల్గాం దాడి ఘటన తీవ్రంగా కలచివేసింది. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో ఒక్కటిగా నిలబడదాం. ఇలాంటి దాడుల ద్వారా దేశ ఐక్యతను విచ్ఛిన్నం చేయలేరు. మన సాయుధ దళాలపై నాకు పూర్తి నమ్మకం ఉంది. కలసికట్టుగా ఈ కష్టకాలాన్ని అధిగమిద్దాం. జనసేన పార్టీ మూడు రోజుల పాటు సంతాప దినాలను పాటిస్తుంది. మా పార్టీ జెండాను అవనతం చేస్తున్నాం. - **పవన్ కల్యాణ్**



ఇది చీకటి రోజు. పహల్గాం దాడి ఘటనతో చాలా బాధపడ్డాను. క్రూరత్వానికి వ్యతిరేకంగా కలసి నిలబడే శక్తి మనకు లభిస్తుందని ఆశిస్తున్నాను. బాధిత కుటుంబాలకు ఈ విషాదం నుంచి బయటపడే శక్తి లభించాలి. - **మహేశ్‌బాబు**



పహల్గాం ఉగ్రదాడి తీవ్రంగా బాధించింది. ఇలాంటి ఘటనలకు మన సమాజంలో స్థానం లేదు. బాధిత కుటుంబాలను చూస్తుంటే హృదయం బరువెక్కుతోంది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలుపుతున్నా. - **ఎన్టీఆర్**



పహల్గాం ఘటన గురించి నాలో చెలరేగిన బాధను, కోపాన్ని మాటల్లో చెప్పలేకపోతున్నాను. మనమంతా ఒక్కటిగా నిలిచి ఇలాంటి హేయమైన చర్యలకు వ్యతిరేకంగా పోరాడుదాం. - **షారూఖ్‌ఖాన్**

భూతల స్వర్గం కశ్మీర్, తీవ్రవాద చర్యలతో నరకంగా మారుతోంది. వారికి అమాయక ప్రజలు లక్ష్యంగా మారుతున్నారు. అమాయకుల ప్రాణాలు హరించడం హేయమైన చర్య. - **సల్మాన్‌ఖాన్**

ఇది క్షమార్హం కాని నేరం. ఈ ఉగ్రచర్యపై అందరూ మౌనం వీడాలి. వారిపై ప్రతీకారం తీర్చుకోవాలి. తగిన విధంగా బుద్ధి చెప్పాలి. - **సంజయ్‌దత్**









ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 43.0
కనిష్ఠం : 26.0

ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు
పోటాపోటీ

ఈ ఏడాది పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించడంలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులు పోటీపడ్డారు. అందరికంటే అత్యధికంగా ఏలూరు శాంతినగర్ ఆక్స్‌ఫర్డ్ హైస్కూలు విద్యార్థిని బళ్ల గగనశ్రీ 597/600 స్ట్రైక్ రేట్‌తో మార్కులు సాధించి ఈ ఏడాది 'పది' పరీక్షల జిల్లా టాపర్‌గా నిలిచింది. ఆమె తల్లిదండ్రులు వ్యాపార రంగంలో ఉన్నారు. ఇక ప్రభుత్వ పాఠశాలల నుంచి టాపర్లలో ఆగిరిపల్లి మండలం ఎం.సురవరం జడ్పీహెచ్ఎస్ విద్యార్థి గిడుతూరి జనార్ధన్ బాబు 588మార్కులు, మండవల్లి మండలం లింగాల జడ్పీ హెచ్ఎస్ విద్యార్థి బాసా ధీరజ్‌సాయి విశాల్ 587 మార్కులు, కలిదిండి జడ్పీహెచ్ఎస్ నాయుడు హర్షవర్ధిని, కామవరపుకోట జడ్పీహెచ్ఎస్ చిలుకుబత్తుల సూర్యదీప్తిలకు 586 మార్కులు సాధించారు. చింతలపూడి జడ్పీహెచ్ఎస్ కానూరి పూజిత 585, పెదపాడు మండలం వీరమ్మకుంట జడ్పీహెచ్ఎస్ కలిపిండి నిహారిక 584, ఏలూరు రూరల్ మండలం శనివారపుపేట జడ్పీహెచ్ఎస్ సుంకర లక్ష్మీపూజ 583, ఆగిరిపల్లి జడ్పీ హెచ్ఎస్ నక్కా హేమ నాగ త్రివేణి, మండవల్లి జడ్పీహెచ్ఎస్ నందూరి లక్ష్మీసంహితలకు 582 మార్కులు చొప్పున, కైకలూరు జడ్పీహెచ్ఎస్ సేకం ప్రణతి వైష్ణవి, ఏలూరు శనివారపుపేట జడ్పీ హెచ్ఎస్ అడిగర్ల నవీన్‌కు 581 మార్కులు చొప్పున వచ్చాయి.

నూరు శాతం ఉత్తీర్ణత సాధించిన ప్రభుత్వ పాఠశాలలు

చాట్రాయి మండలం సి.గుడిపాడు జడ్పీ హెచ్ఎస్, ద్వారకాతిరుమల జడ్పీ హెచ్ఎస్, కుక్కునూరు మండలం వేలేరు కేజీబీవీ, నూజివీడు మండలం అగిరిపల్లి జడ్పీ హెచ్ఎస్, అప్పలరాజుగూడెం ఏపీ రెసిడెన్షియల్ స్కూలు నూరుశాతం ఉత్తీర్ణతను నిలబెట్టుకున్నాయి.

పదోతరగతి పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో జిల్లాకు 77.24శాతం ఉత్తీర్ణతతో రాష్ట్రంలోని 26 జిల్లాల్లో 21వ స్థానం దక్కింది. గత ఏడాది ఉత్తీర్ణతతో పోల్చితే ఈ ఏడాది 3 శాతం తగ్గినప్పటికీ, రాష్ట్రస్థాయిలో 25వ స్థానంలో నిలవగా ప్రస్తుతం 21 స్థానంలో ఉండడం ఊరట కలిగించే విషయం. జిల్లాలో పది పరీక్షలకు మొత్తం 22,365 మంది విద్యార్థులు హాజరుకాగా, 17,274మంది ఉత్తీర్ణులయ్యారు. బాలికలు 11,197 మందికి 9,128మంది ఉత్తీర్ణులయ్యారు. బాలురు 11,168మందికి 8,146 మంది విజయం సాధించారు.



పది పరీక్షల్లో 77.24% ఉత్తీర్ణత

రాష్ట్రంలో 21 స్థానంలో నిలిచిన ఏలూరు జిల్లా

ఫలితాలపై సంతృప్తి

పది పరీక్ష ఫలితాలపై ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే ఏడాది మరింత మెరుగైన ఫలితాల కోసం కృషిచేస్తాం. ఫెయిలైన విద్యార్థులను అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు సన్నద్ధం ఆయా హైస్కూళ్లలో ప్రత్యేక తరగతులను ప్రారంభిస్తాం. రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కోరుకునే బాలబాలికలు మే 1లోగా సంబంధిత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. మే 19 నుంచి 28 వరకు జరిగే సప్లిమెంటరీ పరీక్షలకు ఫీజును అపరాధ రుసుంలేకుండా ఈ నెల 30 వరకు, రూ.50 పెనాల్టీతో పరీక్ష తేదీ ముందు రోజు వరకు చెల్లించే వెసులుబాటు ఉంది.

- వెంకటలక్ష్మమ్మ, డీఈవో

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పది పరీక్ష ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా స్థానం మెరుగుపడినా ఉత్తీర్ణతా శాతం గత ఏడాది కంటె తగ్గింది. మెరుగైన ఫలితాలకోసం అన్ని ప్రభుత్వ హైస్కూళ్లలో పండుగ రోజులు, సెలవు దినాలు సహా ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహించారు. తుది ఫలితాల్లో ఆశించిన ఉత్తీర్ణత దక్కలేదు. ఈ ఫలితాలు 'నిజంగా కష్టపడి చదివి' పరీక్షలు రాసిన విద్యార్థులవని ఒక విద్యాధికారి విశ్లేషించగా, ప్రాథమిక స్థాయి నుంచి పునాది లేకుండా ఒకేసారి టెన్త్ పరీక్షల్లో మెరుగైన ఫలితాలు ఆశించడం సరికాదని మరో విద్యాధికారి అభిప్రాయపడ్డారు. బాగా చదివేవారిని విభజించి వారికి పాఠ్యాంశాల బోధన కొనసాగిస్తూనే, వెనుకబడిన విద్యార్థులకు తొలి మూడు నెలల కాలంలో చదవడం, రాయడం వంటి బేసిక్స్‌పై తర్ఫీదు నిచ్చిన అనంతరమే పూర్తిస్థాయిలో బోధించడం ద్వారా మంచి ఫలితాలను తీసుకురావచ్చని సుదీర్ఘ అనుభవం ఉన్న మరో విద్యాధికారి పేర్కొన్నారు.

'ఓపెన్' టెన్త్‌లో వైఫల్యం

దూరవిద్య పరీక్షల నిర్వహణలో జిల్లాలో కఠినతరమైన తనిఖీల ప్రభావంతో అభ్యాసకులు పొరుగు జిల్లాలకు వెళ్లిపోతున్న విషయం విదితమే. ఈ ఏడాది ఓపెన్ స్కూల్స్ టెన్త్ పరీక్షలకు జిల్లాలో 746మంది విద్యార్థులు హాజరుకాగా కేవలం 92మంది (12.33శాతం)మాత్రమే ఉత్తీర్ణత సాధించారు. పరీక్షల్లో 'ఓపెన్ బుక్' పద్ధతిని నిరోధిస్తుండడమే జిల్లాలో ఉత్తీర్ణత భారీగా తగ్గిపోడానికి కారణమని ఓ విద్యాధికారి కుండబద్దలుకొట్టారు. ఇక దూరవిద్య ఇంటర్మీడియట్ పరీక్షలకు 955 మంది విద్యార్థులు హాజరుకాగా 366మంది (38.32శాతం) ఉత్తీర్ణులయ్యారు. వచ్చేనెల 19 నుంచి జరిగే దూరవిద్య సప్లిమెంటరీ పరీక్షలకు టెన్త్ విద్యార్థులు సబ్జెక్టు ఒక్కింటికి రూ.100చొప్పున, ఇంటర్ విద్యార్థులు సబ్జెక్టు ఒక్కింటికి రూ.150చొప్పున ఈ నెల 26నుంచి మే 5వ తేదీవరకు ఏపీ ఆన్‌లైన్‌ద్వారా చెల్లించాలని డీఈవో సూచించారు.

వెనుకబడిన జడ్పీ ఉన్నత పాఠశాలలు

పరీక్షలకు హాజరైన విద్యార్థుల్లో సంఖ్యాపరంగా జిల్లాలోని 179 జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచి మొత్తం 10,161మంది హాజరుకాగా, వీరిలో 6612మంది (65.07శాతం) ఉత్తీర్ణులయ్యారు.178 ప్రైవేటు అన్‌ఎయిడెడ్ హైస్కూళ్ల నుంచి మొత్తం 8405 మంది బాలబాలికలు హాజరుకాగా 7974మంది (94.87 శాతం) విజయం సాధించి జిల్లాలో టాప్‌స్థానంలో నిలిచారు. ఇక పరీక్షలకు వందల సంఖ్యలోనే విద్యార్థులు హాజరైన ఎయిడెడ్ పాఠశాలల నుంచి 572 మందికి 379 మంది, ఏపీ రెసిడెన్షియల్ 238 మందికి 236, బీసీ వెల్ఫేర్ 40 మందికి 38, ప్రభుత్వ హైస్కూల్స్‌లో 518 మందికి 290, కేజీబీవీ 107 మందికి 104, మునిసిపల్ పాఠశాలల నుంచి 761మందికి 481, సోషల్‌వెల్ఫేర్ 621 మందికి 557, ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాలల్లో 618 మందికి 427, ట్రైబల్‌వెల్ఫేర్ ఆశ్రం గురుకులాల్లో 324 మందికి 176మంది ఉత్తీర్ణులయ్యారు. ఉత్తీర్ణులలో అత్యధికంగా ఫస్ట్ డివిజన్‌లో 7169మంది ప్రైవేటు అన్‌ఎయిడెడ్ పాఠశాలల నుంచి ఉండగా, తదుపరి స్థానంలో 3925మందితో జడ్పీ హైస్కూళ్లు ఉన్నాయి. ఏలూరులోని పాఠశాలల్లో జిల్లాలోనే అత్యధికంగా 838 మంది విద్యార్థులు ఫెయిలయ్యారు.

వివిధ సబ్జెక్టుల్లో ఫెయిల్యూర్స్..

పది పరీక్షలు రాసిన విద్యార్థులు 5091 మంది ఉండగా, అత్యధికంగా 3549 మంది జడ్పీ ఉన్నత పాఠశాలల నుంచే ఉండడం గమనార్హం. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి ఫెయిలైన మొత్తం బాలబాలికల్లో తెలుగు సబ్జెక్టులో 1328 మంది, హిందీ 626, ఇంగ్లీషు 2221, గణితం 3734, సైన్స్ 3225, సోషల్ స్టడీస్ 2945 మంది ఉన్నారు.

ఐఏఎస్ కావడమే లక్ష్యం



పదిలో కలిదిండి జడ్పీ హైస్కూల్ విద్యార్థిని ఎన్.హర్షవర్ధిని 586 మార్కులు సాధించింది. ఐఏఎస్ కావడమే తన లక్ష్యమని తెలిపింది. తల్లిదండ్రుల సహకారంతో కష్టపడి చదవడంతో మంచి మార్కులు వచ్చాయి. ఉపాధ్యాయులు ఉత్తమ బోధన చేశారని తెలిపింది.

- కలిదిండి, ఆంధ్రజ్యోతి

సివిల్స్ ర్యాంక్ సాధిస్తా



సివిల్ మంచి ర్యాంక్ సాధించి దేశానికి సేవ చేయడమే లక్ష్యమని బాస ధీరజ్ సాయి విశాల్ అన్నారు. లింగాల జడ్పీ ఉన్నత పాఠశాలలో చదివి 587 మార్కులు సాధించి ఏలూరు జిల్లాలో ద్వితీయ స్థానంలో నిలిచాడు. తండ్రి బాస రవికుమార్ ఫొటోగ్రాఫర్. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సివిల్స్‌కు సిద్ధమవుతానని విశాల్ ఆత్మవిశ్వాసంతో చెప్పాడు.

- మండవల్లి, ఆంధ్రజ్యోతి

ట్రిపుల్ ఐటీకి వెళతా



కామవరపుకోట జడ్పీ హైస్కూల్ విద్యార్థిని చిలుకుబత్తుల సూర్యదీప్తి పదో తరగతిలో 586 మార్కులు సాధించింది. పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించానని చెప్పింది. తల్లిదండ్రులు కూలి పనులు చేసి కష్టపడి తనను చదివించారని, ప్రభుత్వం సహకరిస్తే ట్రిపుల్ ఐటీలో చేరతానంది.

- కామవరపుకోట, ఆంధ్రజ్యోతి

ఐఐటీలో ఇంజనీరింగ్ లక్ష్యం



స్థానిక సుబ్బరాజు హైస్కూల్‌లో చదివిన కె.పూజిత 585 మార్కులు సాధించింది. ఐఐటీలో ఇంజనీరింగ్ చేయడం తన లక్ష్యమని తెలిపింది. తల్లిదండ్రుల ప్రోత్సాహం వల్లే సాధించానని చెప్పింది.

- చింతలపూడి, ఆంధ్రజ్యోతి



గోనె సంచులను పరిశీలిస్తున్న జేసీ

ధాన్యం సంచులు సిద్ధం

జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి

భీమడోలు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : గుండుగొలనులో ధాన్యం కొనుగోలు కేంద్రాలను జాయింట్ కలెక్టర్ ధాత్రిరెడ్డి బుధవారం పరిశీలించారు. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సంచుల వివరాలు, కొనుగోలు లక్ష్యం సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో ధాన్యం కొనుగోలుకు గోనె సంచులు సిద్ధం ఉన్నాయన్నారు. సంచులు కూడా నాణ్యతగా ఉన్నాయన్నారు. జిల్లా వ్యవసాయాధికారి హబీబ్‌బాషా, ఏవో ఉషారాణి, ఏడీఏ ఉషారాజకుమారి, రైతులు పాల్గొన్నారు.

10లోగా ఎన్‌సీడీ సర్వే పూర్తి చేయాలి : కలెక్టర్

ఏలూరు అర్బన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్, బీపీ, మధుమేహం, తదితర అసంక్రమిత వ్యాధుల నియంత్రణలో భాగంగా ఇంటింటా చేపట్టిన ఎన్‌సీడీ సర్వే మే 10లోగా పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. ఎన్ఆర్‌పేట అర్బన్ హెల్త్ సెంటర్‌ను మంగళవారం ఆమె సందర్శించారు. ఆమె ఎన్‌సీడీ సర్వేపై వైద్యాధికారులతో సమీక్షించారు. నిర్దేశిత సర్వే రోజువారీ లక్ష్యాలను పూర్తిచేయనివారికి షోకాజ్ నోటీసులు జారీచేయాలని ఆదేశించారు. ఎన్‌సీడీ ప్రోగ్రాం ఆఫీసర్ నరేంద్రకృష్ణ, మెడికల్ ఆఫీసర్ ప్రగతి, తహసీల్దార్ శేషగిరి పాల్గొన్నారు.



మెడికల్ కళాశాల హాస్టల్‌కు స్థల పరిశీలన

ఏలూరు క్రైం, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ఏలూరు మెడికల్ కళాశాలకు సీనియర్ హాస్టల్ బ్లాక్స్ నిర్మాణానికి కలెక్టర్ కె.వెట్రిసెల్వి బుధవారం స్థలం పరిశీలించారు. కలెక్టరేట్ సమీపంలోని సుమారు 1.55 సెంట్లు ఏటిగట్టు స్థలాన్ని ఆమె పరిశీలించారు. జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ శేషగిరి, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

పశువైద్యంపై సర్వే

వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో పశుసంవర్ధకశాఖ నిర్వీర్యం అయ్యింది. గత ఐదేళ్లలో ఆసుపత్రుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, నూతన భవనాలు నిర్మించడం గానీ జరగలేదు. కనీసం ఉన్న పాత భవనాల మరమ్మతులకు కూడా వైసీపీ ప్రభుత్వం నిధులను విడుదల చేయలేదు. గత ఐదేళ్లలో డాక్టర్లు, సిబ్బంది నియామకాలు చేయకపోవడంతో వైద్యం కూడా కుంటుపడింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలో వచ్చిన 10 నెలల్లో పశు సంవర్ధక శాఖను పటిష్టం చేయడానికి సర్వే చేస్తున్నారు. పశువుల ఆస్పత్రులలో సౌకర్యాలు మెరుగుపరిచి, డాక్టర్లు, సిబ్బందిని నియమించేందుకు చర్యలు చేపడుతున్నారు.

పారదర్శక సేవలకు ప్రభుత్వం కసరత్తు
పశు సంవర్ధక శాఖ జేడీ గోవిందరాజు



ఆంధ్రజ్యోతి ఫోన్ ఇన్

- పశువుల ఆసప్రత్రుల్లో సౌకర్యాల కల్పన
- గ్రామాల్లో పారదర్శకంగా వైద్య సేవలు
- నూతన భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు

ఏలూరు/ఏలూరు టుటౌన్(ఆంధ్రజ్యోతి), ఏప్రిల్ 23: జిల్లాలో పాడి పశువుల రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వారి సమస్యలు అధికారుల దృష్టికి తీసుకెళ్లడానికి బుధవారం ఆంధ్రజ్యోతి ఫోన్‌ఇన్ చేపట్టింది. రైతులు ప్రస్తావించిన సమస్యలపై పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ టి.గోవిందరాజు సమాధానం ఇచ్చారు. ఆస్పత్రి భవనాలన్నీ పాతబడిపోయామని, వర్షాలొస్తే ఆస్పత్రుల్లో నీరు చేరి మందులు కూడా తడిసిపోతున్నాయని రైతులు తెలిపారు. డాక్టరు, సిబ్బంది అందుబాటులో ఉండరని, వైద్యం సకాలంలో అందక పశువులకు జబ్బులు పెరిగిపోవడం, చనిపోవడం జరుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. త్వరలో డాక్టర్లు పోస్టుల భర్తీకి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది. పారదర్శకంగా సేవలందించేందుకు పర్యవేక్షణపై జేడీ సమాధానాలు..

- పెదగొన్నూరులో పశువుల ఆసుపత్రి కూలి పదేళ్లయింది. పక్కనే షెడ్లలో వైద్యం అందించడం ఇబ్బందిగా ఉంది.

- సత్యనారాయణ, పెదగొన్నూరు, ముదినేపల్లి మండలం

జేడీ: పశువుల ఆసుపత్రి నిర్మాణానికి ప్రతిపాదనలతో ప్రభుత్వానికి నివేదికను పంపాం. నాబార్డు ఆర్ఐడీఎఫ్ నుంచి నిధులు మంజూరు కావాలి. రాగానే నిర్మాణం చేపడతాం.

- సానారుద్రవరంలో డాక్టర్ అందుబాటులో లేక పశువులకు వైద్యం సకాలంలో అందడం లేదు. ఆస్పత్రి భవనం శిథిలం కావడంతో వర్షం వస్తే మందులు తడిచిపోతున్నాయి.

- ఎన్ సుబ్బారావు సానారుద్రవరం, కలిదిండి మండలం

జేడీ: డాక్టర్ పోస్టు భర్తీ చేయాల్సి ఉంది. పొరుగున ఉన్న డాక్టర్‌ను ఇన్‌చార్జిగా నియమించాం. డాక్టర్ అందుబాటులో లేని సమయంలో వెటర్నరీ అసిస్టెంట్లు వైద్యం అందిస్తారు. ఆసుపత్రి నిర్మాణానికి చర్యలు తీసుకుంటాం.

- పశువుల ఆసుపత్రి ఆవరణ దుర్వాసన వస్తోంది. డాక్టర్లు కూడా సరిగ్గా అందుబాటులో ఉండరు.

- లక్ష్మణ్, భీమడోలు

జేడీ: ఆసుపత్రి ఆవరణ పరిశుభ్రంగా ఉంచేందుకు చర్యలు తీసుకుంటాం. జిల్లాలో వెటర్నరీ డాక్టర్ల పోస్టులు 18 ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం భర్తీ చేయగానే ఇక్కడ డాక్టర్‌ను నియమిస్తాం. ప్రస్తుతం ఇన్‌చార్జి డాక్టర్ వైద్య సేవలందిస్తున్నారు.

- ఇంత వరకు మా గ్రామంలో పశువులకు వెటర్నరీ సిబ్బంది గాలికుంటు వ్యాధి టీకాలు టీకాలు వేయలేదు.

- మధుసూధనరావు, శివపురం, చింతలపూడి మండలం

జేడీ: మా సిబ్బంది ఇంటింటికి తిరిగి గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తున్నారు. ఇంకా జరుగుతూనే ఉంది. ప్రాధాన్యతా క్రమంలో కొంచెం ఆలస్యం అయి ఉండవచ్చు. ఈరోజే సిబ్బందిని పంపి పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తాం

- ఇటీవల మా పశువులకు జబ్బు చేసింది. పశువుల ఆసుపత్రి సిబ్బంది అందుబాటులో లేరు.

- జి.నాగేశ్వరరావు, జనార్ధనవరం, చాట్రాయి మండలం

జేడీ: పశువుల ఆసుపత్రిలో సిబ్బంది లేకపోవడం వాస్తవం కాదు. ఈ విషయంపై విచారణ చేస్తాం. ప్రస్తుతం ఇన్‌చార్జి డాక్టర్ ఈదర నుంచి వచ్చి సేవలందిస్తున్నారు. పశువులకు బీమా చేయించడానికి స్థానికంగా సిబ్బందిని సంప్రదించండి.

- వెటర్నరీ సిబ్బంది ఇంజక్షన్లు చేస్తే గంటల్లోనే పశువులు చనిపోతున్నాయి. మా పిల్లికి ఇంజక్షన్ వేయించగానే చనిపోయింది. గతంలో కూడా ఇలా జరిగింది.

- అక్బర్ బాషా, జగన్నాధపేట, పోలవరం మండలం

జేడీ: ఇంజక్షన్ ఇవ్వగానే చనిపోవడం అనేది జరగదు. పశువులకు వ్యాధి ముదిరిన తర్వాత తీసుకువచ్చి ఉంటారు. విచారణ చేసి నిజాలను తేల్చుతాం.

- మా ఊరిలో పశువుల ఆసుపత్రి లోతట్టు ప్రాంతంలో ఉండడంతో వర్షాకాలం వర్షపు నీటితో నిండిపోతోంది.

- కృష్ణమోహన్, బుట్టాయగూడెం గ్రామం

జేడీ: ఆ ప్రాంతాన్ని మా సిబ్బంది పరిశీలించి, తగు నివేదిక తయారు చేస్తారు. అనంత రం ప్రభుత్వానికి మరమ్మత్తులకు నిధుల కోరతాం.

- పశువైద్యశాలలో సిబ్బంది, డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో సీజనల్ వ్యాధులకు గురవుతున్నాయి. పశువైద్య శిబిరాలు నిర్వహించడం లేదు.

- ఎం మోహన్, చాటపర్రు, ఏలూరు రూరల్ మండలం

జేడీ: చాటపర్రులో డాక్టర్, సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4.30 వరకు అందుబాటులో ఉంటున్నారు. సీజనల్ వ్యాధులకు ఎప్పటికప్పుడు టీకాలు వేస్తున్నాం. ప్రత్యేక పశువైద్య శిబిరాలు నిర్వహించేలా తగు చర్యలు తీసుకుంటాం.

- మాదేపల్లిలో వెటర్నరీ సిబ్బంది కొరత ఉంది. సంచార పశువైద్య అంబులెన్స్ అందుబాటులో లేవు.

- కె.మోహన్‌రావు, మాదేపల్లి, ఏలూరు రూరల్ మండలం

జేడీ: పశువులకు అనారోగ్యం సోకితే సిబ్బందిని సంప్రదించండి. ఆసుపత్రికి తీసుకురాలేని పరిస్థితి ఉంటే సిబ్బంది ఇంటికి వచ్చి వైద్య సేవలందిస్తారు. సంచార వైద్య సేవల అంశంపై ప్రభుత్వం పరిధిలో ఉంది.



పట్టిసీమ డీసిల్టేషన్ పాయింట్

ఇసుక కష్టాలు తీర్చేలా

- పట్టిసీమ, గూటాలలో 43,201 మెట్రిక్ టన్నుల లభ్యత
- పడవల ద్వారా వెలికితీత

ఏలూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు భవన నిర్మాణాలకు వేసవి, వర్షాకాలాల్లో ఇసుకను అందుబాటులో ఉంచేందుకు జిల్లా యంత్రాంగం చర్యలు చేపట్టింది. పోలవరం మండలంలో పట్టిసీమ డీసిల్టేషన్ పాయింట్ నుంచి గతంలో నిలిపివేసిన ప్రాంతం నుంచే మళ్లీ ఇసుకను బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా వెలికితీతకు జిల్లా యంత్రాంగం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. గోదావరిలో నీటి ప్రవాహం తగ్గుముఖం పట్టినందున పట్టిసీమ పాయింట్ నుంచి రెండు, మూడు రోజుల్లో ఇసుక వెలికితీత చేపట్టాలని జిల్లా ఇసుక కమిటీ నిర్ణయం తీసుకుంది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనలో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో ప్రజల అవసరాలకు ఇసుకను నిల్వ చేయాలని ఆదేశించారు. ఈ మేరకు అధికారులు అడుగులు వేస్తున్నారు. పట్టిసీమ నుంచి బోట్స్‌మెన్ సొసైటీల ద్వారా పడవలపై ఇసుకను ఒడ్డుకు తేనున్నారు. జిల్లాలో డీసిల్టేషన్ పాయింట్ నుంచి 30 వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు యంత్రాంగం పర్యావరణ అనుమతులను సాధించగా, ఫిబ్రవరి 23 నాటికి 1799 మెట్రిక్ టన్నులను వెలికి తీశారు. ఇప్పుడు మిగిలిన బ్యాలెన్స్ నిల్వలు 28,201 మెట్రిక్ టన్నులను ఇసుకను ప్రజా అవసరాలకు వినియోగించనున్నారు. ఇక్కడ ఒక మెట్రిక్ టన్ను ఇసుక ధరను రూ.229 జిల్లా కమిటీ నిర్దేశించింది. ఇక్కడ తీసిన ఇసుక రెండు నెలల అవసరాలకు సరిపోతుందని అంచనా. దీంతో పాటు గూటాల -1 పాయింట్ నుంచి మరో 15వేల మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలకు యంత్రాంగం అనుమతులు పొందినట్లు జిల్లా గనులశాఖ డీడీ రవికుమార్ తెలిపారు. మొత్తం మీద 43,201 మెట్రిక్ టన్నుల ఇసుక జిల్లా అవసరాలకు అందుబాటులోకి రానుంది.

సమష్టి కృషితో లక్ష్య సాధన

- ఆర్అండ్ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలపై దృష్టి పెట్టాలి
- పీజీఆర్ఎస్‌లో అర్జీల పరిష్కారానికి ప్రాధాన్యమివ్వాలి
- మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశం

ఏలూరు/ఏలూరు సిటీ, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పేదలకు 'సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అందించే బాధ్యత మనపై ఉంది. పోలవరం ప్రాజెక్టు ఆర్ అండ్ ఆర్ కాలనీలో మౌలిక సదుపాయాలు కల్పించే అంశంపై దృష్టిపెట్టాలి. సమష్టి కృషితో అన్నిరంగాల్లో లక్ష్యాలను సాధిద్దాం' అని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ సూచించారు. ఏలూరు కలెక్టరేట్‌లో బుధవారం ల్యాండ్ అసైన్‌మెంట్ కమిటీ, ఇతర కార్యక్రమాల అమలు తీరుపై బుధవారం ఆయన సమీక్షించారు. ఏలూరు జిల్లాను ప్రగతి పథంలో ఐదో స్థానం నుంచి మూడో స్థానానికి తీసుకురావాలని, ల్యాండ్ అసైన్‌మెంట్‌లో భాగంగా ప్రతీ నియోజకవర్గంలో ప్రణాళికబద్ధంగా ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు చేసి పరిశ్రమల ఏర్పాటుకు అనుకూల పరిస్థితులు కల్పించాలన్నారు. పీ-4 కింద ప్రతీ కుటుంబంలో ఒకరికి ఉపాధి, పారిశ్రామిక వేత్తలను తయారు చేయడానికి కృషి జరగాలన్నారు. త్వరలో తల్లికి వందనం కింద రూ.9,407 కోట్లు విడుదల చేస్తామని, తాగునీటికి అత్యధిక ప్రాధాన్యతనిచ్చి నీటి ఎద్దడి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే పీజీఆర్ఎస్‌లో అర్జీలను వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని పరిష్కరించాలన్నారు. కలెక్టర్ కె.వెట్రిసెల్వి, జేసీ పి.ధాత్రిరెడ్డి, డీఆర్వో వి.విశ్వేశ్వరరావు, సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, అధికారులు పాల్గొన్నారు.



ఏలూరులో మాట్లాడుతున్న మంత్రి నాదెండ్ల మనోహర్ చిత్రంలో కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ ధాత్రిరెడ్డి

ధాన్యం కొనుగోలులో సమస్యలు తలెత్తకూడదు

రబీ ధాన్యం కొనుగోలులో రైతులకు సమస్యలు తలెత్తకుండా రైస్ మిల్లర్లు మానవతా దృక్పథంతో వ్యవహరించాలని మంత్రి మనోహర్ స్పష్టం చేశారు. కలెక్టరేట్‌లో పలు జిల్లాల రైస్‌మిల్లర్ల ప్రతినిధులు, ఎగుమతిదారులతో ధాన్యం కొనుగోలుపై సమీక్షించారు. రైతు ఉత్పత్తులకు గిట్టుబాటు ధరకు మించి రావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రానున్న వాతావరణ పరిస్థితులు దృష్టిలో పెట్టుకుని రైతుల నుంచి ధాన్యం కొనుగోలును ముమ్మరం చేయాలన్నారు.

- బుట్టాయగూడెం : ఏజెన్సీలో పండే పంటలకు గిట్టుబాటు ధర లేక గిరిజనులు నష్టపోతున్నారని ఆ పరిస్థితిని మారుస్తూ గిరిజన, హస్తకళల ఉత్పత్తులకు జాతీయస్థాయిలో మార్కెటింగ్ సౌకర్యాలు క ల్పించేలా గిరిజన సహకార సొసైటీని బలోపే తం చేస్తామని మంత్రి మనోహర్ హామీ ఇచ్చారు. బుధవారం రెండోరోజు పర్యటనలో భాగంగా పులిరాముడుగూడెంలో ఆయన పర్యటించారు.

చాట్రాయి, కలిదిండిలలో 80 శాతం ఉత్తీర్ణత

నూజివీడు, కైకలూరు నియోజకవర్గాల్లో టెన్త్ ఫలితాల్లో అధిక సంఖ్యలో విద్యార్థులు సత్తా చాటారు. ముఖ్యంగా చాట్రాయి, కలిదిండి మండలాల్లో 80 శాతం చొప్పున విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఆ తర్వాత స్థానాల్లో ముసునూరు, మండవల్లి, కైకలూరు, ఆగిరిపల్లి, నూజివీడు, ముదినేపల్లి మండలాలు నిలిచాయి.

టెన్త్ ఫలితాల్లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

కైకలూరు..70శాతం ఉత్తీర్ణత



ప్రశాంతి వైష్ణవి

కైకలూరు, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో కైకలూరు మండల ంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు 70శాతం ఉత్తీర్ణత సాధి ంచారు. మండలంలోని 8 జిల్లా పరిషత్ హైస్కూళ్ళ నుంచి 392మంది పరీక్షలు రాయగా 275మంది ఉత్తీర్ణులయ్యారు. కైకలూరు హైస్కూల్ 61శాతం, జాన్‌పేట హై స్కూల్ 77శాతం, ఆటపాక ప్రభుత్వ హైస్కూల్ 70శాతం, భుజబలపట్నం జెడ్పీహైస్కూల్ 77శాతం, ఆలపాడు హైస్కూల్ 69శాతం, దొడ్డి పట్ల హైస్కూల్ 71శాతం, కొల్లేటికోట హైస్కూల్ 64శాతం, తామరకొల్లు హైస్కూల్ 63శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈవో డి.రామారావు తెలిపారు. మండలంలో 600 మార్కులకు 581 మార్కులు సాధించి ఆటపాక ఎస్ఎన్ఎన్ ప్రభుత్వ హైస్కూల్ విద్యార్థిని ఎస్.ప్రశాంతి వైష్ణవి మండలస్థాయిలో ప్రథమస్థానం సాధి ంచగా , 571మార్కులు సాధించి కైకలూరు హైస్కూల్ విద్యార్థిని టి రూపశ్రీ, 564 మార్కు లు సాధించి జాన్‌పేట హైస్కూల్ విద్యార్థిని ఆర్.మౌనిక ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు.

నూజివీడు..67 శాతం ఉత్తీర్ణత

నూజివీడు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్ర జ్యోతి): టెన్త్ ఫలితాల్లో నూజివీడు మండలంలోని పాఠశా లలు 67శాతం ఉత్తీర్ణత సాధించినట్లు నూజివీడు డీవైఈవో సేవియ్యానాయక్ తెలిపా రు. నూజి వీడు మండలంలో 11 జిల్లాపరిషత్ ఉన్నత పాఠ శాలలకు గాను 862మంది పరీక్షల కు హాజరు కాగా 592మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించా రు. నూజివీడు మండలంలోని దిగవల్లి, చాట్రాయి మండలంలోని గుడిపాడు, పాఠశా లలు నూరుశాతం ఫలితాలు సాధించాయి.

ముదినేపల్లి.. 63 శాతం ఉత్తీర్ణత



రెడ్డి సందేష్

ముదినేపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతి పరీక్షల్లో ముదినేపల్లి మండల ంలోని ప్రభుత్వ పాఠ శాలల విద్యార్థులు 63 శాతం ఉత్తీర్ణత సాధిం చారు. మండలంలోని ఎనిమిది జిల్లా పరిషత్ హైస్కూళ్ల నుంచి 404 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, 248 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. మండలం లోని పెదగొన్నూరు జిల్లా పరిషత్ హైస్కూలు విద్యార్థులు 82 శాతం ఉత్తీర్ణతను సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. ఇదే హైస్కూలుకు చెందిన రెడ్డి సందేష్ 600 మార్కులకు గాను 573 మార్కులు సాధించి మండల స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిచినట్లు ఎంఈవో కె.నరేష్ కుమార్ తెలిపారు. మండలం లో మండల స్థాయిలో 565 మార్కులు సాధించి ముదినేపల్లి హైస్కూలు విద్యార్థి బొర్రా త్రివేణి గురజ హైస్కూలు విద్యార్థిని తొందూరు లహరి శ్రీ మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించ గా, 561 మార్కులతో వడాలి హైస్కూలు విద్యార్థి వై.ఉషస్విని తృతీయ స్థానంలో నిలిచింది.

ముసునూరు.. 75శాతం ఉత్తీర్ణత



కె.సాయి సింధు

ముసునూరు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): ముసునూరు మండలంలో పదవ తరగతి పరీక్షల్లో 75 శాతం మంది విద్యార్తులు ఉత్తీర్ణులైనట్లు ఎంఈవో బి.వి.యస్ సుబ్బారావు తెలిపారు. జడ్పీ పాఠశాలల పరిధిలో చెక్కపల్లి పాఠశాలకు చెందిన వి.దివ్య హర్షిణి 571 మార్కులతో మండలం టాపర్‌గా నిలించింది. గురుకుల బాలికల పాఠశాలకు చెందిన కొప్పుల సాయి సింధు 578 మార్కులు సాధించి సత్తాచాటింది. ముసునూరు గురుకుల బాలికలు పదవ తరగతి పరీక్షల్లో 99శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ కె.ప్రవీణ తెలిపారు. కె.సాయి సింధు 578 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం సాధించింది. టి.సాహితి, ఎం.ప్రియాంకలు 571 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలువగా 569మార్కులతో వి.హరిక తృతీయ స్థానంలో నిలిచింది. బాలికలకు ఎస్ఎంసీ చైర్మన్ సాయిల పంగిడియ్య అభినందించారు.

మండవల్లి.. 72శాతం ఉత్తీర్ణత

మండవల్లి ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండవల్లి మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 72శాతం ఉత్తీర్ణత సాధించారు. విశ్వశాంతి, విశ్వభారతి ప్రైవేటు పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. లింగాల పాఠశాల విద్యార్థి బి.ధీరజ్ సాయివిశాల్ 587మార్కులతో మండల ప్రథమస్థానం, మండవల్లి పాఠశాల విద్యార్థిని ఎస్.లక్ష్మీ సమీత రెండో స్థానం సాధించారు. సైదు జయభారతి 568 మార్కులు సాధించింది.

చాట్రాయి..80.5 శాతం ఉత్తీర్ణత



పరసా రేవతి

చాట్రాయి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండ లంలో టెన్త్ ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలు 80.5 శాతం ఫలితాలు సాధించినట్లు ఎంఈవో వీఎస్‌వి బ్రహ్మచారి తెలి పారు. సి.గుడిపాడు హైస్కూల్ 100 శాతం, చిన్నంపేట హైస్కూల్ 80 శాతం, చిన్నంపేట హైస్కూల్ 80 శాతం, చాట్రాయి హైస్కూల్ 72.7 శాతం, చనుబండ హైస్కూల్ 81 శాతం, పోలవరం హైస్కూల్ 80.7 శాతం, మర్లపాలెం హైస్కూల్ 75.4 శాతం ఉత్తీర్ణత సాధించాయని తెలిపారు. చిన్నంపేట జడ్పీ హైస్కూల్ విద్యార్థిని పరసా రేవతి (576 మార్కులు), మర్లపాలెం జడ్పీ హైస్కూల్ విద్యార్థిని గుర్రం నిఖిల(575 మార్కులు)తో ప్రథమ, ద్వితీయ స్థానాలలో నిలిచారు. ప్రైవేటు పాఠశా లలకు చెందిన విద్యార్థులు మొత్తం 165 మంది పరీక్షలు రాయగా 154 మంది 93 శాతం ఉత్తీర్ణులు అయ్యారని, చాట్రాయి వికాస్ స్కూల్ విద్యార్థిని అందె అక్షయ 577 మార్కులు, చనుబండ ఉషోదయ స్కూల్ విద్యార్థి కోపూరి తిరుపతిరావు 576 మార్కులలో ప్రైవేటు స్కూల్స్‌లో ప్రథమ ద్వితీయ స్థానాలలో నిలిచారని ఎంఈవో తెలిపారు.

కలిదిండి.. 80 శాతం ఉత్తీర్ణత

కలిదిండి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో పది ఫలితాల్లో ప్రభుత్వ పాఠశాలల్లో 80 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని ఎంఈవో శ్రీనివాసరావు తెలిపారు. పెదలంక జడ్పీ హైస్కూల్‌లో 76.92 శాతం, తాడినాడ జడ్పీ హైస్కూల్‌లో 83.33 శాతం, ఆరుతెగలపాడు జడ్పీ హైస్కూల్ 78.64, భాస్కరావుపేట జడ్పీ హైస్కూల్‌లో 88.89 శాతం, చినతాడినాడ జడ్పీ హైస్కూల్ 63.33 శాతం, గుర్వాయిపాలెం జడ్పీ హైస్కూల్‌లో 81.82 శాతం, కలిదిండి జడ్పీ హైస్కూల్‌లో 77.85 శాతం, కొండంగి జడ్పీ హైస్కూల్‌లో 76.09 శాతం, కోరుకొల్లు జడ్పీ హైస్కూల్‌లో 63.92 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు.

ఆగిరిపల్లి..69.8 శాతం ఉత్తీర్ణత

ఆగిరిపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి మండలంలోని యం.సురవరం జడ్పీ హైస్కూల్ విద్యార్థి జి.జనార్ధనబాబు మండలం టాపర్‌గా 588 మార్కులు సాధించాడు. ఆగిరిపల్లి జడ్పీ హైస్కూల్ విద్యార్థి నక్కా హేమ నాగ త్రివేణి 582 మార్కులతో మండలం రెండోస్థానం సాధించారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 378 పది పరీక్షలు హాజరుకాగా అందులో 264 మంది ఉత్తీర్ణత (69.8)శాతం పొందినారు.

తాగునీటి చెరువుల్ని నింపుకోవాలి


కలిదిండి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా తాగునీటి చెరువులను పూర్తిగా నింపుకోవాలని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం వెంకటాపురం, సానారుద్రవరం గ్రామాల్లో తాగునీటి చెరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంతుల వారీగా అన్ని గ్రామాల్లో తాగునీటి చెరువులను నింపటానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. తాగునీటి చెరువులకు నీటి వంతు వెళ్తుండగా, కాల్వల్లో తాగునీరును చేపల చెరువులకు మళ్లిస్తే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు కురేళ్ల ఏడుకొండలు, వెంకటాపురం, సానారుద్రవరం సర్పంచ్‌లు గూడవల్లి శ్రీనివాసరావు, నున్న రాజేశ్వరమ్మ, కృష్ణబాబు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈ కృష్ణారావు పాల్గొన్నారు.

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కామినేని శ్రీనివాస్ అన్నారు. బుధవారం కలిదిండి రైతు భరోసా కేంద్రంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు.



వెంకటాపురం తాగునీటి చెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



నేత్ర వైద్యశాల భవనానికి శంకుస్థాపన

ముదినేపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : దుర్గా ఆర్ట్స్ అధినేత, సినీ నిర్మాత డాక్టర్ కెఎల్ నారాయణ వితరణతో తన స్వగ్రామమైన ముదినేపల్లి మండలం పెదగొన్నూరు పంచాయతీపరియాల్లో నిర్మించనున్న నేత్ర వైద్యశాల భవనానికి బుధవారం ఎన్‌డీఏ నాయకులు శంకుస్థాపన చేశారు. ఎన్‌డీఏ నాయకులు పరసా ఏడుకొండలు, గుడివాడ వేణు, వీరంకి వెంకటేశ్వరరావు, నాగిరెడ్డి శివ ప్రసాద్, డీసీ చైర్మన్ గుడిసేవసురేష్, మిల్క్ సొసైటీ అధ్యక్షుడు బత్తుల రవి పాల్గొన్నారు.

ఎక్సైజ్ దాడులు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):నూజివీడు మండలం దేవరగుంట గ్రామానికి చెందిన నక్కా కుమారిని అదుపులోకి తీసుకుని రెండు లీటర్ల సారాను స్వాధీన పరుచుకోవడంతో పాటు అదే గ్రామానికి చెందిన నక్కా భద్రాచలంను అదుపులోకి తీసుకుని మరో రెండులీటర్ల సారాను స్వాధీన పరుచుకున్నామని ఎక్సైజ్ సీఐ ఏ.మస్తానయ్య తెలిపారు. వీరికి సారా సప్లై చేస్తున్న సిద్ధార్థనగర్ తండాకు చెందిన అజ్మీరానాజీ పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కుమార్ విద్యార్థినికి డివిజన్‌లో ప్రథమస్థానం


డివిజన్‌లో ప్రథమస్థానం సాధించిన కె.డింపుల్‌ను అభినందిస్తున్న పి.వి కుమార్

నూజివీడు, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):పదవ తరగతి పరీక్ష ఫలి తాల్లో నూజివీడు కుమార్ విద్యా సంస్థల విద్యార్థిని కె.డింపుల్ డివి జన్‌లో ప్రథమస్థానం సాధించి నట్లు పాఠశాల కరస్పాండెంట్ పి.సంధ్యాలక్ష్మి తెలిపారు. బుధవారం ఆమె మాట్లాడుతూ 10వ తరగతి ఫలితాల్లో తమ పాఠశాలకు చెందిన కె.డింపుల్ 600 మార్కులకు గాను 596 మార్కులు సాధించినట్లు తెలిపారు. మొత్తం 192మంది విద్యార్థులకు గాను 188మంది పాస్ అవ్వగా, ఇందులో 590కి పైగా మార్కులు సాధించిన వారు 8మంది ఉన్నారన్నారు. మరో 80మంది 550కి పైగా మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా కుమార్‌విద్యాసంస్థల చైర్మన్ పి.వి కుమార్ విద్యార్థినిని అభినందించారు.

త్రివిధ విద్యార్థుల ప్రతిభ


చందన శ్రీ

నూజివీడు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):పదవ తరగతి ఫలితాల్లో నూజివీడు త్రివిధ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభాపాటవాలు కనబరిచినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శ్రీనివాస్ తెలిపారు. పదవ తరగతి పరీక్షలకు 202 మంది విద్యార్థులు హాజరుకాగా 76 మంది 550 మార్కులకు పైబడి సాధించినట్లు ఆయన తెలిపారు. తమ పాఠశాల విద్యార్థిని బి.చందనశ్రీ 600మార్కులకు గాను 594 మార్కులు సాధించినట్లు ఆయన తెలిపారు.

సాయిప్రణీత విజయభేరి

నూజివీడు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):నూజివీడు సాయిప్రణీత పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫలితాల్లో నూరుశాతం ఫలితాలు సాధించడంతో పాటు 500కు పైబడి 18మంది మార్కులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ కానూరి అనురాధ తెలిపారు. మొత్తం 36మంది పరీక్షలకు హాజరుకాగా 50శాతం మంది 500మార్కులకు పైబడి మార్కులు సాధించగా, ఎం.గాయత్రి 600మార్కులకు గాను 586 మార్కులు సాధించిందన్నారు. ఇక వి.లీపిక 580 మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కరస్పాండెంట్ కానూరి సాయిఫణీంద్ర అభినందించారు.

మినుములు మద్దతు ధరకే అమ్మండి


వడాలిలో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న ఏడీఏ వెంకట మణి

ముదినేపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి) : మినుము పంటకు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర పొందాలంటే ముదినేపల్లి మండలం దేవరపూడి సొసైటీలో ఏర్పాటు చేసిన మార్క్‌ఫెడ్ కొనుగోలు కేంద్రంలో రైతులు తమ మినుములను అమ్ముకోవాలని మండవల్లి ఏడీఏ జి వెంకట మణి తెలిపారు. మండలంలోని పెదపాలపర్రు, వడాలి రైతు సేవా కేంద్రాల్లో బుధవారం వ్యవసాయ శాఖ పచ్చిరొట్ట సాగు మినుము కొనుగోళ్ళపై నిర్వహించిన అవగాహన కార్యక్రమాల్లో ఆమె మాట్లాడుతూ రైతులు ప్రైవేటు మార్కెట్‌లో మినుములు తక్కువ ధరకు అమ్మి నష్టపోవద్దని, ప్రభుత్వం ప్రకటించిన క్వింటాలుకు రూ.7400 మార్క్‌ఫెడ్ కేంద్రాల్లో పొందవచ్చునని తెలిపారు. వడాలిలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను ఆమె రైతులకు పంపిణీ చేశారు. ఏఓ వేణుమాధవ్ కూడా పాల్గొన్నారు.

గేదె దొంగ అరెస్టు

చాట్రాయి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తుమ్మగూడెం గ్రామానికి చెందిన పశుపోషకుడు కంచర్ల దశరథంకు చెందిన గేదెను ఈనెల 17వ తేదీ రాత్రి దొంగించారు. బాధితుడి ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి, నిందితుడు తుమ్మగూడెంకు చెందిన చిట్టిపోతుల చెన్నారావును అరెస్ట్ చేసి, గేదె చోరీకి ఉపయోగించిన వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రామకృష్ణ తెలిపారు.

ఘనంగా శోభనాపురం హైస్కూల్ వార్షికోత్సవం

ఆగిరిపల్లి, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):ఆగిరిపల్లి మండలంలోని శోభనాపురం గ్రామంలోని మండలపరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల వార్షికోత్సవానికి మండల విద్యాశాఖ అధికారులు సర్వేశ్వరరావు, ఆనంద్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు యామిని కృష్ణప్రియ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. సర్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రీ హైస్కూల్ నుంచి హైస్కూల్‌గా అప్‌గ్రేడ్ అయినందున ఉపాధ్యాయులను అభినందించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. శోభనాపురం గ్రామానికి చెందిన రావి శ్రీనివాసరావు, సురేఖ దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా పాఠశాలకు రెండు కంప్యూటర్లను బహూకరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నక్కనబోయిన విజయలక్ష్మి, ఈదర స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ శారద, ఈదర పిహెచ్‌సి ఆర్.నాగ జ్యోత్స్న, నక్కనబోయిన వేణు, ఎస్‌ఎంసీ చైర్మన్ దాసరి రాంప్రసాద్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

వేతనాలు ఇవ్వాలని ఉపాధి కూలీల ఆందోళన

చాట్రాయి, ఏప్రిల్ 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నంపేటలో ఉపాధిహామీ పథకం పని ప్రదేశంలో బుధవారం తమకు 3 నెలల వేతనాలు వెంటనే విడుదల చెయ్యాలని కోరుతూ కూలీలు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ అనుబంధ వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కొమ్ము ఆనందం మాట్లాడుతూ 3 నెలల నుంచి వేతనాలు ఇవ్వకపోవటంతో కూలీలు పూట గడవక అవస్థలు పడుతున్నారని, కనీసం మందులు కొనుక్కోవటానికి చేతిలో చిల్లిగవ్వ లేక వారి బాధలు వర్ణనాతీతంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిల కోసం కూలీలు ఎదురు చూస్తున్నారన్నారు. వెంటనే ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ వేతనాలు కూలీల బ్యాంకు ఖాతాలకు జమ చెయ్యాలని ఆనందం డిమాండ్ చేశారు.

రఘునాథుని హుండీ ఆదాయం లెక్కింపు

నూజివీడు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి రఘునాథస్వామి దేవస్థానం హుండీ ఆదాయాన్ని దేవదాయధర్మాదాయశాఖ అధికారులు మంగళవారం లెక్కించారు. అధికారులు, భక్తుల సమక్షంలో జరిగిన ఈ లెక్కింపులో 1,61,363 ఆదాయంగా లభించినట్లు దేవదాయధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ కె.అనురాధ తెలిపారు.

యూపీఎస్‌సీలో శివానికి 11వ ర్యాంకు



నూజివీడు టౌన్, ఏప్రిల్ 23 (ఆంధ్రజ్యోతి):యూపీఎస్‌సీలో రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్అండ్ టెక్నాలజీ పూర్వ విద్యార్థిని సాయిశివానీ జాతీయస్థాయిలో ప్రథమస్థానం సాధించినట్లు యూనివర్శిటీ రిజిస్ట్రార్, నూజివీడు ట్రిపుల్‌ఐటీ డైరెక్టర్ ఎస్.అమరేంద్రకుమార్ తెలిపారు. ఆర్జీయూకేటీ పరిధిలోని ఒంగోలు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో మొదటి బ్యాచ్‌లో ఈసీఈ విభాగంలో ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ విద్యను అభ్యసించిన సాయిశివానీ యూపీఎస్‌ఈ సివిల్ సర్వీసెస్ 2024 పరీక్షల్లో అఖిలభారతీయస్థాయిలో 11వ ర్యాంకు సాధించిందన్నారు. ఈ సందర్భంగా ఆమెను ఛాన్సలర్ కె.మధుమూర్తి, వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, ఒంగోలు డైరెక్టర్ భాస్కర్ పాటిల్ తదితరులు అభినందించారు.